thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 198 కరీంనగర్ గురువారం, 26 సెప్టెంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వరుస రైలు ప్రమాదాల వేళ 'రైల్ రక్షా దళ్'

న్యూఢిల్లీ : దేశంలో రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ రైల్వే తొలిసారి 'రైల్ రక్షా దళ్'ను ఏర్పాటు చేసింది. ప్రమాద సమయాల్లో సత్వరం ఘటనా స్థలికి చేరుకుని సహాయం అందించే సామర్థ్యం ఈ రైల్ రక్షా దళ్‌కు ఉంటుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతానికి దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా వాయువ్య రైల్వే జోన్‌లో ప్రవేశ పెట్టామని, త్వరలో దేశవ్యాప్తంగా ప్రవేశపెడతామని చెప్పారు. కవచ్ పనితీరును పరిశీలించేందుకు జైపూర్ వెళ్లిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ప్రమాద సమయాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలను వాడుకుంటున్నామని ఇకపై రైల్ రక్షా దళ్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

# బతుకమ్మ చీరలు బంద్!?

## మహిళలకు పండగ కానుకగా రూ. 500!

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

# జనాలు మెచ్చేలా...!




హైదరాబాద్ : తెలంగాణలో బతుకమ్మ పండగ సందడి షురూ కానుంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలి బతుకమ్మ పండగకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది.

ఈ చీరల పట్ల కొంతమంది మహిళలు హర్షం వ్యక్తం చేస్తే..కొంతమంది నుంచి వ్యతిరేకత వచ్చింది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరింది. అయితే ఈ సారి బతుకమ్మ పండగకు బతుకమ్మ చీరలు కాకుండా కొత్త కానుక ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈసారి బతుకమ్మ చీరలకు బదులుగా రూ. 500 ఇవ్వాలని సంబంధిత వివరాలు కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని సమాచారం. బతుకమ్మ పండగ అనేది తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండగ.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. ఫ్రీ బస్సు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రూ. 2500 మహిళల ఖాతాల్లో జమ చేయడం వంటివాటిపై కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తోంది. అయితే మరో పది రోజుల్లో బతుకమ్మ పండగ మొదలుకానుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చీరలకు బదులుగా ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ. 500 నగదు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. రూ. 500 లేదంటే ఆపైనా అందించేందుకు కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. ఎందుకంటే గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల్లో నాణ్యత కొరవడిందనే వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది రేవంత్ రెడ్డి సర్కార్. ఇక ఈ నగదును కూడా మహిళల ఖాతాల్లో జమ చేయడానికి రేషన్ కార్డును ప్రాతిపాదికన తీసుకునే విధంగా ప్లాన్ చేస్తోంది. వారి చేతికి ఇవ్వాల అని కూడా పరిశీలన చేస్తోందని సమాచారం. డ్వాక్రా గ్రూపుల ద్వారా ఈ కానుక అందించే ప్రయత్నం చేస్తోంది. అయితే ఈ విషయంపై మరో మూడు రోజుల్లో క్లారిటీ వస్తుందట. ఇప్పటికే చేనేత వారికి కూడా చీరలకు ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం. ఇది చేనేతకు ఉపాధిని కూడా అందిస్తోంది. ఒకవేళ చీరలకు బదులుగా నగదు ఇచ్చినట్లయితే చేనేత కార్మికల ఉపాధికి అడ్డుగా మారుతుంది. కాబట్టి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సిందే.



## ఆర్.కృష్ణయ్యతో ఎంపీ మల్లు రవి భేటీ.. రాజకీయ వర్గాల్లో ఆసక్తి

హైదరాబాద్: బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి భేటీ అయ్యారు. దీంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ఆర్.కృష్ణయ్య వైకాపా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. మంగళవారం ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కృష్ణయ్యతో మల్లు రవి సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది. ఆయన కాంగ్రెస్‌లో చేరతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే దీనిపై ఆర్.కృష్ణయ్య స్పందించాల్సి ఉంది. కుల గణన ఉద్యమాన్ని బలోపేతం చేయడానికే ఎంపీ పదవికి రాజీనామా చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆర్.కృష్ణయ్య మంగళవారం ప్రకటించారు. బీసీ ఉద్యమం గ్రామ స్థాయికి చేరిందన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పెంపును సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణలో తొలి ఉప ఎన్నిక జరగబోతుందా..!?



## కేటీఆర్‌లో కొత్త కసి!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ప్రస్తుతం హాట్ హాట్ గా ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యేలు పోతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ ఫిరాయింపులు, ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫిరాయింపుల నేపథ్యంలో, అరికెపూడి గాంధీ మరియు కౌశిక్ రెడ్డి మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడంపై కౌశిక్ రెడ్డి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన వ్యక్తికి ఈ పదవి ఇవ్వడం సరికాదని ఆయన వాదించారు. ఈ వివాదం కేసులకు దారితీసింది. నలుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ విషయంలో స్పందించి, అసెంబ్లీ స్పీకర్‌కు పలు ఆదేశాలు జారీ చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఫిరాయింపులను తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంపై కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆ నియోజకవర్గంలో తప్పకుండా ఉప ఎన్నికలు జరగాలని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నికల ఉత్కంఠ మొదలైంది. కేటీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ, రైతులను, నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారని, కానీ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నేతల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. వారు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీనే గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఫిరాయింపులు, వివాదాలు, ఉప ఎన్నికల ఉత్కంఠతో రాష్ట్ర రాజకీయ వర్గాలు అప్రమత్తంగా ఉన్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలి.




## మూసీ వైపు దూసుకెళ్లనున్న

# హైడ్రా బుల్డోజర్లు

హైదరాబాద్: హైడ్రా బుల్డోజర్లు ఈసారి మూసీవైపు దూసుకెళ్లనున్నాయి. ఈ వారాంతంలో మూసీ ఆక్రమణల కూల్చివేతలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. శని, ఆదివారాల్లో భారీగా మూసీ ఆక్రమణలను కూల్చివేయనున్నట్టు తెలుస్తోంది. ఆ రెండు రోజుల్లో కూల్చివేతలు పూర్తి చేసేలా హైడ్రా టార్గెట్ నిర్దేశించుకుంది. డే అండ్ నైట్ కూల్చివేతలు చేసేలా హైడ్రాకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. గోల్నాక, చాదర్‌ఘాట్, మూసారంబాగ్.. మూసి ఆక్రమణల కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో 1,350 మందికి హైడ్రా నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్లను హైడ్రా మార్క్ చేసింది. కాగా మూసీ నివాసితుల కోసం ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించింది. బుధవారం మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో మూసీ నివాసితుల ప్రాంతాలకు కలెక్టర్లు వెళ్లనున్నారు. మూసీ ఆక్రమణల వివరాల సేకరణను రెవెన్యూ, హైడ్రా అధికారులు ప్రారంభించారు. వారం రోజుల్లో ప్రజలను ఒప్పించి ఇళ్లను ఖాళీ చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు..** కాగా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా అక్కడ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించిన క్రమంలో నిర్వాసితుల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మూసీ పరీవాహక ప్రాంతంలో పదివేల కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మరింతగా ఉంటుందని.. సుమారు 16 వేల కుటుంబాలుండొచ్చని అంచనా వేస్తున్నారు. వీళ్లందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలన్న సీఎం ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, అధికారుల బృందం బుధవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. తొలి విడతలో రివర్ బెడ్‌లోని 1600 ఇళ్లను తొలగించే ప్రక్రియ వెంటనే మొదలవుతుందని చెప్పారు. తర్వాత బఫర్ జోన్‌లోని నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే పేదల ఇళ్లతో పాటు చెరువులు, నాలాల వద్ద ఉంటున్న పేద కుటుంబాల వివరాలను కూడా సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ భరోసా కల్పించే ప్రయత్నం చేయాలన్నారు. ఒక్క పేద కుటుంబం కూడా రోడ్డున పడకూడదని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రో ల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి వాటి ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా వీటికి సంబంధించిన నివేదికను తయారుచేయాలన్నారు. ప్రతి ఆక్రమణలో అర్హులైన పేదలకు విధిగా పరిహారం అందేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.



# మూసీ ఆక్రమణలపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

హైదరాబాద్, సెప్టెంబర్ 25: మూసీ ఆక్రమణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. ఇదే విషయమైన బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1,600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించినట్లు దాన కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసి పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు. దాదాపు 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని దాన కిషోర్ తెలిపారు. రివర్ బెడ్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పునరావాస కార్యాచరణకై సంబంధిత జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించిన తర్వాతనే ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభమవుతోందన్నారు. బఫర్ జోన్‌కు సంబంధించి భూ సేకరణ, పునరావాస చట్టం ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని దాన కిషోర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి వచ్చిన తరువాత చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇస్తామన్నారు. ఆ తరువాత మాత్రమే భూసేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని దాన కిషోర్ తెలిపారు. మూసీ పరిధిలోని నిర్వాసితులు అనవసరమైన అపోహలకు లోను కావొద్దని, అర్హులందరికీ పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు.

# నిరుద్యోగ యువత డిమాండ్-సప్లయ్ సూత్రం గుర్తుంచుకోవాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను గుర్తించి అన్ని శాఖల్లో భర్తీ ప్రక్రియ చేపట్టామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా స్కిల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పోదు. దీని తీవ్రతను మా ప్రభుత్వం గుర్తించింది. ఏటా 3లక్షల మంది పట్టాలు తీసుకుని బయటకు వస్తున్నారు. ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడాం. ఎలాంటి కోర్సులు చదివిన వారు కావాలని వారిని అడుగుతున్నాం. నిరుద్యోగ యువత డిమాండ్-సప్లయ్ సూత్రం గుర్తుంచుకోవాలి. డిగ్రీ చదివేవారు భవిష్యత్తు దిశగా ఆలోచించాలి. కొందరు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడం లేదు. బ్యాంకులు, బీమా రంగాల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయి. నాయకుడిగా రాణించాలన్నా నైపుణ్యం ఉండాలి. ఉద్యోగాలు, ఉపాధి లేకుంటే చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ విష వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ సమస్య నిర్మూలనకు కార్యక్రమం చేపట్టాం. ప్రభుత్వం ఒక్కటే దీన్ని పరిష్కరించలేదు. అందరూ కలిస్తేనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలి. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**త్వరలో మరో 35వేల పోస్టులు భర్తీ చేస్తాం..** "ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు ఉండటం లేదు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడం. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తాం. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో 30లక్షల మంది నమోదు చేసుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా 60లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. డీఎస్సీ, గ్రూప్స్ విభాగాల్లో మరో 35వేల ఉద్యోగాల భర్తీ చేపట్టాం. త్వరలో మరో 35వేల పోస్టులు భర్తీ చేస్తాం. ఎంత చదువుకున్నా నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయి" అని సీఎం అన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి మాకు అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు: మంత్రి ఉత్తమ్

జడ్చర్ల: తమకు అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు 'పాలమూరు-రంగారెడ్డి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పర్యటించారు. కిష్టారంలోని ఉదండాపూర్ జలాశయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రూ.27,500 కోట్లు ఖర్చు చేసి ఎకరాకు కూడా నీరివ్వలేదన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను కూడా భారాస ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేస్తామన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులకు రూ.45 కోట్లు విడుదల చేశామన్నారు. అనంతరం గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను మంత్రులు పరిశీలించారు.



# భారత భూభాగాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం సరికాదు : సుప్రీంకోర్టు



దిల్లీ: భారత్‌లోని ఏ ప్రాంతాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మందలించారు. అది దేశ ప్రాదేశిక సమగ్రతకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఓ కేసు విచారణ సందర్భంగా కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలకు సంబంధించి సుమోటో ప్రొసీడింగ్స్‌ను విరమించుకుంటూ సీజేఐ ఈవిధంగా స్పందించారు. న్యాయమూర్తి బహిరంగ క్షమాపణ చెప్పడంతో సుమోటో కేసును మూసివేస్తున్నట్లు తెలిపింది. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇటీవల ఓ భూవ్యవహారానికి సంబంధించిన కేసులో హైకోర్టు జడ్జి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానంద విచారణ చేపట్టారు. ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌తో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే కాక, ఈ కేసును వాదించిన మహిళా న్యాయవాది పైనా తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారమంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది. కోర్టుల్లో న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాల్సిన అవసరాన్ని జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే.

# పోలీసు కస్టడీకి జానీ మాస్టర్.. అనుమతించిన కోర్టు



హైదరాబాద్: అత్యాచార ఆరోపణలు, పోక్సో కేసులో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. నాలుగు రోజుల పాటు కస్టడీ ఇస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ఆదేశాలు జారీ చేసింది. థర్డ్ డిగ్రీ ప్రయోగించవద్దని.. అవసరమైతే న్యాయవాది సమక్షంలో విచారించాలని సూచించింది. ప్రస్తుతం జానీ మాస్టర్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదుతో ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతి నేపథ్యంలో జానీ మాస్టర్‌ను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. ఈనెల 28 వరకు నార్సింగి పోలీసులు ఆయన్ను ప్రశ్నించనున్నారు.



# మూసీ ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే అవసరం ఉందా?: కేటీఆర్

హైదరాబాద్: తమ హయాంలో హైదరాబాద్‌ను మురికి నీటి రహిత నగరంగా మార్చాలనే గొప్ప లక్ష్యంతో ఎస్టీపీ(మురుగు శుద్ధి కేంద్రం)లను ప్రారంభించామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఫతేనగర్ ఎస్టీపీ(మురుగు శుద్ధి కేంద్రం)ని ఆ పార్టీ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులతో కలిసి పరిశీలించారు. వీటి నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోందని విమర్శించారు.

అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. తమ హయాంలో మొత్తం 31 ఎస్టీపీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.3,866 కోట్లతో మురుగునీటి శుద్ధి కార్యక్రమం ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మూసీ సుందరీకరణ అంటోందని ఎద్దేవా చేశారు. దీని కోసమే రూ.వేలు, లక్షల కోట్లు అంటే అందరికీ అనుమానం వస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అనేక అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఎస్టీపీల పెండింగ్ పనులను ఈ ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

హైడ్రా పేరుతో పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం జరుగుతోందని చెప్పారు. మరోవైపు కూకట్‌పల్లి ఎస్టీపీని కేటీఆర్, భారాస నేతలు పరిశీలించనున్నారు. "మూసీ సుందరీకరణ పేరుతో కుంభకోణం జరుగుతోంది. దీని టెండర్లను పాకిస్థాన్ కంపెనీలకు కట్టబెడుతున్నారు. ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీ నదిలోకి వెళ్తోంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మళ్లీ శుద్ధి ఎందుకు? ఈ ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే అవసరం ఉందా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.




# అమీన్‌పూర్ పెద్దచెరువు ఆక్రమణలపై దృష్టి సారించిన హైడ్రా

అమీన్‌పూర్: సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ పెద్ద చెరువు ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించింది. అక్కడి పరిసరాలను అధికారులు సర్వే చేశారు. పెద్ద చెరువు కబ్జా చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కట్టారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి.

దీంతో అమీన్‌పూర్ పెద్ద చెరువును అధికారులు సర్వే చేశారు. గోల్డెన్ కీ, వెంకరమణ కాలనీలో రెవెన్యూ అధికారులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. వాణీనగర్, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ పరిసరాల్లో సర్వే చేశారు. నవ్య చౌరస్తాలో అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చివేశారు. గతంలో ఇక్కడే నిర్మాణాలు కూల్చి మాజీ ఎమ్మెల్యేపై హైడ్రా కేసు నమోదు చేసింది. ఇటీవల కూకట్‌పల్లి నల్లచెరువు, అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో హైడ్రా అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణమైన 25 విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు సహా 44 నిర్మాణాలను కూల్చివేశారు. షెడ్లు, ఇతర నిర్మాణాల వద్ద వాటి యజమానులు, లీజుకు తీసుకున్నవారు ఆందోళన చేస్తుండడంతో పోలీసులు వారిని ఇతర ప్రాంతాలకు తరలించారు.

# ప్రెస్‌మీట్‌లో జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించిన కేటీఆర్.. ఎందుకంటే?




జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' సినిమా మరికొన్ని గంటల్లోనే థియేటర్లలో సందడి చేయబోతోంది. అయితే రెండు రోజుల క్రితం నిర్వహించతలపెట్టిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ అనూహ్యంగా రద్దయింది. ఎన్టీఆర్ అభిమానులు అంచనాలకు మించి హైదరాబాద్ నగరంలోని నోవాటెల్ హోటల్‌కు తరలి రావడంతో చిన్నపాటి గందరగోళం ఏర్పడింది. దీంతో భద్రతా కారణాల రీత్యా ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భాన్ని ప్రస్తావిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ ఇవాళ (బుధవారం) ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ మండిపడ్డారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఫంక్షన్‌కు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించలేదని విమర్శలు గుప్పించారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పోలీసులు చేతులెత్తేశారని, తాము అధికారికంలో ఉన్నప్పుడు సినిమా ఫంక్షన్లు సంతోషంగా జరుపుకునే వాళ్లని కేటీఆర్ ప్రస్తావించారు. తాము సినిమా ఫంక్షన్లతో పాటు అన్ని మతాల పండుగలను సమర్థవంతంగా నిర్వహించామని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇవాళ ఫతేనగర్ ఎస్టీపీని సందర్శించిన అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

# మూసీ ప్రక్షాళనకు ముందడుగు.. అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ వద్ద మూసీ నదిలో నిర్మాణాలను ఆర్డీవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు.

నాలుగు బృందాలుగా ఏర్పడిన అధికారులు మూసీ నదిపై ఉన్న అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. నివాసాలు, దుకాణాల అనుమతుల వివరాలు సేకరిస్తున్నారు. పనులను ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చేందుకు సర్కారు సిద్ధమైంది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 16 వేల ఇళ్లను మూసీ నిర్వాసితులకు ఇచ్చేలా మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. కొన్ని నెలలుగా 3 జిల్లాల పరిధిలోని మూసీ నదిపై సర్వే జరిగింది. రెవెన్యూ అధికారులు నదిగర్భంలో,



బఫర్‌జోన్‌లో 10,200 నిర్మాణాలను గుర్తించారు.

వాటిలో ఎవరెవరు ఉన్నారో గుర్తించేందుకు బుధవారం నుంచి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

# లడ్డు వివాదం వెనక ఉంది బీజేపీనా.. జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 25: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి స్పందించారు. తిరుమల లడ్డు వివాదం వెనక బీజేపీ కుట్ర ఉందంటూ అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డు కల్తీ అయిందన్న వివాదంలో వాస్తవాలు ఏమిటి, జరిగింది ఏంటి అన్న విషయాలు మాత్రమే చర్చిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉంటాయన్నారు. ఇక్కడ జరిగిన అంశాలకంటే రాజకీయ లబ్ధి, మత పరమైన అంశాల చర్చ ఎక్కువగా జరిగి వాస్తవాలు మరుగున పడిపోతున్నాయని తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే అనుమానాలు...** రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను వెంటనే బయటపెట్టి తిరిగి కల్తీలేని లడ్డులను భక్తులకు అందించి అలాంటి దోషాలు తిరిగి జగరకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొని భక్తులకు భరోసా కల్పించాలని సూచించారు. కానీ అలా కాకుండా చంద్రబాబు దీన్ని రాజకీయం చేయడం, మత ప్రస్తావన తేవడం, జగన్ పేరు ప్రస్తావన చేయటంతో వ్యక్తిగతంగా తనకు కొన్ని అనుమానాలు వస్తున్నాయని.. బీజేపీ ఏమైనా చంద్రబాబుతో మతపరమైన రాజకీయాలకు తెరతీస్తుందా అనేది తన అనుమానం అంటూ బయటపెట్టారు. "ఎందుకంటే బీజేపీ ఎజెండానే ఎప్పుడు ప్రజా సమస్యల చుట్టూ కాకుండా మతపరమైన అంశాల చుట్టూనే ఉంటుంది. ఎమోషనల్‌గా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేయడమే బీజేపీ ఎజెండా. పరిస్థితులు చూస్తే ఏపీలో బీజేపీ ఆట మొదలుపెట్టినట్టు అనిపిస్తోంది" అంటూ వ్యాఖ్యలు చేశారు. ఏపీ రాజకీయాల్లో జగన్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించడాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా అంతా తప్పుపట్టామని.. ఒక విజన్ ఉన్న నాయకుడిగా ఆయన్ని గౌరవిస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన భాగస్వామ్యం చాలా గొప్పది అని కొనియాడారు.



# వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

ప్రకాశం జిల్లా పొదిలి మండలం బట్టువారిపల్లి వద్ద వరదలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి బట్టువారిపల్లి వద్ద ఒక్కసారిగా వాగు పొంగి పొర్లింది. దీంతో రోడ్డుపైకి భారీగా వరద నీరు చేరింది. బుధవారం ఉదయం మార్కాపురం నుండి పొదిలి వైపు వెళుతున్న కనిగిరి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు వరదలో చిక్కుకుని ఇంజిన్ ఆగిపోయింది. వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులు బస్సు దిగి.. నీటిలో నడుచుకుంటూ బయటకు వచ్చారు. స్థానికులు జేసీబీ సాయంతో బస్సును బయటకు తీసుకొచ్చారు.

## నెయ్యి కల్తీ ఘటన.. పోలీసులకు తితిదే ఫిర్యాదు



తిరుపతి: నెయ్యి కల్తీ ఘటనపై పోలీసులకు తితిదే ఫిర్యాదు చేసింది. ఏఆర్ డెయిరీ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి తూర్పు పీఎస్‌లో తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. నిబంధనలు అతిక్రమించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాములవారి ఆలయ రథానికి నిప్పు ఘటన.. వ్యక్తి అరెస్ట్



అనంతపురం: హనకనహాళ్‌లో రాములవారి ఆలయ రథానికి నిప్పు పెట్టిన ఘటనపై 24 గంటల్లో కేసును ఛేదించామని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ తెలిపారు. ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి రథానికి నిప్పు పెట్టినట్లు గుర్తించామన్నారు. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. "ఈనెల 23న ఆలయ రథానికి నిప్పు పెట్టారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు 24 గంటల్లో కేసును ఛేదించాం. ఎర్రిస్వామిరెడ్డి సోదరులు రూ.20లక్షలు వెచ్చించి 2022లో రథం చేయించారు. దీనికోసం గ్రామస్థుల నుంచి ఎలాంటి విరాళాలు సేకరించలేదు. ఈ విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో జరిగిన గొడవతో రథానికి ఎర్రిస్వామిరెడ్డి కుమారుడు ఈశ్వర్‌రెడ్డి నిప్పుపెట్టాడు. అర్ధరాత్రి పెట్రోల్ పోసి నిప్పుపెట్టినట్లు విచారణలో అంగీకరించాడు. అతడు ప్రస్తుతం వైకాపా కార్యకర్త.. అయితే దీనిలో రాజకీయ కోణం లేదు. రథానికి నిప్పు అంశంలో మరేవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం.

ఈశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేశాం" అని ఎస్పీ తెలిపారు. కణేకల్లు మండలం హనకనహాళ్‌లోని ఆలయ రథానికి సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం కలకలం రేపింది. షెడ్డులో మంటలు, పొగ వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. అప్పటికే రథం కొంతమేర కాలిపోయింది. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో ఈ ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్రంగా దర్యాప్తు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఘటనా స్థలాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్ పరిశీలించారు. వివరాలు ఆరా తీశారు. కులం, మతం, గొడవలకు సంబంధించి జరిగిన ఘటన కాదని తేల్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనేలేదు: మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ అంశంపై కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. విశాఖపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడారు. "విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనీయబోమని స్వయంగా సీఎం చంద్రబాబే చెప్పారు కదా. పాదయాత్ర సమయంలో నేను కూడా అదే చెప్పాను. గత ఐదేళ్లలో విశాఖ ఉక్కుకు ఏ కొంచెమైనా సాయం జరిగిందా? ప్రైవేటీకరణ యోచనే లేదు. వైకాపా మాత్రం ప్రతిరోజూ ఎక్స్‌లో పోస్ట్ పెడుతుంది. ఇంకా వాళ్లకు బుద్ధిరాలేదు" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## వైసీపీకి మరో షాక్.. పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే




విశాఖ వైసీపీలో మైనారిటీ కీలక నాయకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, ఉడా మాజీ చైర్మన్ ఎస్ఏ రెహ్మాన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఇవాళ (బుధవారం) రాజీనామా చేశారు. పరిపాలనలో వైసీపీ పూర్తిగా విఫలమైందని, పాలనలో అంత దారుణంగా ఫెయిల్ అయిన పార్టీలో తాను ఉండలేనని రెహ్మాన్ ప్రకటించారు. మైనారిటీల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కీలక నేతల వరుస రాజీనామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఏపీ విపక్ష పార్టీ వైసీపీకి మరో షాక్ గట్టి షాక్ తగిలింది. విశాఖ వైసీపీలో మైనారిటీ కీలక నాయకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, ఉడా మాజీ చైర్మన్ ఎస్ఏ రెహ్మాన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఇవాళ (బుధవారం) రాజీనామా చేశారు. పరిపాలనలో వైసీపీ పూర్తిగా విఫలమైందని, పాలనలో అంత దారుణంగా ఫెయిల్ అయిన పార్టీలో తాను ఉండలేనని రెహ్మాన్ ప్రకటించారు. మైనారిటీల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాగా ఎస్ఏ రెహ్మాన్ తెలుగు దేశం పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నట్టుగా తెలుస్తోంది. ఇటీవలే ఆయన ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి కలిశారు. సాధారణ భేటీయేనని, పల్లాను అభినందించడానికి వచ్చానని రెహ్మాన్ చెప్పారు. అయితే ఆయన పార్టీ మారేందుకే వచ్చారని, ఈ మేరకు చర్చలు జరిపారంటూ కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ అంచనాలు నిజమయ్యి రెహ్మాన్ సైకిల్ ఎక్కుతారా? లేక ఇంకేదైనా నిర్ణయం తీసుకుంటారా? అనేది వేచిచూడాల్సి ఉంది.

**టీడీపీలో సుధీర్ఘకాలం** : కాగా ఎస్ఏ రెహ్మాన్ 1994లో నాటి విశాఖ–1 అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఉడా చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాదు విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా చాలా కాలం కొనసాగారు. అయితే 2009లో మెగాస్టార్ చిరంజీవి స్థాపంపించి ప్రజారాజ్యం పార్టీలో చేరారు. తిరిగి 2014లో టీడీపీలోకి వెళ్లారు. అయితే 2019లో వైసీపీలో చేరారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించారు కానీ దక్కలేదు. ఇటీవల అనివార్యమైన విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అధిష్ఠానం తనకే అవకాశం ఇస్తుందని రెహ్మాన్ ఆశించారు. కానీ బొత్స సత్యనారాయణ పేరును జగన్ ఖరారు చేశారు. దీంతో రెహ్మాన్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

## ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ కన్నుమూత



ప్రకాశం, సెప్టెంబర్ 25: ఒంగోలు ఎంపీ మాగుంట కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ఒంగోలు మాజీ పార్లమెంటు సభ్యురాలు, దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి మాగుంట పార్వతమ్మ (77) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పార్వతమ్మ చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు (బుధవారం) తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఇటీవల కుమారుడు విజయబాబు మృతితో పార్వతమ్మ మరింత కృంగిపోయారు. ఆమె ఆరోగ్యం మరింత దెబ్బతిన్నది. కొంతకాలంగా పార్వతమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయితే ఆదివారం ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పార్వతమ్మకు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందజేశారు. అయితే పరిస్థితి విషమించడంతో ఈరోజు ఉదయం పార్వతమ్మ కన్నుమూశారు. పార్వతమ్మ మృతిపట్ల రాజకీయ నేతలు సంతాపం తెలియజేశారు. ఈరోజు మధ్యాహ్నం పార్వతమ్మ భౌతికకాయాన్ని నెల్లూరులోని స్వగృహానికి తరలించనున్నారు.

అభిమానుల సందర్శనార్థం రేపు(గురువారం) వరకు స్వగృహంలోనే ఉంచనున్నారు. రేపు సాయంత్రం పార్వతమ్మ అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు. మాగుంట సుబ్బరామరెడ్డి దివంగతుల్కైన తరువాత 1996లో తొలిసారిగా పార్వతమ్మ రాజకీయ రంగప్రవేశం చేసి లోక్‌సభ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఐఎన్‌సీ తరపున ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. ఆ తరువాత 2004లో ఆమె కావలి నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ఎంపికయ్యారు. ఒంగోలు ఎంపీ, కావలి ఎమ్మెల్యేగా ప్రజలకు పార్వతమ్మ నిస్వార్థ సేవలు అందించారు. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి పార్వతమ్మ వదిన.

**పార్వతమ్మ మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం** : ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం తెలియజేశారు. మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి పార్వతమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. పార్వతమ్మ ఎంపీగా, ఎమ్మెల్యేగా విశేష సేవలందించారని కొనియాడారు.



# నిందితుడు కాల్చిన ఆ రెండు బుల్లెట్లు ఎక్కడ..?

## నిందితుడు కాల్చిన ఆ రెండు బుల్లెట్లు ఎక్కడ..?: బద్లాపూర్ ఎన్‌కౌంటర్‌పై కోర్టు ప్రశ్న

ముంబయి: మహారాష్ట్రలోని థాణె జిల్లా బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు రెండు రోజుల క్రితం పోలీసుల ఎదురుకాల్పుల్లో మృతి చెందాడు. ఇది పోలీసులు జరిపిన నకిలీ ఎన్‌కౌంటర్ అని ఆరోపిస్తూ నిందితుడి తండ్రి హైకోర్టును ఆశ్రయించగా.. బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా పోలీసులను న్యాయస్థానం పలు ప్రశ్నలు సంధించింది. నిందితుడు కాల్చిన ఆ రెండు బుల్లెట్లు ఎక్కడ..? అంటూ ప్రశ్నించింది. బద్లాపూర్ పాఠశాలలో చోటుచేసుకున్న లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి విచారణ జరుగుతోన్న సమయంలోనే.. నిందితుడు అక్షయ్ శిందే (24)పై.. అతడి మొదటి భార్య పెట్టిన కేసులో ప్రశ్నించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులోభాగంగా తలోజా జైలుకు వెళ్లి.. అక్కడి నుంచి నిందితుడిని కారులో తీసుకొని బద్లాపూర్‌కు బయలుదేరారు. ముంబ్రా బైపాస్‌కు చేరుకున్న సమయంలో కారులో ఉన్న పోలీసు అధికారి తుపాకీని లాక్కొన్న అక్షయ్.. వారిపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అప్రమత్తమైన మరో పోలీస్ అధికారి నిందితుడిపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో అక్షయ్‌తోపాటు పోలీసులు గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైన నిందితుడిని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇది రాజకీయంగా దుమారం రేగుతోంది. అదే సమయంలో మృతుడి తండ్రి హైకోర్టును ఆశ్రయించారు. "ఈ ఎన్‌కౌంటర్‌కు ముందురోజు నిందితుడిని అతడి తల్లిదండ్రులు కలిశారు. పోలీసులు ఆరోపించినట్లుగా ప్రవర్తించేలా అప్పుడు అతడి మానసిక పరిస్థితి లేదు. ఈ కేసులో ఎవరికి శిక్ష విధించాలో పోలీసులు నిర్ణయిస్తున్నారు. చట్టబద్ధమైన పాలన సాగాలి. ఇలాంటి ఘటనలు పోలీసులకు చెడు ఉదాహరణలుగా ఉంటాయి" అని మృతుడి తండ్రి తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అలాగే కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని అభ్యర్థించారు. నిందితుడి మృతికి గల కారణం గురించి న్యాయస్థానం ప్రశ్నించగా.. అతడు పోలీసుల నుంచి తుపాకీ లాక్కొన్నాడని, దానిని రెండు విధాలుగా అన్‌లాక్ చేయొచ్చంటూ ప్రభుత్వం తరఫు న్యాయవాది వివరించారు. "ఇది నమ్మశక్యంగా లేదు. శిక్షణ లేకపోతే.. తుపాకీని అన్‌లాక్ చేసి, కాల్పులు జరపడం వీలుకాదు. మీరు చెప్పిన ప్రకారం అతడు మూడు బుల్లెట్లు కాల్చాడు. ఒకటి పోలీసు అధికారిని తాకింది. మిగతా రెండింటి సంగతేంటి..? అలాగే నిందితుడి మోకాలి కింద కాల్చి ఉండాల్సింది కదా..?" అంటూ కోర్టు పలు ప్రశ్నలు వేసింది. అప్పుడు పోలీసులకు ఆలోచించే సమయం లేకపోయిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది వెల్లడించారు. ఈ సమాధానంపై కోర్టు ఘాటుగా స్పందించింది. "అతడు మూడు బుల్లెట్లు కాలుస్తున్నప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు..? అతడేం భారీ మనిషికాదు. మీరు సులభంగానే అతడిని అదుపుకొని ఉండొచ్చు. దీనిని ఎన్‌కౌంటర్ అని అనలేం. ఇది ఎన్‌కౌంటర్ కాదు. అలాగే ఇంతవరకు కేసు పత్రాలు సీఐడీకి ఎందుకు అప్పగించలేదు. ఏ దర్యాప్తులో అయినా సమయం కీలకం. ఆలస్యం అవుతుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయి" అని వ్యాఖ్యానించింది. అలాగే నిందితుడిని తరలించిన మార్గంలో సీసీటీవీ కెమెరాలు ఉన్నాయా? అని ప్రశ్నించగా.. ఆ మార్గంలోని ఫుటేజీని పరిశీలిస్తామని ప్రభుత్వం బదులిచ్చింది.

## బోట్ల ఘటన.. కచ్చితంగా వైసీపీ కుట్రే



అమరావతి, సెప్టెంబర్ 25: ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్ల ఘటనలో ఖచ్చితంగా వైసీపీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేశారు. బోట్లతో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టించారని మండిపడ్డారు. విజయవాడ కలెక్టరేట్‌లో వరద బాధితులకు నష్టపరిహారాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... కనీస బాధ్యత లేకుండా ఆంబోతుల మాదిరి వ్యవహరించారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురంలో రథం కాల్చేశారన్నారు. బోట్ల విషయంలో కుట్ర పన్నిన వారిని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. "నేను అసమర్థుణ్ని కాను.. ఎవరు ఏం తప్పు చేసినా తెలిసేలా వ్యవస్థను ఎస్టాబ్లిష్ చేస్తున్నాం. ఎవరైనా కుట్రలు పన్నితే ఖబడ్దార్" అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వరద నష్ట పరిహారం కోసం 13 వేల మంది అదనంగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కొత్తగా అప్లై చేసుకున్న వారిలో అర్హులకు సాయం అందిస్తామన్నారు. అనర్హులు ఉంటే ఎందుకివ్వలేకపోయామో చెబుతామన్నారు. "నేనిక్కడ బటన్ నొక్కడం లేదు.. బటన్ నొక్కి ఫూల్స్ చేయడం లేదు. నేరుగా బాధితుల ఖాతాలకే సాయం అందిస్తున్నాం. కుమ్మరిపాలెంలోని 38 వార్డులోకి నీరే రాలేదు.. ఇళ్లు మునగలేదు. కొందరు రెచ్చగొట్టి గొడవలు క్రియేట్ చేసే ప్రయత్నం చేశారు. వరద సాయంలో ఎవరైనా కరెప్షన్‌కు పాల్పడితే సహించను. ఎవరైనా డబ్బులు తీసుకుంటే తిరిగి ఇచ్చేయాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో...** ఎన్డీఆర్ఎఫ్ గైడ్ లైన్స్ మించిన స్థాయిలో ఆర్థిక సాయం అందించామన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా బాధితులకు సాయం అందిస్తున్నామని వెల్లడించారు. చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ఆర్థిక ప్యాకేజీ ఇచ్చామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక సాయం అనేది కేంద్రం నిబంధనల్లో లేదని.. కానీ బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చామన్నారు. పంట నష్టాన్ని కూడా భారీగా పెంచామని.. సేవల్లో టెక్నాలజీని వినియోగించుకున్నామని తెలిపారు. నారాయణ, నిమ్మల, అనిత ఫీల్డులో బాగా పని చేశారని కొనియాడారు. సీనియర్ ఆఫీసర్ సిసోడియా కూడా బాగా పని చేశారన్నారు. సేవల విషయంలో ఎవ్వరూ ఊహించని విధంగా చేశామన్నారు. గృహోపకరణాలు రిపేర్లు చేయించామని.. వాహనాలకు బీమా ఇప్పించామన్నారు.

**త్వరలోనే ఆపరేషన్ బుడమేరు :** "గ్యాస్ స్టౌలు కూడా బాగు చేయించాం. చిన్న వ్యాపారస్తులకు సాయం అందించాం. లోన్లు రీ–షెడ్యూల్ చేయించాం. కొత్త లోన్లు ఇప్పించాం. సర్టిఫికెట్లని ఉచితంగా ఇప్పిస్తున్నాం. విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ ఇప్పిస్తున్నాం" అని సీఎం వెల్లడించారు. లైసెన్సుల్లేని కిరాణా షాపులకు కూడా సాయం అందించామన్నారు. భూ యజమానుకు కాకుండా వ్యవసాయం చేసే కౌలు రైతులకే బాధితులకు పరిహారం ఇచ్చామన్నారు. అలాగే ఇంటి యజమానులు నష్టపోయి ఉంటే.. వారికి.. లేకుంటే అద్దెకున్న వాళ్లకి సాయం అందించామన్నారు. త్వరలో ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇంకా కేంద్రం సమావేశాలు పెట్టుకుని.. ఏపీకి చేయాల్సిన వరద సాయంపై చెబుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ధర్మపరిరక్షణలో మార్పు మొదలైంది: మంత్రి పయ్యావుల



అమరావతి: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం, అపచారం జరగటం నిజమని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ వైకాపా తీరుపై మండిపడ్డారు. "మీరు చేసిన పాపాలు చాలు.. భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు. పాలకుడి మార్పుతో ప్రతి రంగంలో మార్పు మొదలైంది.

ధర్మప్రచారం, ధర్మ పరిరక్షణలోనూ మార్పు మొదలైంది. తప్పులు సరిదిద్దే క్రమంలో నిజాలు వెలుగులోకి వచ్చాయి. జగన్ ఇకనైనా రాజకీయాలు మానుకోవాలి"అని మంత్రి అన్నారు.

## లైంగిక వేధింపుల కేసు.. సత్యవేడు ఎమ్మెల్యేకు హైకోర్టులో ఊరట




అమరావతి: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి హైకోర్టు లో ఊరట లభించింది. ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తనను బెదిరించి అత్యాచారం చేశారంటూ తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలానికి చెందిన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా.. ఆదిమూలంపై తిరుపతి తూర్పు ఠాణా పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టేయాలంటూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల జరిగిన విచారణలో ఆయన తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.. పోలీసులు ప్రాథమిక విచారణ చేయకుండా కేసు నమోదు చేశారన్నారు. మూడో వ్యక్తి ఒత్తిడితో పిటిషనర్‌పై ఆ మహిళ ఫిర్యాదు చేశారన్నారు. 'వలపు వల' (హనీట్రాప్)గా దీనిని న్యాయవాది పేర్కొన్నారు. అత్యాచారం సెక్షన్ నమోదు చెల్లదనీ.. ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన మహిళ తరఫున న్యాయవాది కె. జితేందర్ వాదనలు వినిపించారు. ఆ మహిళ కూడా స్వయంగా కోర్టుకు హాజరై.. ఆదిమూలంపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలన్నీ అవాస్తవమని పేర్కొంటూ అఫిడవిట్‌ను హైకోర్టులో దాఖలు చేశారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని ఎమ్మెల్యేపై కేసును కొట్టేయాలని కోరారు. ఈ నేపథ్యంలో కేసును కొట్టివేస్తూ హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

## జెత్వానీ కేసులో కీలక పరిణామం.. ఐపీఎస్ విశాల్ గున్నీకి ఊరట

అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో ముంబై హీరోయిన్ కాదంబరి జెత్వానీకి వేధింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా దానిపై హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. అక్టోబర్ 1వ తేదీ వరకు గున్నీపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇక పిటిషన్‌పై తదుపరి విచారణను అక్టోబర్ 1కి హైకోర్ట్ వాయిదా వేసింది. కాగా జెత్వానీ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులను పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ కేసులో కుక్కల విద్యాసాగర్ ఏ1గా ఉండగా ఏ2గా పీఎస్సార్ ఆంజనేయులు, ఏ3గా కాంతి రాణా, ఏ4గా వెస్ట్ జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్ గున్నీ ఉన్నారు. మరోవైపు ఈ కేసులో ఏ1గా ఉన్న కుక్కల విద్యాసాగర్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. విద్యాసాగర్ ను విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.


చురకలు

## సంపాదకీయం

# బాబు మీద స్వామికి కోపం ఎందుకు...?

బీజేపీకి చెందిన నేత సుబ్రహ్మణ్య స్వామి. తమిళనాడుకు చెందిన ఈ నాయకుడు లాజిక్కులలో కింగ్. న్యాయపరమైన అంశాలలో దిట్ట. కోర్టులలో కేసులు వేయడం లోనూ ఆయన ఘనాపాటి. ఆయనకు చంద్రబాబు అంటే గిట్టదు. ఎందుకు అంటే కారణాలు తెలియవు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీతోనూ ఆయనకు ఎపుడో చెడింది. బీజేపీ 2014లో అధికారం లోకి వచ్చినపుడు మోడీకి ఫుల్ సపోర్ట్ గా ఆయన నిలిచారు. ఆయన మోడీ కేబినెట్ లో ఆర్థికమంత్రి కావాలని అనుకున్నారు అని అంటారు. అయితే మోడీ ఆయనను పక్కన పెట్టి అరుణ్ జైట్లీకి అవకాశం ఇచ్చారు. ఆయన మరణం తరువాత నిర్మలా సీతారామన్ కి చాన్స్ ఇచ్చారు. అయితే మోడీ మీద నాటి నుంచి స్వామి రగులుతూనే ఉన్నారు అని అంటారు. ఆయన బీజేపీ ఆర్థిక విధానాలను గట్టిగా ప్రశ్నిస్తూ వచ్చారు. మోడీ అధ్వర్యంలో కేంద్రం తప్పుల మీద తప్పులు చేస్తోంది అని కేంద్రంలో ఉన్న తమ పార్టీనే ఆయన నిలదీస్తూ వచ్చారు. అయితే బీజేపీ పెద్దలు మాత్రం ఆయనను పార్టీలోనే ఉంచారు. ఆయన రాజ్యసభ పదవీ కాలం 2018లో ముగిసింది కానీ రెన్యూవల్ చేయలేదు. ఇక ఏపీ సీఎం బాబు విషయంలో స్వామి ఎందుకో మొదటి నుంచి ఆగ్రహంగానే ఉంటున్నారు. అదే సమయంలో ఆయన జగన్ కి మద్దతుగా ఉంటూ వస్తున్నారు అంటారు. ఇక 2024 ఎన్నికల ముందు కూడా బీజేపీని టీడీపీతో పొత్తు పెట్టుకోవద్దు అని స్వామి గట్టిగానే వాదించారు. కానీ ఆయన మాట ఎవరూ వినలేదు. కూటమి ప్రభుత్వం ఏపీలో వచ్చింది. కేంద్రంలో ఎండీయే సర్కార్ వచ్చింది. స్వామి కొన్నాళ్ళు సైలెంట్ గా ఉన్నారు. ఇపుడు బాబు తెచ్చిన లడ్డూ ఇష్యూలోకి దూరారు. బాబు తప్పుడు మాటలు చెబుతున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు నిరాధారం అని కూడా అంటున్నారు. దాంతో పాటు శ్రీవారి విషయంలో బాబు మహాపచారం చేశారని చంద్రబాబు ప్రభుత్వం అయిదేళ్ళ పాటు కొనసాగడం డౌటే అని ఒక సంచలన కామెంట్ కూడా స్వామి చేశారు. బాబు చేసిన వ్యాఖ్యల మీద తప్పుపడుతూనే శ్రీవారి లడ్డూల ఇష్యూలో వాస్తవాలు తెలిసేలా యాక్షన్ కోరుతున్నారు. అదే సమయంలో ఆయన సుప్రీం కోర్టు ద్వారా ఏపీ ప్రభుత్వాన్ని నేరుగా ఎదుర్కోవడానికి రెడీ అయ్యారు. ఇవన్నీ ఇలా ఉంటే స్వామికి మోడీ బాబు ఇద్దరూ ప్రత్యర్ధులే కాబట్టి ఆయన అందుకే రంగంలోకి దిగారు అని అంటున్నారు. ఈ విషయంలో స్వామి కార్యం స్వకార్యం అన్నట్లుగా స్వామి వైఖరి ఉందని అంటున్నారు. ఆయన బీజేపీకి వెనకేసుకుని రావడం కూడా బీజేపీ నేతలకు ఏ మాత్రం మింగుడు పడడం లేదు. మాజీ ఎంపీ బీజేపీ నేత అన్న ట్యాగ్ తో ఆయన చేస్తున్న ఈ న్యాయ యుద్ధం ఏపీలో కూటమికి అర్థం కావడం లేదు. ఆయన వైసీపీ అనుకూలురు అని ఊరుకోవడానికి లేదు. అలాగని ఆయనకు ఎదురెళ్లడానికీ లేదు. మొత్తానికి స్వామి ఎంట్రీతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది అని అంటున్నారు. న్యాయపరమైన అంశాలలో పట్టు ఉన్న స్వామి న్యాయ సమరం ద్వారా ఏమి చేయబోతున్నారో చూడాల్సి ఉంది.

# మానవతావాది చిలకమర్తి లక్ష్మనరసింహం - సెప్టెంబర్ 26... సంఘ సంస్కర్త చిలకమర్తి జయంతి



సాధారణంగా పుస్తకాలలో చదవడం కన్నా, దృశ్య శ్రవణ రూపంలో చూపిస్తే, వినిపిస్తే, అవలీలగా అందరికీ చేరి, ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గ్రహించిన పూర్వీకులు ప్రయోగాత్మకంగా చేసి సఫలీ కృతులైనారు. నాటి నాటకాలు, వీధి భాగోతాలు, హరికథలు, బుర్రకథలు, ముఖ్యంగా మన పౌరాణికాలు, ప్రబంధాలు సామాన్య ప్రజలకు అతి సులువుగా అర్ధమయ్యేటట్లు చేశారు. అలాంటి ప్రజానాడి తెలిసి తదనుగుణంగా సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీ యాలను తన నాటక రచనలలో చొప్పించి, ఆయా పాత్రల ద్వారా సగటు ప్రేక్షకునికి ఎంతో అనుభూతిని అందచేసిన మహా రచయిత, మానవతా వాది, దాదాపు పాతిక వరకు నాటకాలను సృష్టించిన సంఘ సంస్కర్త, జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు చిలకమర్తి. చిలకమర్తి లక్ష్మీనరసింహం ( సెప్టెంబరు 26, 1867 – జూన్ 17, 1946) కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణ వాది, విద్యావేత్త. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. మహాకవి, కళాప్రపూర్ణ ఆయన బిరుదులు. ఇరవై రెండేళ్ళ వయస్సప్పుడు ఆయన రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం "ప్రతులు లక్ష"కి పైబడి అమ్ముడు పోవట మనేది తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26 న పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలము లోని ఖండవల్లి గ్రామములో ఒక బ్రాహ్మణ కుటుంబములో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురం పట్టణాలలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టం చేత పట్టుకొన్నారు. 1889 లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఇన్నీసు పేట స్కూలు లోనూ, మునిసిపల్ హైస్కూలు లోనూ విద్యాబోధన సాగించారు. తరువాత ఒక సంవత్సరం "సరస్వతి పత్రిక" సంపాదకునిగా పని చేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నడిపారు. తరువాత ఆ పాఠశాల వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చ బడింది. పాఠశాలలో ఉన్నపుడే పద్యాలు వ్రాయడం ప్రారంభించిన లక్ష్మీ నరసింహం ఎన్నో రచనలు చేశారు. "కీచక వధ" ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. గయోపాఖ్యానం నాటకంలో "టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం" వేసేవారు. ఆయన వ్రాసిన నవలలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవి. సరస్వతి పత్రిక సంపాదకునిగా ఉన్నపుడు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం వ్రాశారు. ఇంకా అనేక రచనలు చేశాడు.అటు తెనుగు సాహిత్య, నాటక రంగాలకు, ఇటు సంఘ సంస్కరణోద్యమానికి మహోన్నత సేవలను అందించిన అపూర్వ వ్యక్తి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం. వీరు రచించిన "గయోపాఖ్యానం" నాటక పద్యాలు, "వందేళ్ళ" నుండి తెలుగు వారి నోట వినిపిస్తూ ఉన్నాయి. నాటక సమాజం ఉన్న ప్రతీ ఊరులోనూ ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 1943 నాటికి లక్ష ప్రతులు (కాపీలు) అమ్ముడు పోయినాయి అంటే అది ఎంత గొప్ప రచనో చెప్పకనే తెలుస్తోంది. 1908లో ఒక ప్రెస్ స్థాపించారు. 1916 లో మనోరమ, పత్రిక అనే పత్రిక స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘు వంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. 21 అధ్యాయాల్లో రాసిన స్వీయ చరిత్రములో, ఆయన జీవిత కృషి మొత్తం వివరించ బడింది. బాల్యం, నర్సాపురంలో చదువు, రాజమండ్రిలో విద్యాభ్యాసం, ఉద్యోగం. గ్రంథరచన, నాటక సమాజం, వివాహం, మండల సభల్లో పాల్గొనడం, రామమోహన పాఠశాల ఏర్పాటు, నిర్వహణ, ఉన్నత పాఠశాల ప్రారంభం, కుటుంబ సమస్యలు, కష్టాలు, టంగుటూరి ప్రకాశం ఇంగ్లండ్ యాత్ర, హితకారిణి సమాజ స్థాపన, అచ్చు యంత్రాన్ని నెలకొల్పడం, భారత జాతీయ కాంగ్రెస్ సభకు హాజరవడం, పత్రికా సంపాదకత్వం, నిర్వహణ %-% యివన్నీ సవివరంగా రాశారు. చిలకమర్తి ఏకసంధాగ్రాహి మాత్రమే కాదు, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి, స్వీయ చరిత్రలో, తన జీవిత కాలంలో జరిగిన ఘటనలను, సూక్ష్మాంశాలతో సహా చిత్రించారు. చారిత్రక ఘటనలను సమతూకం తోనూ, వ్యక్తుల గూర్చి రాస్తున్నప్పుడు రాగద్వేషాల కతీతంగా, స్పష్టంగా, క్లుప్తంగా రాశాడు. నిత్యనైమిత్తకాల గూర్చి రాస్తున్నా, వాటినొక అంతర్ దృష్టితో పరికించారు. లక్ష్మీ నరసింహం మొదటి తరం సంఘ సంస్కర్త. 1909 లో సామాజికంగా వెనుక బడిన వర్గాలకోసం ఒక పాఠశాల (రామమోహన పాఠశాల) స్థాపించారు. నిమ్న జాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్ర దేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుప బడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించ లేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్య కలాపాలలో పాలు పంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. గాంధీజీ భారత రాజకీయ పటంలోకి రాక మునుపే హరిజన బాలులకు చదువు చెప్పేందుకు " రాజారామోహన రాయి పాఠశాలను " నడిపించి తనలో నిక్షిప్తమై ఉన్న సంస్కరణా భిమానాన్ని చాటి చెప్పారు. ఇన్ని సుగుణాల సమాహారం మన చిలకమర్తి లక్ష్మీనరసింహం. తనకు మార్గదర్శకుడైన వీరేశలింగం పంతులు గారితో కలసి, రాజమహేంద్ర వరంలో హితకారిణీ సంస్థ నడిపించారు. కనుచూపు కోల్పోయినా, పరిస్థితులకు ఎదురొడ్డి నిలచి, పోరాడి, జీవితాంతం తెలుగు సాహిత్య నాటక రంగాలకు, సాంఘిక సంస్కరణలకు తన జీవిత కాలం ధారపోశారు. ఓ సుప్రసిద్ధ నాటక కర్తగా, హాస్య రచయితగా, పద్య, గద్య రత్నాకరుడిగా, నవలా రచయితగా తన రచనలతో సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సాధించారు. "గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వారి ప్రతాప రుద్రీయం, శ్రీపాద గారి బొబ్బిలి యుద్ధం, చిలకమర్తి వారి గయోపాఖ్యానం" తెలుగు నాటక మణి రత్నాలు. అనేక తెలుగు పద్య, గద్య రచనలు కావించారు చిలకమర్తి. వీటిలో అత్యధికాధరణలు పొందినవి 'గయోపాఖ్యానం', 'గణపతి'. 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చెవుడు రాకుండా జాగ్రత్త వహించాలి - సెప్టెంబర్ 26...ప్రపంచ చెవిటి వారి దినోత్సవం




ప్రతి సంవత్సరం శరదృతువు మొదటి నెల చివరి ఆదివారం, ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డెఫ్ డేని జరుపు కుంటారు. చెవిటివారి దినం, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ యొక్క ఏర్పాటుకు సంబంధించి 1951 లో ఆమోదించ బడింది. ఇప్పుడు దీనిని ఏటా సెప్టెంబర్ 26 తేదీ జరుపు కుంటారు. చెవిటి వ్యక్తుల మానవ హక్కుల కోసం సంకేత భాష ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఈ రోజును యూఎన్ జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. బధిరుల ఎదుగుదలకు, అభివృద్ధికి సంకేత భాషలో నాణ్యమైన విద్యతోపాటు ఈ భాషకు సేవల కోసం ఈ రోజు ప్రధాన లక్ష్యంగా ఈరోజును నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ డెఫ్ డేని మొదటిసారి 1958 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. ఇటలీలోని రోమ్ లో వరల్డ్ డెఫ్ డే కి 1951 లో రూపకల్పన చేశారు. ఇది అంతర్జాతీయ ప్రభుత్వేతర సెంట్రల్ ఆర్గనైజేషన్. వినికిడి లేనివారి జాతీయ అసోసియేషన్ లతో కూడి ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 130 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. జాతి , దేశము , మతము, లింగ వివక్ష , ఇతర ప్రాధాన్యాలు , భేదాలు లేకుండా ప్రజలందరికీ సమానత్వము , మానవ హక్కులు , గౌరవ మర్యాదలు ఒకేమాదిరి ఉండాలన్నది ఈ వరల్డ్ డెఫ్ డే సిద్ధాంతం. గణాంకాల ప్రకారం, భూమిపై తొమ్మిది మందిలో ఒకరికి వినడానికి ఇబ్బంది ఉంది. ఈ వ్యాధి యొక్క కారణాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. వ్యాధి యొక్క పరిణామాలు, ప్రమాదాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు. ప్రపంచ వ్యాప్తంగా, సుమారు 30 మిలియన్ల చెవిటి మరియు మూగ ప్రజలు ఉన్నారు. 2001 జనాభా లెక్కలు ప్రకారం, ఇండియాలో 2.19 కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. వారు మొత్తం జనాభాలో 2.13% ఉన్నారు. వీరిలో కంటికి, వినికిడికి, మాట, లోకో మోటారు మరియు మానసిక సంబంధమైన వైకల్యాల్ని కలిగి ఉన్నారు. ఇండియాలో సుమారు 60 మిలియన్ల చెవిటివారు ఉన్నారు. పురుషులకు స్త్రీలకు వేర్వేరు ఆర్గనైజేషన్లు ఉన్నాయి. %ఐవశ్రీప్రఱ టశీబఅ-న్ఖఅశీఅ శీట ఐమ్ఖట షశీఎవఅ , మ్ఖఐతీఖం టశీబఅన్ఖఅశీఅ శీట ఐమ్ఖట ఔశీఎవఅ%. సెప్టెంబర్ 26 న " డే ఆఫ్ ది డెఫ్ " భారత దేశంలో జరుపు కుంటారు.చెవిటి వారికి ఆటలకు ఎన్నో స్పోర్ట్స్ అసోషియేషన్లు ఉన్నాయి. " All India sports council of the Deaf% aa , %All India Cricket association of the Deaf%µµ , aa%Delhi sports council for the Deaf" . మున్నగునవి. ఎన్నో చెవిటి , మూగ స్కూల్స్ ఉన్నాయి. మూగవారికి ప్రత్యేక సైన్ లాంగ్వేజ్ ఉన్నది. చెవిటి పిల్లల కోసం సంస్థలు, సాధారణ విద్యా సంస్థలలో ప్రత్యేక సమూహాలు తెరవ బడతాయి. పిల్లలు వారి సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలను చదవడం, వ్రాయడం, వేలిముద్రల వర్ణమాలను ఉపయోగించి కమ్యూనికేట్ చేయడం మాత్రమే కాకుండా, సరైన అవగాహనతో, వారి స్వంత అభివృద్ధితో కూడా పని చేస్తారు. అపరిశుభ్రమైన నీళ్లలో స్విమ్మింగ్, చెవిలో పిన్నులు, పుల్లలు, ఇయర్‌బడ్స్ పెట్టి తిప్పడం, దుమ్ము ధూళి చేరడం, అకస్మాత్తుగా వినిపించే భారీ శబ్దాల వల్ల చెవి లోపలి పొర దెబ్బతినడం వంటివన్నీ వినికిడి సమస్యకు దారితీయవచ్చు. ఎక్కువ శబ్దంతో టీవీలు చూడడం, మొబైల్ ఫోన్ లో గంటల తరబడి మ్యూజిక్ వినడం, సెల్ ఫోన్ రేడియేషన్.. వీటి వల్ల కూడా సమస్య దరిచేరవచ్చు. ఫోన్ కాల్స్ మాట్లాడేటప్పుడు ఒకే చెవివైపు మొబైల్ పెట్టి ఎక్కువసేపు మాట్లాడ కూడదు. ఇయర్‌ఫోన్స్ వాడినా గంటకు మించి మాట్లాడడం పనికిరాదు. వాల్యూమ్ మితంగానే ఉండాలి. చెవిపోటు వచ్చినప్పుడు చాలా మంది సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మరిన్ని సమస్యలకు దారి తీయవచ్చు. అందుకే వెంటనే ఈఎన్‌టీ డాక్టర్‌ని తప్పనిసరిగా సంప్రదించాలి. సాధారణంగా జలుబు తర్వాత ఎక్కువగా కనిపించే సమస్య చెవి ఇన్ఫెక్షన్. ఇది ముదిరే కొద్దీ చెవిపోటు, జ్వరం, చెవి నుంచి చీము కారే సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే కర్ణభేరి దెబ్బతిని చెవిటి వారిగా మారే ముప్పు ఉంది. స్నానం చేసే సమయంలో నీళ్లుచెవిలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడడం, సైనస్ ఉంటే వెంటనే చికిత్స తీసుకోవటం ఉత్తమం. గులిమి (వాక్స్) ని తీయక పోవడమే మంచిది. ఆకు పసర్లు, నూనెలు వంటివి చెవిలో పోయకూడదు అని గమనించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సెప్టెంబర్ 26...అట్లూరి పిచ్చేశ్వర రావు వర్ధంతి


అట్లూరి పిచ్చేశ్వర రావు (ఏప్రిల్ 12, 1925 – సెప్టెంబర్ 26, 1966), తెలుగు కథకుడు, అనువాదకుడు, నవలా రచయిత, స్క్రీన్ ప్లే రచయిత కూడా. పిచ్చేశ్వర రావు ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా యందు చౌటపల్లి గ్రామంలో ఏప్రిల్ 12, 1925 న జన్మించారు. ఆయన కుటుంబం సమీప గ్రామమైన పులపర్రు గ్రామానికి వలస పోయింది. చౌటపల్లి గ్రామంలోనూ, కైకలూరు పాఠశాలలో విద్యా భ్యాసం చేశారు. హిందీ విశారద పరీక్షలలో ప్రథముడుగా నిలిచారు. తన ఇంటర్మీడియట్ విద్యను హిందూ కాలేజ్ లో పూర్తి చేశారు. విద్య పూర్తయిన తరువాత 1945 లో భారత నౌకా దళంలో చేరారు.

1948 లో బి.ఆర్.డబ్ల్యు, కె.సి.జి. పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యారు. 1953 లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. పిచ్చేశ్వర రావు, ప్రముఖ కవి, సంఘ సంస్కర్త అయిన త్రిపురనేని రామస్వామి కనిష్ఠ పుత్రికైన చౌద రాణిని వివాహం చేసుకున్నారు. ఆమె కూడా కథా రచయిత్రి, నవలా రచయిత్రి. ఆమె తెలుగు పుస్తక శాలను మద్రాసులో ప్రారంభించిం ది. ఆమె 1996 లో మరణించింది. పిచ్చేశ్వర రావు తెలుగు దినపత్రిక అయిన విశాలాంధ్ర దినపత్రికలో కొంత కాలం పాటు పనిచేశారు. 1962 లో మద్రాసు (ప్రస్తుతం చెన్నై) కు వెళ్ళి చిత్ర పరిశ్రమలో స్క్రీన్ రైటర్ గా స్థిర పడ్డారు. హిందీ భాషలో గల సాహిత్యాన్ని తెలుగులో అనువాదం చేయుటకు కృషి చేశారు. అవి గోదాన్, ప్రతిధ్వని, పేకముక్కలు,, గాడిద ఆత్మ కథ. ఆ అనువాదంలో భాగంగా, అనేక కథలు, రేడియో నాటికలు, వంటివి రాసాడు. వాటిలో మనసులో మనిషీ ప్రాధాన్యత పొందింది. "గౌతమ బుద్ధ", "వీరేశ లింగం" అనే స్క్రిప్ట్ పిచ్చేశ్వర రావు రచనా ప్రతిభకు తార్కాణాలుగా నిలిచా యి. అవి తెలుగు భాషలో ప్రసిద్ధమైనవి. చిత్ర పరిశ్రమలో ప్రముఖ స్క్రీన్ రైటర్ గా ప్రసిద్ధి పొందారు. పిచ్చేశ్వర రావు సెప్టెంబర్ 26, 1966లో గుండె పోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**



# సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి - సెప్టెంబర్ 26...బంకుపల్లె మల్లయ్యశాస్త్రి వర్ధంతి



బంకుపల్లె మల్లయ్యశాస్త్రి ప్రముఖ పండితుడు. . రచయిత. ప్రధానంగా సంఘసంస్కర్త. సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన మల్లయ్యశాస్త్రి హైందవ సాంప్రదాయంలో ఉన్న మూఢాచారాలను పూర్తిగా వ్యతిరేకించాడు. స్త్రీ పునర్వివాహము శాస్త్రీయమని అనేక సభలలో వాదించి నిరూపించాడు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి పలు ఉపన్యాసాలు చేశాడు. తన ద్వితీయభార్యకు విద్య నేర్పించి మూడు ప్రబంధాలు, భారత భాగవత పురాణాలను నేర్పించాడు. ఆయన నేర్పిన విద్య, అందించిన ప్రోత్సాహం కారణంగా ఆమె సంగ్రహ రామాయణము, మరికొన్ని గ్రంథాలను రచించ గలిగింది. రజస్వలానంతర పురుష సంయోగార్హ కాలమే స్త్రీలకు వివాహకాలం అన్న సిద్ధాంతాన్ని ప్రకటించాడు. స్త్రీ పునర్వివాహము పూర్వాచారము కాకపోయినప్పటికి శాస్త్రీయము కాబట్టి ఆచరణీయమని వాదించాడు. సతీ శాసనము వచ్చిన తర్వాత పునర్వివాహము అవశ్యకత కలిగినదని వాదించి పత్రికలలో చర్చ కొనసాగించాడు. శారదా చట్టం ప్రతిపాదించిన కాలంలో ఆ చట్టానికి అనుకూలంగా మద్రాసు మొదలైన పలు ప్రాంతాలలో పలు సభలలో చర్చలు చేసి పండితులతో రజస్వలానంతర వివాహమే శాస్త్రీయమని అంగీకరింప చేశాడు. మల్లయ్య శాస్త్రి కుమార్తె కృష్ణవేణమ్మను శతావధాని వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇచ్చి పునర్వివాహం చేశాడు. తన రెండవ భార్యవలన కలిగిన ప్రథమ కుమారుని జనన సమయంలో వారి ఆచారం ప్రకారం నల్లమేకను శక్తికి బలి ఇవ్వవలసి ఉండగా, ఆ ఆచారాన్ని విసర్జించాడు. శాఖాంతర వివాహం చేసి ఆకాలంలో ఆదర్శంగా నిలిచాడు. అస్పృశ్యత వ్యతిరేకంగా ఆంధ్రపత్రిక, త్రిలింగ పత్రికలలో వ్యాసాలు రాశాడు. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, గోదావరి, కృష్ణ, విశాఖపట్నం, గంజాం మండలాలలో తిరిగి అస్పృస్యతా ప్రచారం చేశాడు. శూద్రులను తన ఇంటికి పిలిచి వారితో పాటు భోజనము చేసేవాడు. అప్పారావు అనే ఒక బ్రాహ్మణేతరుడిని తన ఇంటిలోనే ఉంచుకుని తన కుమారులతో పాటుగా చదువు సంధ్యలు చెప్పాడు. ఆయన ఆంధ్రపత్రిక, భారతి పత్రికలద్వారా ధర్మశాస్త్రములను పరిశీలించి అందలి విషయాలను సప్రమాణకంగా ప్రకటించేవాడు. మల్లయ్యశాస్త్రి 1876వ సంవత్సరం ఏప్రిల్ 29వ తేదీ ధాత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నాడు పునర్వసు నక్షత్రము, తులాలగ్నములో గంజాం జిల్లా సింగుపురం గ్రామంలో తన మాతామహుని ఇంటిలో జన్మించాడు. స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, గంగన్న. ఆయనది కృష్ణ యజుశ్శాఖ, ఆపస్తంబ సూత్రుడు, భారద్వాజ గోత్రుడు. మల్లయ్యశాస్త్రి తన ఐదవ యేట తన తండ్రివద్ద వేదాధ్యయనము ప్రారంభించాడు. తరువాత ఉర్లాం జమీందారు కందుకూరి బసవరాజు ఆస్థాన పండితుడైన భళ్లమూడి లక్ష్మణ శాస్త్రి వద్ద సంస్కృతము నేర్చుకున్నాడు. తన పదహారవ యేడు వచ్చే సమయానికి పంచ.కావ్యాలు పూర్తిగా చదివాడు. తరువాత పర్లాకిమిడి రాజా వారి సంస్కృత కళాశాలలో చేరి అక్కడ భళ్లమూడి వెంకటశాస్త్రి వద్ద శృంగార నైషధము, అభిజ్ఞాన శాకుంతలము చదివాడు. తరువాత పరవస్తు రంగాచార్యుల వద్ద సిద్ధాంత కౌముది పూర్తి చేశాడు. కూరెళ్ల సూర్యనారాయణశాస్త్రి వద్ద తర్కశాస్త్రము చదువు కున్నాడు. పోకల సింహాచలం వద్ద సంగీతము నేర్చుకున్నాడు. బంకుపల్లి కామశాస్త్రి వద్ద మంత్ర శాస్త్రాన్ని అభ్యసించాడు. భళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద పంచదశ ప్రకరణములు, గీతాభాష్యము చదువు కున్నాడు. శ్రీకూర్మం సంస్కృత పాఠశాల పండితుడైన నౌడూరి వెంకటశాస్త్రి వద్ద మనోరమ, శబ్దరత్నములు, పారిభాషేందు శేఖరము చదివాడు. గిడుగు రామమూర్తి పంతులు వద్ద ఇంగ్లీషు చదివాడు. మంత్రశాస్త్ర విద్యలో తన సహాధ్యాయి అయిన గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద వేదాంత, మీమాంస శాస్త్రాలను నేర్చుకున్నాడు. నీలమణి పాణిగ్రాహి వద్ద సూర్యసిద్ధాంత దర్పణాలను చదివి దృక్సిద్ధ పంచాంగాలను ఐదారు సంవత్సరాలు వెలువరించాడు. మల్లయ్యశాస్త్రి తన 21వ యేట శ్రీకాకుళం హైస్కూలులో తెలుగు పండిత పదవికి 18మంది పండితులతో పోటీపడి ప్రథముడిగా నెగ్గి ఆ ఉద్యోగాన్ని సంపాదించు కున్నాడు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత కొంతకాలం లుకలాం గ్రామంలో కన్నేపల్లి రామావధాని కుమారులకు సంస్కృతం బోధించాడు. ఆ తర్వాత పర్లాకిమిడి రాజా వారి ఇంగ్లీషు కళాశాలలో తెలుగు పండిత పదవిని చేపట్టాడు. బరంపురం సిటీ కాలేజీలో కూడా సంస్కృతాంధ్ర పండితుడిగా కొంతకాలం పనిచేశాడు. 1912లో కలకత్తా సంస్కృత విద్యా పీఠంలో పరీక్ష ఉత్తీర్ణుడై కావ్యతీర్థ బిరుదాన్ని పొందాడు. సంస్కృతంలో సీతా కళ్యాణము, జానకీ వహ్ని ప్రవేశము అనే పురాణ హరికథలుగా వ్రాసినందుకు సంస్థానం రాజు "పురాణ వాచస్పతి" అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆంధ్ర విద్యారణ్య, విద్యారత్న బిరుదులు పొందాడు. ఆయన కాశీయాత్రను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ వద్ద 1947, సెప్టెంబరు 26న తనువు చాలించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం "గైడ్" చిత్రరాజం - సెప్టెంబర్ 26... దేవానంద్ జయంతి సందర్భంగా

హిందీ చలన చిత్ర రంగంలో తనదయిన ముద్ర వేసుకున్న అలనాటి మహా నటుడు దేవానంద్ ( సెప్టెంబర్ 26, 1923 – డిసెంబర్ 3, 2011). సుప్రసిద్ధ హిందీ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు దేవా నంద్ పేరు తీయగానే వెంటనే స్ఫురణకు వచ్చే చిత్రరాజం "గైడ్". ప్రఖ్యాత ఆంగ్ల భారత రచయిత మాల్గుడి డేస్ ఫేం అర్. కె. నారాయణ్ అద్భుత రచన గైడ్. ఈ చిత్రం పలు విశేషాల సమాహారం. అయితే ...దేవానంద్ నటించిన "హం దొనో", చిత్రం 1962 బెర్లిన్ చలన చిత్రోత్సవానికి, భారత దేశ అధికారిక చిత్రంగా ఎంపికకాగా, బెర్లిన్లో దేవానంద్ అమెరికా దర్శకుడు టాడ్ డేనియల్ ను కలిసే అవకాశం కలగడం, టాడ్, పెర్ల్ ఎస్ బక్ ఆహ్వానం పై అమెరికా వెళ్లి వారితో ఒప్పందం కుదుర్చుకుని, గైడ్ చిత్రంలో నటించటానికి అంగీకరించడం యాదృచ్ఛికంగా జరిగాయి. గైడ్ చిత్రానికి ఆంగ్ల చిత్రానికి టాడ్ డేనియల్ దర్శకత్వం వహించాగా, చిత్రానువాదం నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పెర్ల్ ఎస్ బక్, టాడ్ డేనియల్ సంయుక్తంగా నిర్వహించారు. తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. ఆ విడుదల కాగా, చిత్రానువాదం ఆశించిన స్థాయిలో లేక, ఆంగ్ల ప్రేక్షకులను చిత్రం ఆకట్టుకో వడంలో విఫలమయింది. గైడ్ చిత్రాన్ని హిందీలో తీద్దామని అనుకుని వహీదా రెహమాన్ ను నాయికగా ఉండాలని ముందు సత్యజిత్ రే, అనంతరం దేవానంద్ కోరారట. అయితే చిత్రం చిత్రీకరణ హక్కులను దేవానంద్ రచయిత ఆర్కె నారాయణ్ నుంచి ముందు పొందారు. అలా దేవానంద్, వహీదా కాంబినేషన్లో రూపు దిద్దుకున్న చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద విజయ దుందుభి మోగించింది. ఊహించని




డబ్బును సమ కూర్చింది. విజయ ఆనంద్ గైడ్ దర్శకత్వ బాధ్యత స్వీకరించాడు. ఆంగ్ల చిత్రానువాదం కాకుండా, భారతీయ ప్రేక్షకులకు నచ్చే విధంగా కొత్త చిత్రానువాదం తయారు చేశాడు. మనసును పూర్తిగా లగ్నం చేసి దర్శకత్వం వహించిన విజయ్ ఆనంద్ కృషి సఫలీకృతం కాగలిగింది. అచ్చంగా దేవానంద్, వహీదా రెహమాన్ ల నట జీవితంలో గైడ్ ఒక అణి ముత్యమే అయింది. విజయానంద్ సందర్భోచిత చిత్రానువాదం, దర్శకత్వం, కథలో వైవిధ్యం, ఎస్.డి.బర్మన్ సంగీతం, వహీద నృత్యాలు, దేవానంద్ నటనా కౌశల్యం ప్రేక్షకుల మనో ఫల కాలపై చెరగని ముద్ర వేశాయి. ప్రేక్షకుల అనూహ్య ఆదరణ ద్వారా చిత్రం అనుకోని విధంగా కలెక్షన్లు సాధించింది. సంగీత దర్శకత్వం మినహా, మిగతా అన్ని శాఖలలోను ఫిల్మ్ ఫేర్ ఉత్తమ బహుమతులను 7 శాఖలలో గెల్చుకొని, అపూర్వ కళాఖండ చిత్రరాజమై నిలచింది. విదేశీ చిత్రాల కోవలో, ఆస్కార్ చిత్రోత్సవానికి భారత దేశ అధికార చిత్రంగా ఎంపికయ్యింది. టైమ్ మ్యాగజైన్ దాని ఉత్తమ బాలీవుడ్ క్లాసిక్స్ జాబితాలో 4 స్థానంలో ఉంది. విడుదలయిన 42 ఏళ్ల తర్వాత, 2007 లో కేన్స్ చిత్రోత్సవంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సుదీర్ఘ సమయానంతరం దూరదర్శన్ లో ఈ చిత్రం ప్రదర్శిత మైనపుడు చాలా మంది ఇళ్లలో టీవీలకే అంకితం అయినారంటే ఎంత గొప్పగా తీసారో స్పష్టం అవుతుంది.

**"ఆజ్ ఫిర్ జీన్ కి తమన్నా హై" "దిన్ ధల్ జాయే", "గాతా రహే మేరా దిల్" "క్యా సే క్యా హెూ గయా", "పియా తోస్ నైనా లాగే రే" "తేరే మేరే సాప్నే", "వహన్ కౌన్ హై తేరా", "హే రామ్ హమారే రామ్‌చంద్ర" "అల్లాహ్ మేఘ్ దే పానీ దే" అన్ని పాటలూ ఆణిముత్యాలే.**

1965 ఫిబ్రవరి 6 న సినిమా విడుదల కాగా, అంతకు ముందు ఢిల్లీలో ఈ చిత్రం ప్రివ్యూ ప్రదర్శనకు , ప్రధాన మంత్రి మినహాయించి భారత ప్రభుత్వ మంత్రులంతా చిత్రాన్ని ఆసాంతం, ఆసక్తిగా చూశారు. ఈ చిత్రం విడుదల అయినాక రచయిత ఆర్కె నారాయణ్ చూసి అసంతృప్తి వ్యక్తం చేశారట. డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపక పోయినా, గైడ్ చిత్రం గురించి ముందే జరిగిన విస్తృత ప్రచారం వల్ల ప్రేక్షకుకు మళ్ళీ మళ్ళీ చూసి కలెక్షన్లు సాధించేలా చేశారు..

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# చెత్త కష్టాలు తీరేదెన్నడో?

పెద్దపల్లి: పట్టణ పరిశుభ్రతలో ప్రధానమైన చెత్తసేకరణ, నిర్వహణ పురపాలికలకు సమస్యగా మారుతోంది. సేకరించిన చెత్తను నిల్వ చేసేందుకు సరైన స్థలాలు ఉండటం లేదు. పైగా చెత్త సేకరణలో జాప్యం ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణలో పాలుపంచుకునే కార్మికులు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న నగరపాలిక, మూడు పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.

ప్రతికూల ప్రభావం

డంపింగ్ యార్డుల కారణంగా దోమల ఉద్ధృతి పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. చెత్తను సెగ్రిగేషన్, బయోమైనింగ్ చేయకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమస్యపై గౌరెడ్డిపేట, సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీ, యాదవనగర్ వాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ సిబ్బంది కూడా తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. పెద్దపల్లి పురపాలికలో గతనెలలో రెండుసార్లు కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది.

ఇదీ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా వివిధ పురపాలికల్లో నిత్యం 170 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా.. అత్యధికంగా రామగుండం నగరపాలికలో 140 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది.

మంథనిలో 4 మెట్రిక్ టన్నులు, సుల్తానాబాద్‌లో టన్ను చొప్పున చెత్త ఉత్పత్తి అవుతోంది. రామగుండంలో నగరపాలికకు అధికారిక డంపింగ్‌యార్డు లేకపోవడంతో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లకు



చెందిన ఖాళీస్థలాల్లో చెత్తను వేస్తున్నారు.

మూతపడిన మేడిపల్లి ఓసీపీలో చెత్తను వెళ్లేందుకు ర్యాంప్ నిర్మించాలనే ప్రతిపాదన ఆచరణకు నోచుకోకపోవడంతో చెత్త తాత్కాలిక డంపింగ్ కేంద్రాలకే తరలుతోంది.

సుల్తానాబాద్ పురపాలికలో శాశ్వత డంపింగ్ యార్డు లేక స్థానిక మార్కండేయ కాలనీ శివారులోని ప్రభుత్వ భూమిలో చెత్త పడేస్తున్నారు. పెద్దపల్లిలోని గౌరెడ్డిపేట సమీపంలో ఉన్న డంపింగ్ యార్డుపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. – రామగుండంలోనూ గతంలో వ్యతిరేకత రావడంతో కేటాయించిన స్థలంలో చెత్తపారబోత నిలిచిపోయింది.మంథనిలో డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించినా.. గోదావరి తీర ప్రాంతంలోనూ చెత్త వేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాం. రామగుండం నగరపాలికలో డంపింగ్‌యార్డు కోసం మూతపడిన సింగరేణి ఓసీపీ ప్రాజెక్టులో స్థలం కేటాయించాం. ఇక్కడ వాహనాలు వెళ్లేందుకు రహదారి నిర్మించాల్సి ఉంది. సుల్తానాబాద్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో డంపింగ్‌యార్డు కోసం స్థలాన్వేషణ చేస్తున్నాం. మంథనిలో ఇప్పటికే స్థలం కేటాయించాం. ఇక్కడ త్వరలోనే బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతాం. పెద్దపల్లి డంపింగ్‌యార్డులో ఇటీవల కురిసిన వర్షాల కాలంగా బయోమైనింగ్ నిలిచింది. జె.అరుణశ్రీ, అదనపు కలెక్టర్

# దసరా లక్ష్యం రూ.165 కోట్లు

కరీంనగర్ : దసరా అంటేనే తెలంగాణలో అతి పెద్ద పండగ. యువతీ యువకులతోపాటు పెద్దవారు సైతం ఎక్కడున్నా ఈ పండగకు సొంతింటికి, గ్రామాలకు వస్తుంటారు. ఇళ్లలో, గ్రామాల్లో వారం రోజుల ముందు నుంచే సందడి మొదలవుతుంది. ఏటా దసరా పండుగ మద్యం వ్యాపారులకు కలిసి వస్తోంది. 2024 అక్టోబరు 11, 12న జరిగే బతుకమ్మ, దసరా వేడుకలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా మద్యం వ్యాపార లక్ష్యం రూ.165 కోట్లుగా నిర్దేశించారు.

25 శాతం అదనంగా విక్రయాలు

బతుకమ్మ, దసరా పండుగలకు ఇంకా 20 రోజులు మాత్రమే ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ముఖ్య మూలాధారం ఎక్సైజ్ శాఖ. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దసరాపై వ్యాపార లక్ష్యాన్ని విధించింది. వారం రోజుల కిందటనే అధికారులు ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి కొత్త జిల్లాల వారీగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. గతంతో పోల్చుకుంటే ఈసారి 25 శాతం అదనంగా మద్యం విక్రయాలపై లక్ష్యాన్ని నిర్దేశించారు.

గతేడాది రూ.136 కోట్లు

గతేడాది అక్టోబరు 23, 24 తేదీల్లో బతుకమ్మ, దసరా పండగలు వచ్చాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది 292 మద్యం దుకాణాలకు రూ.136 కోట్ల వ్యాపారం సాగిందని అధికారులు



చెబుతున్నారు. ఈసారి అక్టోబరు 11, 12 తేదీల్లో బతుకమ్మ, దసరా వస్తోంది. నెల మొదట్లో పండగ రావడం సైతం తమకూ కలిసి వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మొన్నటి వరకు గణేష్ నవరాత్రుల సందర్భంగా అనేక మంది భక్తితో కట్టడి అయ్యారు. కొంత వ్యాపారం తగ్గినా.. తరువాత రోజు నుంచి యథావిధిగా కొనసాగుతోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

అనధికారికంగా గొలుసు దుకాణాలు

ఒక్కో మద్యం షాప్ కింద మూడు నుంచి నాలుగు గొలుసు దుకాణాలు అనధికారికంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్కో గ్రామానికి మూడు నుంచి అయిదు వరకు కొనసాగుతున్నాయి. సుమారు 4500పైగా ఉన్నట్లు సమాచారం. అప్పుడప్పుడు వీటిపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి మద్యం పట్టుకున్నా... తమ పలుకుబడితో యథావిధిగా వ్యాపారం సాగిస్తున్నారు. వీటిని సైతం దృష్టిలో పెట్టుకొని అక్టోబరులో జరిగే బతుకమ్మ, దసరా పండుగలకు మద్యం లక్ష్యం రూ.165 కోట్లుగా నిర్ణయించారు.

# తేలనున్న అసైన్డ్ భూముల లెక్క



తంగళ్లపల్లి: ప్లాట్ల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ అసైన్డ్ భూములను గుర్తించే ప్రక్రియలో ముందడుగు పడుతుంది. ప్రభుత్వ భూమిలో ఎక్కడ ప్లాట్లు ఉన్నాయనే విషయం బయటపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల్లో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో పురపాలక సంఘం, రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు భాగస్వామ్యం కల్పించింది. దీంతో ఆయా శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వేగం పెరిగింది.

జిల్లాలో అసైన్డ్ భూములు బాగానే ఉన్నాయి. పురపాలక సంఘంలో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ శాతం అసైన్డ్ భూములకు సంబంధించినవే కావడంతో ఆమోదంలో కాస్త ఆలస్యం అవుతోంది. అది ప్రభుత్వ భూమా? కాదా? అనేది తేల్చేందుకు సమయం పట్టడమే ఇందుకు కారణం.

గతంలో పురపాలక సంఘంలోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ప్లాట్లను పరిశీలించేవారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం వల్ల పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్, నీటిపారుదలశాఖ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ముగ్గురు కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలను పరిశీలిస్తున్నారు.

ప్రభుత్వ అసైన్డ్ భూమా? ప్రైవేటు భూమా? ఇతర వివాదాలున్నాయా అనేది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుర్తిస్తున్నారు.

బఫర్ జోన్ నిబంధనల మేరకు చెరువు, కుంటలు, వాగులు, నాలాల పక్క నుంచి ఎంత దూరంలో ఉంది, అనుమతి ఇవ్వొచ్చా అనేది నీటిపారుదలశాఖ ఏఈ పర్యవేక్షిస్తున్నారు.

ఆ స్థలం రెసిడెన్షియల్, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల్లో ఏ జోన్‌లోకి వస్తుందనేది చూసి, జత చేసిన పత్రాలు సరైనవో కావో అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ చూస్తున్నారు. తద్వారా అసైన్డ్ భూమి గుర్తించడంలో తేలిక అవుతుంది. వీరి ముగ్గురు ఆమోదించాకే ఎల్1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (ఎల్2 లాగిన్)కు దరఖాస్తు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఎల్3 లాగిన్ పర్యవేక్షించే పురపాలక సంఘం కమిషనర్‌కు వెళ్తుంది.

రుసుం చెల్లించిన తరవాత కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారని పట్టణ ప్రణాళిక అధికారి సాయికృష్ణ తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 2025 మార్చి 31 వరకు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సిరిసిల్ల పట్టణంలో దరఖాస్తుల వివరాలు

మొత్తం వచ్చినవి 10,492

పరిశీలించినవి 4,423

తిరస్కరించినవి 327

సరైన పత్రాలు లేక వెనక్కి పంపినవి 402

రుసుం చెల్లించాల్సినవి 1,904

క్రమబద్ధీకరణ పూర్తయినవి 80వచ్చిన ఆదాయం రూ.55 లక్షలు

# వైద్యానికి నిరీక్షించాల్సిందే!



జగిత్యాల : రోజురోజుకూ పెరుగుతున్న రోగులు, సరిపోని పడకలు, సేవలకు అనుగుణంగా లేని వార్డులు, పెద్దాసుపత్రిలో రోగుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. జిల్లాను జ్వరాలు వణికిస్తుండటంతో మూడు నెలలుగా జిల్లా కేంద్ర ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నిత్యం ఓపీ 400పైనే నమోదవుతోంది. అన్ని మండలాల నుంచి నిత్యం వందల సంఖ్యలో రోగులు పెద్దాసుపత్రికి వస్తున్నారు. ఓపీ కేంద్రం వద్ద, వైద్యులు రోగులను పరీక్షించే గదుల ముందు, రక్తపరీక్ష కేంద్రాల వద్ద, మందులు తీసుకునే చోట అంతటా రోగులు బారులు తీరుతున్నారు. వైద్యులు రాసిన మందులన్నీ ఆసుపత్రిలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిపై కథనం..

నాడీ పట్టేదేలేదు..

ఆసుపత్రిలో చాలామంది వైద్యులు రోగుల నాడీ చూడట్లేదు. స్టెతస్కోప్ సైతం ముట్టడంలేదు. రోగులు చెప్పే లక్షణాల ఆధారంగా మందులు రాసి ఇస్తున్నారు. రక్తపరీక్షలు కూడా రోగులు కోరినప్పుడే రాస్తున్నారు. లేదంటే మందులు రాసి పంపిస్తున్నారు. రోగులు ఎక్కువగా రావడం, వైరల్ జ్వరాలే ఉండటంతో వైద్యులు కూడా లక్షణాలకు అనుగుణంగా మందులతో సరిపెడుతున్నారు.

మౌలిక వసతులు కరవు

150 పడకల స్థాయితో వైద్య కళాశాల అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా మారినప్పటికీ రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో కొన్ని విభాగాలను ఎంసీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అత్యవసర వైద్యం, జనరల్ మెడిసిన్, సర్జరీలు, ఆర్థోపెడిక్ సేవలు మాత్రమే ఇక్కడ ఉన్నాయి. జ్వరాలతో పడకలు సరిపోక వార్డుల్లోనూ రోగులను ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులకు తాగునీటి వసతి కూడా లేకపోయింది. అన్ని వార్డుల్లోనూ రోగులు సేదతీరేందుకు బల్లలు, కుర్చీలు అమర్చితే సౌకర్యంగా ఉంటుంది.

తప్పని నిరీక్షణ..

ఓపీ కేంద్రంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్య ఒకేసారి వందల సంఖ్యలో రోగులు రావడంతో నమోదు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బల్లలు సరిపోక కొందరు వరండాలో నిరీక్షిస్తున్నారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేసి వివరాలన్నీ కంప్యూటర్‌లో నమోదు చేసి చీటీ ఇవ్వడానికి కనీసం రెండు మూడు నిమిషాలైనా పడుతోంది. రోగులు సహాయకుల సాయంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి వస్తోంది. సహాయకులు లేకుండా వచ్చేవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోగుల నిరీక్షణ కోసం మరిన్ని బెంచీలు ఏర్పాటు చేస్తే రోగులకు సౌకర్యంగా ఉంటుంది. కన్సల్టేషన్ వద్ద కూడా ఒక్కోసారి పదుల సంఖ్యలో రోగులు గుమికూడి ఉంటున్నారు. వారంతా వరండాలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

ఔషధాల కొరత...సాధారణ ఆసుపత్రిలో గంటల తరబడి నిరీక్షించిన రోగులకు మందుల దగ్గరకు వచ్చేసరికి పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొన్ని బయటే కొనాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని యాంటీబయోటిక్స్, ఇతర మందులు అందుబాటులో ఉండటంలేదు. విధిలేని పరిస్థితిలో రోగులు బయట కొంటున్నారు. కరీంనగర్ పంపిణీ కేంద్రం నుంచి సకాలంలో మందులు జగిత్యాలకు రాకపోవడమే కారణమని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

# చారిత్రక ప్రదేశాలపై నిర్లక్ష్యం



మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని చారిత్రక ప్రదేశాలు కనుమరుగవుతున్నాయి. కొండపైన ఆలయానికి వెనుకవైపున కొండాల్‌రాయుడి స్థావరానికి వెళ్లే దారిని మూసివేయడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 400 ఏళ్ల కిందట అంజన్న ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలుండగా పరిసరాల్లో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. ఆలయానికి ఈశాన్య భాగంలోని కొత్త పుష్కరిణికి సమీపంలో మునుల గుహ ఉంది. పూర్వం వాటిలో మునులు తపస్సు చేసుకునేవారని అర్చకులు చెబుతారు. ఆలయానికి వెనుక భాగంలో పెద్ద బండరాళ్లపై కొండాల్ రాయుడు అనే పరాక్రమవంతుడు శత్రువులబారి నుంచి తనను తాను రక్షించుకోవడానికి నివాసముండేవారని, చివరికి శత్రువులకు చిక్కకుండా తన గుర్రంతో సహా బండరాళ్లపై నుంచి అగాధంలో దూకి ప్రాణత్యాగం చేశారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆలయానికి వెళ్లే దారి పక్కన సీతమ్మ కన్నీటి ధారలు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ పాత కోనేరు, స్వామివారికి నిత్యం అభిషేకం చేయడానికి గుట్టల దిగువ ప్రాంతం నుంచి నీటిని తీసుకొచ్చే మంచినీళ్ల బావి ఇక్కడి ప్రత్యేకతలు. ఇటీవల కొండాల్‌రాయుడి నివాస ప్రాంతానికి వెళ్లే దారికి అడ్డంగా గోడ నిర్మించి భక్తులు వెళ్లకుండా శాశ్వతంగా మూసివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మునుల గుహకు వెళ్లే దారి కూడా అపరిశుభ్రంగా ఉందని భక్తులు పేర్కొంటున్నారు. కొండపైన ప్రసాదం తయారీ కేంద్రానికి సమీపంలో పులిపడ్డ బావిగా పేరుపొందిన రాతి బావి ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఘాట్‌రోడ్డు పక్కన ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ జలబుగ్గ కాలువలో మండువేసవిలోనూ నీరుంటుంది. ఇటీవల కొందరు స్థిరాస్థి వ్యాపారులు ఈ కాలువను కూడా మూసివేయడంపై స్థానికులు పలుమార్లు ఆందోళన నిర్వహించినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా చారిత్రక ఆధారాలున్న కొండాల్‌రాయుడి స్థావరంగా పేర్కొనే ప్రదేశానికి వెళ్లకుండా గోడ నిర్మించిన విషయం తెలియదన్నారు. మునుల గుహ, ఇతర చారిత్రక ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు.

# పట్టా కాదు.. పట్టు బిగించాలి

పెద్దపల్లి : చేతిలో పట్టా ఉన్నా ఉద్యోగం దొరకదు.. చదివిన చదువుకు, చేసే పనికి సంబంధం ఉండదు.. ఫలితంగా మొక్కుబడిగా విధులు నిర్వర్తించడం తప్ప యువత కెరీర్‌లో రాణించలేకపోతున్నారు.. సర్టిఫికెట్ల కోసం తప్ప అవసరాలు తీర్చలేని కోర్సుల్లో బోధన విధానం మార్చడమే ప్రత్యామ్నాయమని నిపుణులు సూచిస్తున్నారు..

యువతకు ఉద్యోగాన్వేషణలో అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి) కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల పట్టణాల్లో గతంలోనే కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పెద్దపల్లిలో ఇటీవల ప్రారంభించినా తరగతులు నిర్వహించడం లేదు. నాలుగు జిల్లాల్లో కలిపి 50 వరకు ప్రైవేటు శిక్షణ కేంద్రాలున్నా చాలా మంది అభ్యర్థులు ఆర్థిక స్థోమత లేక చేరడం లేదు. గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నా బోధన సౌకర్యం లేక ఉద్యోగ పరీక్షల్లో వెనుకబడుతున్నారు.

ఉద్యోగాల వారధిగా..కొలువుల సాధనలో యువతకు ఒకప్పుడు ఉపాధి కల్పన శాఖ అండగా ఉండేది. తమ వద్ద వివరాలు నమోదు చేసుకుంటే విద్యార్హతల ఆధారంగా కాల్ లెటర్స్ పంపించేది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆ శాఖ ప్రాధాన్యం తగ్గింది. కొంతకాలంగా ఆ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వివిధ కంపెనీల్లో కొలువులు దక్కించుకునేలా నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్నారు.

ఎందుకిలా!కళాశాలల్లో నైపుణ్యాలు నేర్పించడం లేదు.భవిష్యత్తును నిర్దేశించే అంశాలు బోధించడం లేదు.విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, అంతర్గత నైపుణ్యం పెంపుపై అవగాహన కరవైంది. చదువుకు, వివిధ



సంస్థల అవసరాలకు పొంతన ఉండటం లేదు.

ఏమిటీ మార్గం?ఇండియా స్కిల్ రిపోర్టు ప్రకారం ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 65 శాతం మందిలోనే నైపుణ్యం ఉన్నట్లు తేలింది. డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో కొలువుకు అవసరమైన సిలబస్ ఉండటం లేదని పరిశ్రమల ప్రతినిధులు చెబుతూనే, సమూల మార్పులు చేయాలని ప్రతిపాదిస్తున్నారు.ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో అమలవుతున్న కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. అవసరం లేని పాఠ్యాంశాలను తొలగించి భవిష్యత్తు డిమాండ్ ఆధారంగా సిలబస్ రూపొందించనున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఎంపికయ్యా డిగ్రీ పూర్తి చేసిన అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఉపాధికల్పన శాఖ ఉద్యోగ మేళాకు హాజరయ్యా. కంపెనీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలిచ్చా. ప్రస్తుతం మంచి వేతనంతో ఉద్యోగం చేస్తున్నా. మల్లీశ్వరి, ప్రైవేటు ఉద్యోగి, జగిత్యాల

సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం

డిగ్రీ, పీజీ, వివిధ వృత్తివిద్యా కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, బ్యాంకింగ్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ స్థాయిలో పోటీ పడేలా నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌లో ఎలా నమోదు చేసుకోవాలో వివరిస్తున్నాం. నెలలో రెండు సార్లు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. తిరుపతిరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి, కరీంనగర్

విషయ నైపుణ్యమే ప్రధానం

ఉన్నత విద్యావంతులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. నైపుణ్యంతో కూడిన బోధన అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చదువుకునే సమయంలోనే విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి. కళాశాలల్లో కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భాషా నైపుణ్యంపై పట్టు సాధించాలి.సతీశ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలఉపాధికల్పన కార్యాలయాల్లో నమోదైన అభ్యర్థులు మొత్తం 53,837 కరీంనగర్ 18,229 జగిత్యాల 10,008 పెద్దపల్లి 20,128 రాజన్న సిరిసిల్ల 7,472

# ముందస్తు జాగ్రత్తతో ముప్పు దూరం

కోదాడ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధిక వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇటీవల కురిసిన వానలకు నీట మునిగిన పంట కోలుకుంటుండగానే మరోసారి వర్షం పడింది. అటు చీడపీడలు, అటు పురుగుల దాడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతులు కలవరపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి ముందస్తు చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సాగైన ప్రధాన పంటలు వరి, కంది, పత్తి, పెసర, మినుము, మిరప, వేరుసెనగతో పాటు కూరగాయల పంటలూ అధిక వర్షాలకు దెబ్బతింటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాస్త్రవేత్తలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న పంటలను కాపాడుకోవడానికి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచిస్తున్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు ముందుగా వేసిన వరి చిరుపొట్ట దశలో ఉండగా ఆలస్యంగా వేసిన మరికొన్ని పొలాలు పిలక దశకు చేరాయి. వర్షాలకు నత్రజని ఎక్కువగా(30 శాతం) మొక్కకు అందుతుంది. రైతులు రెండోసారి యూరియాను పూర్తిగా తగ్గించాలి. మొక్క ఎదుగుదల, పచ్చదనం బట్టి అసలు వేయకపోవడమే మంచిది. ఎందుకంటే అగ్గితెగులు ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుంది. ఆఖరి దఫాగా 10–15 కిలోల పొటాష్‌తో పాటు 15–20 కిలోల యూరియా కలిపి వేస్తే సరిపోతుంది. కాపర్ శిలీంద్ర నాశనులను ఇప్పుడు పిచికారీ చేయవద్దు. అధిక వర్షానికి ఉక్కపోత వాతావరణం ఉంటే గాలిలో అధిక తేమ ఉండి సుడిదోమ ఆశిస్తుంది. వర్షాలకు వరి పసుపు రంగుకు మారడం, కొనల చివరి ఎండిపోయినట్లుగా తెల్లగా ఉంటుంది. వానలు తగ్గిన తర్వాత పైపాటుగా ఎరువులు వేయాలి.

కందికి తేమ బెంగకంది వేసిన నేలలు అధిక తేమను తట్టుకోలేవు. వర్షం వల్ల నేలలో అధిక తేమ చేరినపుడు పైపాటుగా మల్టీ కే లేదా 19:19:19 వంటి పోషకాలు అందించాలి. కందికి ఆశించే తెగులును గుర్తించి వెంటనే సస్యరక్షణ చేపట్టాలి.

కూరగాయలు నేలకు తాకొద్దు

కూరగాయల తోటల్లో దుంపలకు నీటి నిల్వ వల్ల పోషకాలు తగ్గుతాయి. వెంటనే లోతైన కాల్వలు ఏర్పాటుచేసి వర్షం నీరు తొలగించి 19:19:19 లేదా 14:35:14 వంటి పైపాటు పోషకాలు నేరుగా పిచికారీ ద్వారా అందించాలి.

# బడి ఖర్చులకు.. నిధులు.. తీరనున్న ఇక్కట్లు

బషీరాబాద్: విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలైంది. పాఠశాల నిర్వహణకు ఖర్చులు రాలేదని, ఖర్చులు భారంగా మారుతున్నాయని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఇలాంటి సమయంలో నిర్వహణ ఖర్చుల కింద మొదటి విడతగా రూ.3 కోట్ల నిధులు ప్రస్తుతం పాఠశాలల ఖాతాలకు నేరుగా విడుదల చేయడంతో ప్రధానోపాధ్యాయులకు ఆర్థిక ఊరట కలిగింది. రెండో విడత నిధులను సైతం వెంటనే ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

ఇప్పటిదాకా సొంతంగానే వెచ్చించారు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సుమారు 1,22,728 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిర్వహణ నిధులు లేకపోవడంతో మూడు నెలలుగా ప్రధానోపాధ్యాయులే సొంతంగా జేబులోంచి వెచ్చించాల్సి వస్తోంది. తాజాగా వచ్చిన సొమ్ముతో తరగతి గదిలో అవసరమైన చాక్‌పీస్‌లు, కాగితాలు, డస్టర్లు, హాజరు పట్టికలు, ఇతర స్టేషనరీ



కొనుగోలు చేసుకునే వెసులుబాటు కలుగుతోంది. పాఠశాల యాజమాన్య కమిటీ, ప్రధానోపాధ్యాయుల తీర్మానంతో నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీటిని నేరుగా పాఠశాల ఖాతాకే జమ చేశారు.

కంప్యూటర్ సామగ్రి కొనుగోలు చేయాలి

మా పాఠశాలలో కంప్యూటర్‌కు సంబంధించిన చిన్నపాటి సామగ్రిని కొనుగోలు చేయాల్సి ఉంది.నిధులు అందుబాటులో లేక సొంతంగా ఖర్చుచేశాం. ఇప్పుడు నిధులొచ్చాయి. కాబట్టి అవసరమైన వస్తువులను తెచ్చుకుంటాం. శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు. బషీరాబాద్.

# సర్కారు భూములకు సాంకేతిక రక్షణ

హైదరాబాద్: ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు రెవెన్యూ అధికారులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. గూగుల్ మ్యాప్‌లకు తోడుగా.. కీహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్)ను జోడిం చి భూముల వివరాలను ప్రత్యేకంగా డేటా కేంద్రంలో భద్రపరచనున్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వ భూములను జియోట్యాగింగ్ చేసేవారు. కొందరు జియోట్యాగింగ్ సరిహద్దులను సాంకేతిక పరిజ్ఞానంతో చెరిపేస్తున్నారని గ్రహించి కేఎంఎల్‌ను అదనంగా జోడించనున్నారు. గూగుల్ ఎర్త్ పటాల్లో కేఎంఎల్‌ను ఎలా జోడించాలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల తహసీల్దార్లు, సర్వేయర్లు, ఆర్ఐలకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.ఒక్కసారి'క్లిక్' చేస్తే.. సర్వే రికార్డులు, పహ



ణీలు, గ్రామాల చిత్రపటాల ను పరిగణలోకి తీసుకొని క్షేత్రస్థాయికి వెళ్లి పొడవు, వెడల్పులను లెక్కించి గూగుల్ ఎర్త్ చిత్రపటాల్లో సరిహద్దులను నిర్ణయించి కేఎంఎల్ ను జోడించనున్నారు. తద్వారా గ్రామ నక్షాల్లోని వివరాలు, క్షేత్రస్థాయి లో వివరాల్లో తేడాలు వెంటనే తెలిసిపోతాయి. భూములు, చెరువులను ఆక్రమిస్తే పటాల్లో తెలుస్తుంది.నెలాఖరులోపు ప్రభుత్వ భూముల వివరాలు, గూగుల్ ఎర్త్ కేఎంఎల్ ద్వారా చిత్రీకరించిన పటాలను సిద్ధం చేయాలని కలెక్టర్లు కె.శశాంక, గౌతమ్‌లు అధికారులను ఆదేశించారు.

# గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా ఆడిట్

నల్గొండ : గ్రామ పంచాయతీల్లో ఆడిట్ ప్రారంభమైంది. ఆదాయ, వ్యయాలపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీలు చేసిన ఖర్చులు, వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లు సరిగ్గా ఉన్నాయో, లేవో పరిశీలిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1720 గ్రామ పంచాయతీలు ఉండగా.. నిత్యం కొన్ని పంచాయతీల్లో ఆన్‌లైన్ ఆడిట్ జరుగుతోంది. ఈ ప్రక్రియ డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.తప్పులకు తావు లేకుండా..

గతంలో మాన్యువల్‌గా జరిగే ఆడిట్ ప్రక్రియ మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. పంచాయతీ దస్త్రాలను సరిచూశాక వివరాలను నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఒకసారి నమోదు చేస్తే మళ్లీ సవరించే అవకాశం ఉండదు. అందుకే తప్పులకు తావులేకుండా వివరాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. చిన్న పంచాయతీలైతే ఒక్క రోజులోనే పరిశీలన పూర్తయ్యే అవకాశం ఉంది. పెద్ద పంచాయతీలు రెండు, మూడు రోజులు పడుతోంది. షెడ్యుల్ ఖరారు గ్రామ పంచాయతీల అభివృద్ధి, వివిధ కార్యకలాపాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. ఇవి కాకుండా ప్రజలు కూడా పన్నులు చెల్లిస్తుంటారు. ఈ నిధులను పాలకవర్గాలు సక్రమంగా ఖర్చు చేస్తున్నాయో, లేవో ఆడిట్ శాఖ లెక్కలు తీసి సరిచూస్తుంది. ఏటా నిర్వహించే ఈ ప్రక్రియ కోసం ఉమ్మడి జిల్లాలో ఏయే పంచాయతీ ఆడిట్ ఏ రోజు చేస్తారో షెడ్యుల్ ఖరారు చేశారు. దీని ప్రకారం ఆయా పంచాయతీ కార్యదర్శి ఆడిటర్ వచ్చేలోగా దస్త్రాలను సిద్ధం చేసి ఉంచాలి. అనివార్య కారణాలతో కార్యదర్శి లేదా ఆడిటర్లు హాజరు కాకుంటే మరో తేదీ కేటాయిస్తారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో 13 మంది ఆడిటర్లు పంచాయతీల దస్త్రాలను పరిశీలిస్తున్నారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ ఆడిట్ ముమ్మరంగా కొనసాగుతోంది.

మార్కెట్లు, గ్రంథాలయాల్లో పూర్తి: పి.కృపాకర్‌రావు జిల్లా ఆడిట్‌శాఖ అధికారి, నల్గొండ

గ్రామ పంచాయతీల్లో జమ, ఖర్చుల పరిశీలన ప్రక్రియ వేగంగా సాగుతోంది. నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం నిర్ణయించాం. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థల్లో ఆడిట్ పూర్తి చేశారు. యూనివర్సిటీలో చేపట్టాల్సి ఉంది.

# వీరింతే.. మారరంతే!



తాండూరు : జిల్లాలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. అక్రమార్కులు రాత్రి, పగలు హిటాచీలు, జేసీబీలను వినియోగించి చేపడుతున్నారు. వికారాబాద్, పరిగి, కొండగల్ తదితర ప్రాంతాల్లో తవ్వకాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. తాండూరు పరిధిలో మాత్రం బహిరంగంగానే తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇదే మట్టిని సమీప నిర్మాణాలకు విక్రయించి రూ.లక్షలు గడిస్తున్నారు. సర్కారుకు మాత్రం ఒక్క రూపాయి కూడా రాయల్టీ కింద రావడంలేదు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

టిప్పరుకు రూ.3,000 వసూలు

జిల్లాలో కొన్నేళ్లుగా వెంచర్ల నిర్మాణాలు, వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటు పెరుగుతున్నాయి. వీటికి మట్టి, ఇసుక కావాల్సి వస్తోంది. ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకోవడానికి అక్రమార్కులు తవ్వకాలు జరిపిన మట్టిని విక్రయిస్తున్నారు. ఒక్కో టిప్పరు వద్ద రూ.3వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి రోజు వేల క్యూబిక్ మీటర్ల మట్టి తోడేస్తున్నా ప్రభుత్వానికి రూపాయి ఆదాయం సమకూరడం లేదు.

తాండూరు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్న గుత్తేదార్లకు గుర్తించిన ప్రదేశాల నుంచి మట్టిని తరలించేందుకు ప్రభుత్వం రవాణా ఛార్జీల కింద రూ.లక్షల్లో చెల్లిస్తోంది.గుత్తేదార్లు మాత్రం సమీపంలోనే లీడ్ పేరిట బిల్లులు పొందుతున్నారు.

కీలక ప్రదేశాలు ఇవే..పెద్దేముల్ మండలం తట్టేపల్లి, కందనెల్లి, తాండూరు మండలం అంతారం, ఖాంజాపూరు, యాలాల మండలం బషీర్‌మియా తండా, తిమ్మాయిపల్లి గ్రామాల సమీపం ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో తవ్వకాలు జరుగుతున్నాయి.

నిబంధనలు పక్కదారి

తవ్వకాలకు రెవెన్యూ గనుల శాఖ అనుమతులు తప్పనిసరి. వీరిని అక్రమార్కులు సంప్రదించడంలేదు.

ప్రభుత్వం సూచించిన విధంగా రూ.లక్షల్లో వివిధ పద్దుల కింద చెల్లించాలి.అధికారులూ పట్టించుకోవడంలేదు.

ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రాయల్టీ కట్టాలి.

అనుమతి లభించినా ఉదయం నుంచి సాయంత్రం వరకే చేపట్టాలి. రాత్రివేళల్లోనూ సాగుతున్నాయి.

కొడంగల్ మండలంలోని లక్ష్మీపల్లి, అప్పాయిపల్లి, చిట్లపల్లి, అలాగే బొంరాస్‌పేట మండలంలోని పలు తండాలు, దౌల్తాబాద్ మండలంలోని నీటూర్‌లతో పాటు మరి కొన్ని గ్రామాల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. వెంచర్లకు కావాల్సిన మట్టిని తరలిస్తూ ప్రభుత్వానికి ఎలాంటి శిస్తులు కట్టడంలేదు. ఈ విషయమై తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ దీనిపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

చర్యలు తీసుకుంటాం

మట్టితవ్వకాలను అక్రమంగా చేపడితే కఠిన చర్యలు తప్పవు. వ్యవసాయ క్షేత్రాలు, వెంచర్లకు మట్టిని తరలించే వారి విషయంలో చర్యలు తీసుకుంటాం. తవ్వకాలు జరిగే ప్రదేశాలపై నిఘా వేస్తాం. సత్యనారాయణ, గనుల శాఖ సహాయ సంచాలకులు, తాండూరు.

ఇవీ కారణాలు..

అధికారుల పర్యవేక్షణ లోపం

మామూళ్లకు అలవాటుపడటం

రోజురోజుకు నిర్మాణాలు పెరగడం

కొన్నిచోట్ల మట్టి, ఇసుక దొరక్కపోవడం

# విదేశీ అధ్యయనం.. ఫలించలేదేం!



కాచిగూడ: నగరంలో మూసీ నదిపై చాదర్‌ఘాట్‌తో పాటు పలుచోట్ల వంతెనలు నిర్మించాలని గత సర్కార్ నిర్ణయించింది. తీవ్ర రద్దీ ప్రాంతాల్లో ఒకటైన చాదర్‌ఘాట్ కాజ్‌వే భారీ వర్షాలు కురిసినప్పుడు మూసీకి పోటెత్తే వరదలో మునిగిపోతోంది. కాచిగూడ, కోఠి, రంగ్‌మహల్ చౌరస్తా నుంచి మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ వైపు వేల సంఖ్యలో వాహనాలు గంటలపాటు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలో కాజ్‌వే స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని నాటి ప్రభుత్వం సంకల్పించింది.

వందేళ్లు తట్టుకునేలా.. ప్రతిపాదిత వంతెన మరో వందేళ్ల పాటు వరదలో మునగకుండా, ప్రతికూల పరిస్థితులను తట్టుకునేలాంటి డిజైన్లను అధ్యయనం చేసేందుకు 2022లో జీహెచ్‌ఎంసీతోపాటు మున్సిపల్ శాఖలోని పలువురు ఉన్నతాధికారులు ఫ్రాన్స్‌లోని పారిస్ నగరానికి వెళ్లారు. పర్యటన నుంచి తిరిగొచ్చాక ఆకట్టుకునే ఆకృతులతో పలు డిజైన్లను రూపొందించారు. ఇందుకయ్యే అంచనా వ్యయానికి సైతం ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్పటి సర్కారుకు పంపించి ఆమోదం పొందారు. తొలుత టెండర్లు పిలిస్తే గుత్తేదారులు ముందుకు రాలేదు. రెండోదఫా టెండర్లకు సమాయత్తమవుతుండగానే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తర్వాత చాదర్‌ఘాట్ బ్రిడ్జి నిర్మాణాన్ని వివిధ కారణాలతో పక్కన పెట్టేశారు.

విదేశీ పర్యటన వ్యయం సుమారు రూ. 1.50 కోట్లు

వారధి అంచనా వ్యయం రూ. 42 కోట్లు

వెడల్పు 21 మీటర్లు

బ్రిడ్జి మొత్తం పిల్లర్లు 8

పొడవు 270 మీటర్లు

# స్త్రీనిధిపై తగ్గిన భరోసా!



తాండూరు : మూడేళ్లుగా జిల్లాలో స్త్రీనిధి రుణాల పంపిణీ తగ్గుముఖం పడుతోంది. గతేడాది యాభై శాతం దాటకపోవడం గమనార్హం. దీంతో అర్హులు ఈ పథకానికి దూరమవుతున్నారు. అతివలు ఆర్థికంగా వృద్ధి చెందేలా పథకం ప్రవేశపెట్టినా లక్ష్యం ఆమడదూరంలో ఉంటోంది.జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు స్త్రీనిధి పథకం ద్వారా రూ.30 వేల లోపు రుణాలు తీసుకుంటే కేవలం 48 గంటల్లో మంజూరు చేస్తున్రాను. రూ.50 వేల నుంచి రూ.3 లక్షల లోపు 15 రోజులు సమయం పడుతోంది. అంతేకాదు సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా చరవాణి ద్వారా దరఖాస్తు చేస్తే గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సభ్యురాలి బ్యాంకు ఖాతాల్లో జమ చేయిస్తున్నారు. కొన్నేళ్లు లక్ష్యానికి మించి అదనంగా రుణాలు పొందారు. మూడేళ్లుగా మంజూరు తగ్గుముఖం పట్టింది.

వడ్డీ తక్కువే..స్త్రీనిధి రుణాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ఫ్) అధికారులు, సిబ్బంది మహిళలకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. వందకు రూ.92 పైసల వడ్డీ గురించి వివరించాల్సి ఉంది. ప్రైవేటుతో పోలిస్తే ఇది చాలా తక్కువే. రూ.25 వేల నుంచి రూ.3 లక్షల వరకు అందించే రుణాలతో ఏర్పాటు చేసే కుటీర పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు, బ్యూటీపార్లర్లు తదితర యూనిట్ల నిర్వహణతో కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ఆదాయంపై శిక్షణ, అవగాహన కల్పించాల్సి ఉంది.

పట్టించుకునేవారేరీ..

స్త్రీనిధి జిల్లా మేనేజరు వేణు ఉద్యోగం మానేసి వెళ్లారు. ఉన్నతాధికారులు ఆయన స్థానంలో కొత్త వారిని నియమించలేదు. వికారాబాద్‌లోని అధికారి రాజయ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో దాదాపు 8 నెలలుగా స్త్రీనిధి రుణాల కార్యకలాపాలను మండల సమన్వయకర్తలతో నెట్టుకొచ్చారు. దీంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవైంది. మండల, నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశాలే నిర్వహించలేదు. ఈ క్రమంలోనే రుణాల మంజూరు తగ్గుముఖం పట్టిందని ఆరోపణలున్నాయి. ఇటీవల జిల్లా మేనేజరుగా ఉదయకుమారిని నియమించారు. ఆర్థిక సంవత్సరం పూర్త కావడానికి ఆరు నెలల గడువు ఉంది. ఈలోగా లక్ష్యాలను చేరుకుంటేనే అతివలకు భరోసా దక్కుతుంది.

జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 655

స్వయం సహాయక సంఘాలు: 15,996

నమోదైన సభ్యులు:1,69,972

# రుణమాఫీ వర్తించేనా?

కరీంనగర్ : జిల్లాలో రూ.2 లక్షల్లోపు రుణమాఫీకి దూరమైన అన్నదాతలు ఇప్పటికీ ఆందోళనలోనే ఉన్నారు. తమకూ వర్తిస్తుందా? లేదా అని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ మొదలుపెట్టారు. పది రోజుల వరకు అర్హులను గుర్తించే క్రమంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులకు అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. వారు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో రుణమాఫీ పోర్టల్‌లో మరో మూడు ఐచ్ఛికాలు తీసుకొచ్చారు. ఇప్పుడు సజావుగానే జరుగుతోంది. జిల్లాలో 15,182 మంది రుణదాతల కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 12,279 మంది సభ్యుల నిర్ధారణ పూర్తయినట్లు జిల్లా వ్యవసాయాధికారి జె.భాగ్యలక్ష్మి తెలిపారు.

ఎదురైన సమస్యలు.. పరిష్కార మార్గాలు

రుణమాఫీ పోర్టల్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ సంఖ్యలు నమోదు చేయాలి. ఈ విషయంలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. చనిపోయిన వారివి నమోదు చేయడం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం జీవించి ఉన్న వారి ఆధార్ సంఖ్యలు నమోదు చేస్తే సరిపోతుందని ప్రభుత్వం సూచించింది.పెళ్లి చేసుకోని వారు, ఒంటరిగా ఉండేవారి కోసం రుణమాఫీ పోర్టల్‌లో ప్రత్యేకంగా ఐచ్ఛికం ఇవ్వలేదు. వీరిని ప్రత్యేక కుటుంబాలుగా పరిగణిస్తూ ఆధార్ నమోదు చేసే అవకాశం కల్పించారు.ఇతర రాష్ట్రాల్లో ఉంటూ.. అక్కడ ఆధార్ కార్డు కలిగిన రైతులకు మరో చోట భూములు ఉండడంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వీరి ఆధార్ నమోదు సాధ్యంకాలేదు. వారు కూడా



చేసుకునేలా మార్పు తెచ్చారు.

సందిగ్ధంలో మరికొన్ని..

రుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా? అనే విషయంలో స్పష్టత లేదు.

రుణం పొందిన ఎన్‌ఆర్‌ఐలు స్వయంగా వచ్చి వివరాలు వెల్లడించాలి. వ్యవసాయాధికారులతో సెల్ఫీ దిగాలి. వారు అక్కడి నుంచి ఇక్కడికి రావడం, సెల్ఫీ దిగడం కష్టతరంగా మారి పాలుపోని స్థితిలో ఉన్నారు.కొంతమంది రుణదాతల పేర్లు, ఆధార్ నంబర్లు తప్పుగా నమోదై మాఫీ కాని వారున్నారు. వీరికి పరిష్కారం చూపలేదు.

ఈ బ్యాంకుల్లో వారికి వర్తించలేదు..

బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్, కెనరా, ఇండియన్ ఒవర్‌సీస్, మహారాష్ట్ర బ్యాంకుల్లో రుణాలు పొందిన వేలాది మందికి రుణమాఫీ కాలేదు. వారి ఆధార్‌కార్డు నంబర్ వ్యవసాయాధికారులు నమోదు చేస్తే 'నో డాటా ఫౌండ్' అని వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులంటున్నారు. ఈ విషయంలో బ్యాంకు అధికారుల నుంచే స్పష్టత రావాల్సి ఉంది.

విడత లబ్ధి పొందిన రైతులు రుణ మాఫీ (రూ.కోట్లు)

జిల్లాలో ఇప్పటి వరకు.. మొదటి (రూ.లక్షలోపు) 38,894 201.46

రెండో (రూ.లక్షన్నరలోపు) 19,420 182.44 మూడో (రూ.2 లక్షలలోపు) 12,034 152.65

# అందని ఉపకారం.. తప్పని కష్టకాలం

భువనగిరి: ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధన రుసుంలు ఏళ్ల తరబడి మంజూరు కావడం లేదు. పేద వర్గాల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండేళ్లుగా పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఉపకార వేతనాలు, యాజమాన్యాలకు బోధన రుసుంలు అందకపోగా, తాజాగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అధికారులు ప్రకటించడం గమనార్హం. జిల్లా అధికారులు తమకు అందిన దరఖాస్తులను ఈ– కుబేర్‌లో అప్‌లోడ్ చేసినప్పటికీ అత్యధిక విద్యార్థులు, యాజమాన్యాల ఖాతాల్లో నిధులు జమకావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా ఆయా ఫీజులపై చదువులు కొనసాగించే పేద విద్యార్థులు కొందరు విద్యకు దూరమవుతున్నారు. చదువు పూర్తయినప్పటికి బోధన రుసం చెల్లించ లేదని కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతుండటంతో విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి...ఎస్సీ సామాజిక వర్గం విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఉపకార వేతనాలు, బోధనా ఫీజులు మంజూరు చేస్తుంది. అర్హులైన వారు చదువుతున్న కోర్సుకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి ఏటా ప్రభుత్వం రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఉపకారవేతనాలు మంజూరు చేస్తుంది. విద్యాసంస్థల యాజమాన్యాలకు కోర్సునుబట్టి రూ.40 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు బోధన రుసుం మంజూరు చేస్తుంది. ఇది నేరుగా విద్యార్థి పేరిట కళాశాల యాజమాన్యాల ఖాతాలో జమవుతుంది.

విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపిక చేసి జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి మంజూరుకు ప్రభుత్వానికి పంపిస్తారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం ఆయా చెల్లింపుల కోసం నిధులు కేటాయిస్తున్నప్పటికి వారి ఖాతాల్లో జమ చేయడం లేదని తెలిసింది. కొందరు విద్యార్థులకు ఇవ్వాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కార్పొరేట్ విద్య అందించేందుకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. రెండేళ్లుగా ఈ పథకం అమలుకు నిధులు మంజూరు కాలేదు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు డేస్కాలర్, రెసిడెన్షియల్ పద్ధతిలో కార్పొరేట్ విద్యాలయాల్లో ఏటా ప్రవేశాలు కల్పిస్తున్నారు. డేస్కాలర్‌కు రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42 వేలు చెల్లించాల్సి ఉంది. నిధులు మంజూరు కాకపోవడంతో తాము ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేట్ విద్యాలయాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దరఖాస్తులు పెండింగ్‌లో లేవు: జయపాల్‌రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, యాదాద్రి భువనగిరి

అందిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపిక చేసి ఈ–కుబేర్‌లో నమోదు చేస్తున్నాం. కొందరి ఖాతాల్లో నేరుగా జమవుతున్నాయి. తమకు కేటాయించిన నిధుల మేరకు దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా మంజూరుకు పంపిస్తున్నాం. అందరికీ డబ్బులు జమవుతాయి.

చురకలు



# మందుల కొరత తీరేనా..!

గోదావరిఖని పట్టణం: వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం తీవ్రస్థాయిలో ఉంటోంది. అందుకు అనుగుణంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వర్గాలు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి ప్రతీరోజు వెయ్యికి పైగా రోగులు వస్తుండగా అందులో అత్యధికంగా జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారే ఉంటున్నారు. అత్యవసర వేళల్లో అవసరమైన మందులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చామని, ఎక్కడా మందుల కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. డాక్టర్లు రాసే ఒకటి రెండు మినహా అన్ని మందులను బయట కొనుక్కోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. ఉచిత వైద్యమని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే మళ్లీ బయట మందులు కొనుక్కోవడమేంటని పలువురు రోగులు ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని నెలలుగా...జ్వరంతో బాధపడుతున్న వారికి ఇచ్చే ఇన్‌ఫ్లూజన్ నాలుగు నెలలుగా అందుబాటులో లేదు. ప్రత్యామ్నాయంగా అవసరమైన మందులు సైతం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివిధ రకాల మందులు వాడుతున్నప్పుడు తప్పనిసరిగా వాటితో పాటు పాన్‌టాప్ గోలీలు వాడుతుంటారు. ఇవి రెండు నెలల నుంచి లేవు. వ్యాధుల నివారణ కోసం వినియోగించే కీలకమైన



మందుల కొరత ఆసుపత్రిలో తీవ్రంగా ఉంది. నొప్పుల నివారణకు ఉపయోగించే డైక్లోఫాం గోలీలు, రాంటాక్, జ్వరాన్ని అరికట్టేందుకు ఉపయోగించే పారాసిటమాల్ గోలీలు సైతం లేవని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యులు రాసిన మందుల్లో అందుబాటులో లేనివాటిని మార్కు చేసి ప్రైవేటులో కొనుక్కోవాల్సిందిగా సూచిస్తున్నారు. తమపై ఆర్థిక భారం పడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని అందుబాటులో లేక..

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనే మందుల కొరత నెలకొంది. అత్యవసరమైన కొన్ని మందులను స్థానికంగా కొనుగోలు చేసి ఇస్తున్నాం. అవసరమైన మందుల వివరాలతో ఎప్పటికప్పుడు ఇండెంట్లు పెడుతున్నాం. ఈ ప్రాంతంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సైతం కొన్ని మందులను తీసుకువచ్చి రోగులకు అందజేస్తున్నాం. కొన్ని మందులు సైతం ప్రధాన స్టోర్‌లో అందుబాటులో లేకపోవడంతో జాప్యం నెలకొంటోంది. మందుల కొరత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.–డాక్టర్ తిరుమలేశ, రెసిడెంట్ మెడికల్ అధికారిణి

# వ్యాపారంలో ముద్ర!

పెద్దపల్లి : చిన్నతరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేం దుకు కేంద్ర ప్రభుత్వం 2015 సంవత్సరంలో 'మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీఫైనల్స్ ఏజెన్సీ (ముద్ర)ని ప్రారంభించింది. అప్పటి నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రుణ అవసరాలను ఈ పథకం కింద అందజేసేవారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రధాన మంత్రి ముద్ర యోజన రుణాల పరిమితిని రూ.20 లక్షల వరకు పెంచింది. సూక్ష్మ వ్యాపార యూనిట్లను పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ పథకంలో మూడు విభాగాలుగా రుణ కేటాయింపు చేస్తారు. 'శిశు' విభాగం కింద రూ.50 వేలు, 'కిషోర్' కింద రూ.5 లక్షలు, 'తరుణ్' కింద రూ.10 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. వాయిదాల్లో వడ్డీ లేని రుణాన్ని క్రమపద్ధతిలో చెల్లిస్తే మరోసారి రుణ అర్హత సాధిస్తారు. తరుణ్ విభాగం కింద తీసుకున్న రుణాలను విజయవంతంగా చెల్లించినవారికి కేంద్ర బడ్జెట్‌లో పెంచిన రూ.20 లక్షల పెంపు వర్తించనుంది.

ముద్ర పథకంతో కార్పొరేట్‌యేతర, వ్యవసాయేతర చిన్న, మధ్య స్థాయి



పారిశ్రామికవేత్తలు ఆదాయాన్ని ఆర్జించే కార్యకలాపాలకు సులువైన, హామీ లేని రుణాలను అందిస్తున్నారు. బ్యాంకర్లు మొదట స్వల్ప మొత్తంతో రుణం అందించి వినియోగదారులు కోరుకున్న వాయిదాల్లో చెల్లించేలా ఖాతాలో ఆటో డెబిట్ సౌకర్యం ఏర్పాటు చేస్తారు. మొదట తీసుకున్న రుణం ఎలాంటి కొర్రీలు లేకుండా సక్రమంగా కడితే రెండోసారి రెట్టింపు మొత్తం, ఇలా గరిష్ఠంగా రుణగ్రహీత ఏర్పాటు చేసిన పరిశ్రమ, లాభాలు చూసి రుణాలు అందిస్తారు.

15 నెలల్లో రూ.124.98 కోట్లు పంపిణీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు విభాగాలు కలిపి 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 జూన్ 30 వరకు 8,656 మంది లబ్ధిదారులకు రూ.124.98 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇందులో శిశు విభాగం కింద 3,707 మందికి రూ.9.05 కోట్లు, కిషోర్ విభాగం కింద 3,568 మందికి రూ.52.63 కోట్లు, తరుణ్ విభాగం కింద 1,381 మందికి రూ.63.3 కోట్లు పంపిణీ చేశారు. ఏటా సగటున ఇదే స్థాయిలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. పెద్దపల్లి లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌ను సంప్రదించగా రుణ పరిమితి పెంపుపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని చెప్పారు. లబ్ధిదారులు రుణాల చెల్లింపు బాగానే చేస్తున్నారని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# తగ్గిన సేవలు.. తనిఖీలకు తిలోదకాలు




తాండూరు : జిల్లాలో విస్తరిస్తున్న వ్యాపార, రవాణా రాకపోకలతో వాహన వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా రవాణా శాఖ సేవలను విస్తరించాల్సి ఉంది. అలాంటిది ఇప్పటివరకు అందించిన సేవలను ఒక్కరోజుకు కుదించారు. వెరసి తనిఖీలు చేపట్టే వీలులేక అధికలోడు సరకు రవాణాకు అడ్డుకట్ట వేసే పరిస్థితి లేకుండా పోయింది.

**లక్షకు పైగా వాహనాల వినియోగం**

వ్యాపార కేంద్రమైన తాండూరు నియోజకవర్గంలో 3లక్షల జనాభా నివాసముంటోంది. వీరిలో లక్ష మందికిపైగా వివిధ వాహనాల్ని వినియోగిస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారు, వ్యాపారులు ద్విచక్ర వాహనాలు, కార్లు వినియోగిస్తున్నారు. ప్రయాణికుల్ని తరలించేందుకు ఆటోలు, జీపులు నడుపుతున్నారు. సరకు రవాణాకు ఆటోలు, చిన్నలారీలు, లారీలు, ట్యాంకర్లు వాడుతున్నారు.

**వారంలో ఒక రోజే..**

వాహనదారులకు చోదక అనుమతుల జారీ, వాహన రిజిస్ట్రేషన్, అనుమతులు రెన్యువల్ చేయడం, వాహనాల్ని ఒకరి పేరు నుంచి మరొకరిపేరిట బదలాయింపు, వాహనాలకు సంఖ్యల కేటాయింపు సేవలను రవాణా శాఖ అధికారులు అందిస్తున్నారు. అందుకు జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరులో ఆ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి కార్యాలయాల నుంచి అధికారులు సేవలను కొనసాగిస్తున్నారు. తొలిసారిగా తాండూరులో రవాణా శాఖ కార్యాలయాన్ని ఆరు సంవత్సరాల క్రితం అప్పటి కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా చేతుల మీదుగా ప్రారంభించారు. వారంలో రెండు రోజులు మంగళ, శుక్ర వారాల్లో కార్యాలయం ద్వారా సేవలు అందించారు. వీటిని విస్తరించాల్సి ఉండగా కుదించారు. శుక్రవారం సేవలకు విరామం ప్రకటించి మంగళవారం ఒక్కరోజే సేవలకు శ్రీకారం చుట్టారు. మిగిలిన రోజుల్లో రవాణా శాఖ అధికారులతో పనులు పూర్తి చేసుకోవాలంటే వికారాబాద్, పరిగిలోని కార్యాలయాలకు పరుగు తీయాల్సిన పరిస్థితి.

**ప్రమాదాలకు కారణమవుతున్నారు**

రహదారుల్లో తనిఖీలు విస్మరించడంతో చోదకులు ఫిట్‌నెస్‌లేని వాహనాలు నడపడం, బీమా చేయకుండా, చోదక అనుమతులు లేకుండా సరకు రవాణా వాహనాల్ని నడిపిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నాలుగు రోజుల క్రితం బీమా చేయని లారీతో కరణ్‌కోట మార్గంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా మూడో తరగతి విద్యార్థి సంఘటన స్థలంలో దుర్మరణం చెందాడు. లారీని కొన్ని నెలల క్రితం కరణ్‌కోటకు చెందిన నాపరాయి వ్యాపారి కొనుగోలు చేశాడు. నెలలు గడిచినా పాత యజమాని పేరుతో లారీని నడుపుతున్నారు.

**ఒక్కరోజులో పరిష్కరిస్తున్నాం**

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని మంగళవారం కార్యాలయానికి వచ్చి పరిష్కరిస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే మరో రోజు వచ్చి కార్యాలయంలో సేవలు అందించే వీలుంటుంది. ప్రస్తుతం దరఖాస్తుదారులకు ఒక్క రోజులో పనులు పూర్తి చేస్తున్నా. వీరేంద్రనాయక్, ఎంవీఐ, తాండూరు.

# నిత్యావసరాలు ధరలు పైపైకి




పెద్దపల్లి : రోజురోజుకూ నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డీజిల్, పెట్రోల్, బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. మరోవైపు నిత్యావసర వస్తువుగా మారిన ఫోన్ రీఛార్జ్‌కు సంబంధించి అన్ని ప్రముఖ టెలికాం సంస్థలు సైతం అమాంతం ధరలు పెంచడమే కాకుండా గతంలో 28 రోజులకు టారిఫ్ ఉంటే ప్రస్తుతం 20 రోజులకే పరిమితం చేశాయి. ఇవన్నీ పేద, మధ్య తరగతి వర్గాల వారి ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ పరంగా చౌకధరల దుకాణాల ద్వారా నిత్యం అవసరమయ్యే ఈ సరకులను రాయితీ ధరలకు విక్రయించి దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రజలను ఆదుకోవాల్సి ఉన్నప్పటికి కేవలం దొడ్డు బియ్యం ఉచితంగా ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. చక్కెర, గోధుమలు వంటివి అంత్యోదయ అన్నపూర్ణ కార్డులున్నవారికి మాత్రమే అప్పుడప్పుడూ పంపిణీ చేస్తున్నారు. పీఎంసీ (ప్రైస్ మానిటరింగ్ కమిటీ) దాదాపుగా రెండేళ్లుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమావేశాలు నిర్వహించడం లేదు. పెరిగిపోతున్న ధరలు నియంత్రించేందుకు ఏ కమిటీ సక్రమంగా పనిచేయడం లేదు.ధరల పర్యవేక్షణ కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి వ్యవహరిస్తారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖ సంస్థ డీఎం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు నిత్యావసర సరకులతో సంబంధం ఉన్న అధికారులు సభ్యులుగా ఉంటారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ కమిటీ ప్రతినెలా సమావేశం నిర్వహించి ధరలు, విక్రయాలపై చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సరకులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ పరంగా కేంద్రం ఏర్పాటు చేయించి ప్రజలకు సరకులు విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రిటైల్ వ్యాపారుల వద్ద సిండికేట్ లేకపోవడం, ఒకరు తక్కువ ధరల్లో, మరొకరు ఎక్కువ ధరల్లో విక్రయిస్తుండటంతో అక్కడక్కడా ధరల పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తోంది. బియ్యం, నూనె, ఉల్లిగడ్డ, పప్పులను వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేసి ధరలు పెరుగుతుండే క్రమంలో ఎక్కువ ధరలతో విక్రయిస్తుంటారు.

బియ్యం నాణ్యతను బట్టి వ్యాపారులు ధర అమాంతం పెంచేస్తున్నారు. ఈ ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి.

భారత్ బియ్యం బస్తా కనిపించడం లేదు

సన్నబియ్యం మార్కెట్‌లో కిలో రూ.65 వరకు ఉంటోంది. కేంద్రం కిలో రూ.29కే భారత్ రైస్ పేరుతో పదికిలోల బస్తాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా కనిపించడం లేదు. అప్పుల్లో బతకాల్సి వస్తుంది. ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మహేందర్, చిరుద్యోగి, శాంతినగర్

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలి

నెలకు రూ.5 వేల వరకు ఖర్చు చేస్తే తప్ప నెలవారీ సామగ్రి వచ్చేలా కనిపించడం లేదు. కూరగాయలకు వారానికి రూ.500 వరకు వెచ్చించాల్సి వస్తుంది. గతంలో 9 రకాల వస్తువులను రేషన్ దుకాణాల్లో రాయితీ ధరలకు ఇచ్చేవారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.–రజిత, గృహిణి, పెద్దపల్లి


# ఆత్మ నిర్భర్ చెంత.. చిరు వ్యాపారి నిశ్చింత

వికారాబాద్ : జిల్లాలోని పురపాలికల్లో చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆత్మ నిర్భర్ భారత్ స్వనిధి' పథకం వరంలా మారింది. తీసుకున్న రుణం చెల్లిస్తే అందులో మరింత జమ చేసి కొత్తగా రుణం అందజేస్తున్నారు. అంతే కాకుండా కొంత వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చే రుణాన్ని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. తద్వారా మరింతగా సాయాన్ని పొంది వ్యాపార విస్తరణకు కృషి చేయవచ్చని బ్యాంక్ అధికారులు వివరిస్తున్నారు. రుణం సద్వినియోగమయ్యే విధంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కృషి చేస్తోంది.

గుర్తింపు కార్డు ఉంటే చాలు: 2020లో వచ్చిన కరోనా కారణంగా ఇబ్బంది పడకుండా చిరు వ్యాపారులకు తగిన చేయూతనందించటానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఎలాంటి హామీ పత్రాలు లేకుండా కేవలం వెండర్ గుర్తింపు కార్డు అర్హతతో వీధి వ్యాపారులకు 2020లో వ్యక్తిగత ఖాతాకు రూ.10,000 జమ చేశారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రూ.20,000, తరువాత రూ.50,000 ఇచ్చారు.

జిల్లాలోని మొత్తం వీధి వ్యాపారులు.. 9,717

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు జనాభాలో 5 శాతం వీధి వ్యాపారులను ఈ పథకానికి గుర్తించాలి. ఈ లెక్కన జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 9,717 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వారిలో 7,890 మంది దరఖాస్తు చేసుకోగా ప్రతి ఒక్కరికీ కార్డు జారీ చేశారు. జిల్లాలో మూడో విడత రుణాల పంపిణీ ప్రస్తుతం నడుస్తోంది. ఆగస్టు 1 నాటికి మూడో విడతలో 730 మందికి రుణాలు ఇవ్వాలన్న లక్ష్యాన్ని



నిర్ణయించగా 1030 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 926 మందికి అందజేశారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి..

– రవికుమార్, మెప్మా జిల్లా అధికారి.

ఆత్మ నిర్భర్ స్వనిధి పథకం చిరు వ్యాపారులకు ఆర్థికంగా వరం. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. సక్రమంగా రుణం చెల్లించిన వారికి తిరిగి సులభంగా రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పిస్తున్నాం. వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రుణం పొంది ఆర్థికంగా బలోపేతం కావచ్చు.

# సాగు లేదు.. పరిహారం రాదు

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు పాత కట్టకు గండి పడి రైతుల పంట పొలాలు కొట్టుకుపోయి రెండేళ్లు గడిచినా పరిహారం అందక ఇప్పటికీ పలు భూములు బీళ్లుగానే మారాయి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామన్న నాయకుల, అధికారుల మాటలు నీటి మూటలే అయ్యాయి. పంట పొలాల్లో వరద ప్రభావంతో ఇసుక మేటలు, కోతకు గురై భూములు పాడయ్యాయి. ఒక్కో రైతు భూమిని చదును చేసుకొని, బావి, విద్యుత్తు మోటారు అమర్చుకునేందుకు కనీసం ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీర్‌పూర్ మండలంలో 730 ఎకరాల్లో 330 మంది రైతుల భూములు కొట్టుకుపోయినట్లు అప్పట్లో వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా తయారు చేశారు. అంతేకాకుండా వరద తాకిడికి విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు పడిపోయాయి. దీనివల్ల ట్రాన్స్‌కోకు రూ.కోటి వరకు నష్టం వాటిల్లినప్పటికీ ప్రస్తుతం మరమ్మతు చేశారు. ఆర్థికంగా ఉన్న రైతులు ప్రస్తుతం సొంతగా భూములు చదును చేసుకుని సాగు చేసుకుంటుండగా పలువురు అలాగే వదిలేసి, పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన మత్స్య కారులు

రోళ్లవాగు ప్రాజెక్టులో మత్స్య సంపదపై ఆధారపడి వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని బీర్‌పూర్, నర్సింహులపల్లె, పోతారం గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. ఏటా ప్రభుత్వం 5 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తే మరో 6 లక్షల వరకు సొంతగా కొనుగోలు



చేసి ప్రాజెక్టులో పెంచుకునే వారు. ప్రాజెక్టులో నీరంతా పోవడంతో దాదాపు 100 టన్నుల చేపలు కొట్టుకుపోయాయి. దీంతో రూ.కోటి వరకు నష్టం జరిగింది. ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో మత్స్యకారులకు పరిహారం అందక, ఉపాధి లభించక అవస్థలు పడాల్సిన పరిస్థితి.

రూ.4 లక్షలతో చదును

రూ.3.50 లక్షలు పెట్టి భూమి, వ్యవసాయ బావిని తవ్వుకొని సాగు చేసుకుంటున్న సమయంలో రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో వరదతో భూమిలో పెద్దపెద్ద బండరాళ్లు, ఇసుక మేటలు వేశాయి. ఏడాది పాటు కోలుకోని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ రూ.4 లక్షలు పెట్టి బండరాళ్లు తొలగించి, వ్యవసాయ బావి, భూమిని చదును చేసుకొని సాగు చేసుకుంటున్నాను. ఇప్పటికీ అధికారులు కనీసం సర్వే చేయకపోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి నయాపైసా పరిహారం అందలేదు.–తాడుక మల్లేశం, నర్సింహులపల్లె

# లియో పట్టేస్తోంది..!

కరీంనగర్ : ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి వ్యాపించి యువతను పట్టిపీడిస్తోంది. దీన్ని అరికట్టేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా నార్కోటిక్స్ విభాగానికి శిక్షణతో కూడిన జాగిలాన్ని అందించి గంజాయి రహిత రాష్ట్రంగా ప్రకటించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే కరీంనగర్ కమిషనరేట్లో కొత్త నార్కోటిక్స్ విభాగం ఏర్పాటుకాగా.. అధికారులతో సమానంగా ఆ జాగిలానికి సైతం మంచి గుర్తింపు అందుతోంది.మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి మధ్యవర్తుల ద్వారా గంజాయి జిల్లాకు సరఫరా అవుతోంది. పోలీసులు ప్రత్యేక తనిఖీ ద్వారా గంజాయిని కట్టడి చేస్తున్నా.. ఏదో ఒకచోట విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి సంబంధించిన పక్కా సమాచారం రాబట్టేందుకు పోలీసు శాఖకు ప్రత్యేకంగా కేటాయించిన లియో(జాగిలం).. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి జిల్లా సరిహద్దుకు వచ్చే గంజాయిని పోలీసు జాగిలం సహాయంతో పట్టుకోనున్నారు.

రూ.10 వేల గౌరవ వేతనం..

లియోకు నాలుగు నెలల వయసున్నప్పుడే మత్తు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ కేటాయించడానికి నియమించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కానిస్టేబుల్ శంకర్.. 8 నెలలపాటు లియోతో ప్రత్యేక శిక్షణ పొందారు. జాగిలానికి రూ.10 వేల గౌరవ వేతనం కేటాయించారు. ఆ డబ్బులతోనే లియోకు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు జాగిలంతో ప్రత్యేక తనిఖీ చేపట్టి గంజాయిని పట్టుకున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ ప్రస్తుతం ముమ్మరం చేశారు.

సమాచారమిస్తే వివరాలు గోప్యం గంజాయి, మత్తుపదార్థాల విక్రయాలపై ఎలాంటి సమాచారమున్నా 87126 71111 నంబర్‌కు వివరాలు తెలియజేయాలి. వచ్చిన సమాచారంపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి నిందితులను పట్టుకుంటున్నాం. గంజాయి రహిత జిల్లాగా నిలపాలనే లక్ష్యంతో కరీంనగర్ పోలీసుశాఖ పని చేస్తోంది. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. – మాధవి, ఏసీపీ, నార్కోటిక్స్ విభాగం కరీంనగర్

# విరుల 'ధర'హాసం

మేడిపల్లి: శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం, శుభకార్యాల నేపథ్యంలో ఆగస్టులో ఇళ్లు విరుల శోభను సంతరించుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్, కర్ణాటకలోని సిక్‌బల్లాపూర్, కోలార్, మహారాష్ట్రలోని నాందేడ్, ముఖేడ్ సహా హైదరాబాద్ నుంచి జగిత్యాలకు నిత్యం వివిధ రకాల పూలు వస్తున్నాయి. సాధారణ రోజుల కంటే రెట్టింపుగా అమ్ముడవుతుండగా ప్రస్తుత శ్రావణమాసంలో 2 నుంచి 4 టన్నుల వరకు విక్రయిస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూలతో పాటు తమలపాకులకూ డిమాండ్ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తుని నుంచి జగిత్యాలకు వస్తున్న తమలపాకుల ధర గతంలో 100కు రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు ఉంటోంది. జిల్లా కేంద్రంలోని వారు సహా వివిధ మండలాల నుంచి జగిత్యాలకు వస్తున్న వారు శ్రావణమాసం సహా శుభకార్యాల కోసం విరివిగా పూలు కొంటున్నారు. జిల్లాలోని ఆలయాలు కూడా ఈ మాసంలో భక్తులతో కిటకిటలాడుతుండగా డిమాండ్ పెరిగింది.

## దేవస్థానంలో నెయ్యి కొనుగోలుకు ప్రత్యామ్నాయ చర్యలు

సింహాచలం : సింహాచలం దేవస్థానంలో రైతు డెయిరీ సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో ఆహార భద్రతా అధికారులు 945 కిలోల నెయ్యి సీజ్ చేసిన నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు సన్నాహాలు చేపట్టారు. ప్రస్తుతం దేవస్థానంలో సుమారు 71వేల లడ్డూలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు సుమారు 25వేలకు పైగా లడ్డూలు విక్రయానికి అవసరమవుతాయి. లడ్డూల తయారీతో పాటు ఆలయంలో దీపారాధన, ఇతరత్రా వాటికి నెయ్యి తక్షణ అవసరం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రంలోని దేవస్థానాలను ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న డెయిరీల నుంచి ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తూ నెయ్యి కొనుగోలు చేయాలని సూచించారు. ఆ మేరకు సింహాచలం దేవస్థానం అధికారులు విశాఖ డెయిరీ నుంచి తాత్కాలికంగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఉన్నతాధికారుల అనుమతుల మేరకు తొలి విడతగా సోమవారం వంద డబ్బాల (1500 కిలోలు) నెయ్యి కొనుగోలు చేయనున్నట్లు స్టోర్సు విభాగం ఏఈవో పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు.

## రెవెన్యూ బదిలీలలు

కర్నూలు : జిల్లాలో జరిగిన రెవెన్యూ బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. సిఫార్సు లేఖలకు ప్రాధాన్యమిచ్చారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అందలమెక్కించారు. ఎలాంటి లేఖలు ఇవ్వనివారిని దూరంగా విసిరేశారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పాతుకుపోయిన వారిని ఏమాత్రం కదిలించలేదు. ఇలా రెవెన్యూ బదిలీలు అస్తవ్యస్తంగా జరిగాయి. బదిలీల ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించాల్సి ఉండగా దానిని పక్కన పెట్టారు. నిర్వహించిన బదిలీల్లో సుమారు 400 మందికి స్థానచలనం కలిగించారు. బదిలీల్లో పలువురు తమ పలుకుబడి ఉపయోగించారు.
దరఖాస్తు చేసుకోకపోయినా..బదిలీలకు దరఖాస్తు చేసుకోనివారిని ఉన్నఫళంగా బదిలీ చేశారు. కొందరు వ్యక్తులు సదరు స్థానాలపై కన్నేసి తమ పలుకుబడి ఉపయోగించడంతో వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి వారికి అవకాశమిచ్చారు. తాము దరఖాస్తు చేసుకోకపోయినా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంతో అవాక్కయ్యారు. బదిలీల వ్యవహారంలో కొందరు కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి.
గతంలో వైకాపా ప్రభుత్వంలో పలువురు వీఆర్వోలు ఆ పార్టీ నాయకులతో అంటకాగారు. వారి చెప్పినట్లు విన్నారు. పెద్దఎత్తున అక్రమాలకు సహకరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి తెదేపా నాయకులతో అంటకాగుతూ తమకు అవసరమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. ఈ బదిలీల ప్రక్రియను చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.
ముడుపులు అందించి..కల్లూరు మండలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వీఆర్వోను ఆగస్టులో దేవనకొండ మండలానికి డిప్యుటేషన్‌పై వేశారు. ఆ తర్వాత దానిని రద్దు చేసి ఆగమేఘాలపై ఆయన కోరుకున్న ఓర్వకల్లు మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. కల్లూరు మండలానికి చెందిన ఓ వీఆర్వో సి.బెళగల్ మండలానికి మొదట సిఫారసు లేఖ తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఒక్క రోజులోనే మనసు మార్చుకొని తిరిగి ఓర్వకల్లు మండలానికి వేయించుకున్నారు. మరో ముగ్గురు వీఆర్వోలు సైతం సి.బెళగల్ మండలానికి బదిలీపై వెళ్లాలని నిర్ణయించుకొని ప్రజాప్రతినిధుల లేఖలు తెచ్చుకున్నారు. ఒక్కరోజులోనే వారు తిరిగి తాము కోరుకున్న మంచి డిమాండ్ ఉన్న స్థానాలకు బదిలీ చేయించుకున్నారనే విమర్శలున్నాయి. కృష్ణగిరి మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వోను ఆయన సొంత గ్రామానికి బదిలీ చేశారు.
లేఖలు లేకుంటే అంతే..ఎలాంటి సిఫారసు లేఖలు లేని వీఆర్వోలను దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. లేఖలకు ప్రాధాన్యం ఇచ్చారేతప్ప



వారి పనితీరును ఎక్కడా గుర్తించలేదు. పలువురు ముడుపులు ఇవ్వకపోవడంతోనే దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్న ఆరోపణలున్నాయి. కర్నూలు అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వీఆర్వోను వెల్దుర్తి మండలానికి బదిలీ చేశారు. ఓర్వకల్లు మండలం నుంచి ఓ వీఆర్వోను కృష్ణగిరి మండలానికి వేశారు. కర్నూలు గ్రామీణ మండలంలో పనిచేసే వ్యక్తిని దేవనకొండ మండలానికి బదిలీ చేశారు. వీరంతా ఎలాంటి సిఫారసు లేఖలు ఇవ్వకపోవడంతో దూర ప్రాంతాలకు బదిలీలు చేశారనే ఆరోపణలున్నాయి.
ప్రభుత్వాలు మారినా..ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ కొందరు వీఆర్వోలు మాత్రం ఆయా స్థానాల్లోనే కొనసాగుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగారు. ఐదేళ్లపాటు తమ స్థానాలను పదిలపరుచుకున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా నాయకులను ప్రసన్నం చేసుకుని అక్కడే కొనసాగుతున్నారు. కొందరు కొత్తగా పోస్టింగ్ వచ్చినప్పటి నుంచి సుమారు 16 ఏళ్లపాటు మండలాన్నే వదిలి వెళ్లకపోవడం గమనార్హం. కర్నూలు గ్రామీణ మండల పరిధిలో పనిచేసే ఓ వీఆర్వో 2008 నుంచి కొనసాగుతూనే ఉండటం గమనార్హం. మధ్యలో కొద్ది నెలలపాటు వేరే మండలానికి డిప్యుటేషన్‌పై వెళ్లి తిరిగి తన స్థానానికి వచ్చేశారు.
వారికి వర్తించవా..కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి ఒకే సీటులో పనిచేస్తున్న కొందరు రెవెన్యూ సిబ్బందిని మార్చడం లేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి కలెక్టరేట్‌లో ప్రక్షాళన జరగాలని ఆదేశాలు ఇచ్చినా బేఖాతరు చేశారు. కొందరు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అదే సీటులోనే కొనసాగుతున్నారు. వీరిని వివిధ మండలాలకు మార్చినా.. తమ పలుకుబడితో తిరిగి డిప్యుటేషన్‌పై అదే సీట్లలో వాలిపోతుండటం గమనార్హం. కొందరు కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నా వారిని రానీయడం లేదన్న ఆరోపణలున్నాయి.

# చెర వీడిన.. 'సీతాకోక చిలుక..'



కొమ్మాది: ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతూ నాటి వైకాపా పెద్దలు తీసుకున్న నిర్ణయానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని లేఅవుట స్థలాలను పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించాలే తప్ప ప్రయివేటు వ్యక్తులకు బదలాయించడం కుదరదని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఏకే సింఘాల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాడు జీవీఎంసీ కౌన్సెల్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేశారు.
ఆగమేఘాలపై కౌన్సెల్‌లో తీర్మానం: మధురవాడ సర్వే నెంబరు 192/12పీలో స్థానిక నాయకులకు చెందిన 484.39 చదరపు గజాల స్థలాన్ని జీవీఎంసీకి బదలాయించి ఎంఎస్ఆర్ లేఅవుట్ నెంబరు 5/87లోని బటర్‌ఫ్లై (సీతాకోకచిలుక) పార్కు స్థలాన్ని వారికి కేటాయించాలని జీవీఎంసీ కౌన్సెల్‌లో తీర్మానం చేశారు. ప్రయివేటు వ్యక్తులకు లబ్ధి చేకూరేలా స్థల మార్పిడి చేయవద్దని అప్పట్లో ప్రతిపక్షాలు, పత్రికలు ఘోషించినా వైకాపా పాలకవర్గం పట్టించుకోలేదు. ఆగమేఘాలపై స్థల మార్పిడి తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టును ఆశ్రయించారు.లేఅవుట్ లోని స్థలాల వినియోగంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని మూడు వారాల్లోగా మూర్తియాదవ్‌కు సమాధానం ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దానిపై ఆయన సంతృప్తి చెందకపోతే, తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఆ ఉత్తర్వులను పరిశీలించిన మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి తాజాగా భూబదలాయింపును నిలిపివేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు.
తీర్మానానికి ముందే నోట్ తయారీ..
మధురవాడ సర్వే నెంబరు 192/12పీలోని ప్రయివేటు వ్యక్తులకు చెందిన 489 గజాల స్థలంలోకి వెళ్లడానికి దారి లేదు. దీంతో గజం రూ.10వేలకు మించి కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. పక్కనే ఎంఎస్ఆర్ లేఅవుట్ లోని బటర్‌ఫ్లై పార్కుకు కేటాయించిన స్థలం ముందు బీటీ రోడ్డు ఉంది. పరస్పర బదలాయింపు విధానం ద్వారా ఆ స్థలాన్ని తీసుకుంటే గజం ధర రూ.80వేల వరకు పలుకుతుంది. 489 గజాల స్థలం ధర రూ.3.91కోట్లకు చేరుకుంటుందని గుర్తించారు. దీంతో స్థల యజమానులు అప్పటి వైకాపా పెద్దలను కలిసి బేరం కుదుర్చుకున్నారు. తర్వాత కౌన్సెల్ సమావేశంలో దాన్ని ఆమోదం పొందేలా చేశారు. నాడు ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకించినా జీవీఎంసీ పాలకవర్గం ఏకపక్షంగా వ్యవహరించింది. తీర్మానానికి ముందే అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ భూ బదలాయింపు నోట్ తయారు చేయడం గమనార్హం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. కౌన్సెల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వైకాపా పెద్దల అక్రమాలకు అడ్డుకట్ట పడినట్లయింది.
పార్కు నిర్మాణాన్ని అటకెక్కించి..: ఎంఎస్ఆర్ లేఅవుట్ లో సీతాకోక చిలుక(బటర్ ఫ్లై) ఆకారంలో పార్కు నిర్మించాలని పాలకవర్గం తీర్మానించింది. 2021 ఆగస్టు 17న గుత్తేదారు శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత వైకాపా నాయకులు రంగ ప్రవేశం చేయడంతో గుత్తేదారు పనులు ప్రారంభించకుండా జాప్యం చేశారు. అనంతరం భూ బదలాయింపు ప్రతిపాదన వచ్చింది. తర్వాత గుత్తేదారు పార్కు నిర్మాణ పనులు చేపట్టకుండా 500 చదరపు గజాల స్థలం మినహాయించి ప్రహరీ నిర్మించాడు. దీనిపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తక్షణమే మొత్తం స్థలానికి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. అయితే జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.


# గడ్డ కట్టే నూనెలతో నెయ్యి కల్తీ



విశాఖపట్నం : నూనెలతో పోలిస్తే నెయ్యి కల్తీ సులభం. అత్యున్నత ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలల్లో తప్ప సాధారణంగా నాణ్యతను గుర్తించలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గడ్డకట్టే స్వభావం ఉన్న పామాయిల్, వనస్పతిని నెయ్యిలో కలుపుతారు. నెయ్యితో పోలిస్తే ఆ నూనెల ధర తక్కువ. వీటితో ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదు. జంతువుల కొవ్వు కలిపితే ఇంకా ప్రమాదకరం. దేవాలయాల్లో వినియోగించే నెయ్యిలో కల్తీల స్థాయిని గుర్తించే ప్రాంతీయ ప్రజా ప్రయోగశాలల్లో తగిన సాంకేతిక పరికరాలు లేవు. తిరుమలలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిందంటున్న నేపథ్యంలో ఆహార భద్రత తనిఖీ రాష్ట్ర ప్రయోగశాల చర్చనీయాంశమవుతోంది.
ప్రకటన ఇచ్చి ఊరుకుంది..
విభజన తర్వాత రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ప్రయోగశాలను విశాఖలో నిర్మించినా వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాలేదు. భవనాలు, మైక్రోబయాలజీ పరికరాలు వచ్చినా సిబ్బంది నియామకం జరగలేదు. ఇతర సాంకేతిక పరికరాలు కొన్ని ఉండాలి. ఎన్ఏబీఎల్(నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్) గుర్తింపు రావాలి. ఉద్యోగాల భర్తీకి గత ప్రభుత్వం ప్రకటన ఇచ్చి ఊరుకుంది. ముఖ్యమైన ప్రతి నమూనానూ హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపుతున్నారు. అక్కడి నుంచి ఫలితాలు వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుంది.
ప్రాంతీయ ప్రయోగశాలలదీ అదే తీరు
రాష్ట్రంలో విశాఖ, కర్నూలు, గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ ప్రజా ప్రయోగశాలలున్నాయి. వీటిలో సిబ్బంది కొరత వేధిస్తుంది. విశాఖలో 20 మందికి ఆరుగురే ఉన్నారు. దేవాలయాల ప్రసాదాలు, నెయ్యిలో నాణ్యత పరిశీలనకు ఈ ప్రాంతీయ ప్రయోగశాలలకు నమూనాలు పంపితే కల్తీ ఉందా లేదా అనేదే తేలుస్తారు. అది ఏ రకమైన కల్తీనో చెప్పే సాంకేతికత లేదు.
ఆహార తనిఖీ అధికారిని సభ్యుడిగా చేస్తే...: ఆలయాల్లో ప్రసాదాల తయారీ భక్తుల మనోభావాలతో కూడిన విషయం. ప్రసాదాల టెండర్ల కమిటీలో ఆహార తనిఖీ భద్రతాధికారిని సభ్యుడిగా చేరిస్తే మేలనే అభిప్రాయం ఉంది. గుత్తేదారులకు ఫుడ్ లైసెన్స్ ఉందా లేదా, బ్రాండ్ ఏంటి, తీసుకొచ్చిన నమూనాల్లో తగిన ప్రమాణాలున్నాయా లేదా అని సత్వరం గుర్తించడానికి వీలుంటుంది. ఏ ప్రధాన ఆలయంలోనూ ఇలా చేస్తున్న దాఖలాలు లేవు. గుత్తేదారుల బిల్లుల మంజూరుకు తూతూమంత్రంగా తనిఖీలు చేయిస్తున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతీయ ప్రయోగశాలల్లో నివేదికల్లో వాస్తవాలు బయటకు రాకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

# ధర ఘనం.. మరి నాణ్యత..?

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయానికి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యత రంగు, రుచి, వాసన ఉండటం లేదు.. మందు వేసవిలోనూ గడ్డలు కట్టేస్తోందంటూ గతంలోనే ఇక్కడి అర్చకులు, పరిచారకులు, ప్రసాదాల తయారుచేసే పోటు సిబ్బంది, పర్యవేక్షించే అధికారులు పలు దఫాలు ఆలయ ఈవోల దృష్టికి తీసుకొచ్చారు. మనమేమీ చేయలేమంటూ కొందరు చేతులు దులుపుకొంటే.. మరికొందరైతే అధిష్ఠాన నిర్ణయమంటూ ఫిర్యాదుదారుల నోరు నొక్కేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది. తిరుమల లడ్డూల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ కావడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో కమిషనర్ సత్యనారాయణ దేవాదాయ శాఖ పరిధిలోని ఆయా ఆలయాలకు సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతపై తనిఖీలకు ఆదేశించారు. వైకాపా ప్రభుత్వం ఏర్పాటుకు ముందు శ్రీకాళహస్తిలో విజయ, నందిని తదితర కంపెనీల నెయ్యిని వినియోగిస్తూ వచ్చారు. తరువాత వైష్ణవి, తిరుమల తదితర కంపెనీల నుంచి కొనుగోలు చేస్తున్నారు.
నెలకు ఎనిమిది టన్నుల వరకు..
ముక్కంటి ఆలయానికి అవసరమైన నెయ్యి నిల్వలను తిరుపతి గుత్తేదారులు సరఫరా చేస్తున్నారు. లడ్డూ ప్రసాదంతోపాటు చక్కెర పొంగలి, ఉప్పు పొంగలి తదితర అన్న ప్రసాదాలకు నెయ్యిని వినియోగిస్తుంటారు. వీటితోపాటు హోమాలు, నేతిదీపాలకు ఇదే నెయ్యిని సమకూరుస్తున్నారు. నెలకు 7 నుంచి 8 టన్నుల నెయ్యిని వినియోగిస్తున్నారు.
ధరలు పరిశీలిస్తే..



2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు వైష్ణవి, తిరుమల నెయ్యి కిలో రూ.497.49 వంతున, 2023 ఆగస్టు 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు వైష్ణవి నెయ్యిని కిలో రూ.569.50 వంతున గుత్తేదారులు సరఫరా చేశారు. ఇదే ధరలకు గతంలో సరఫరా చేసిన కంపెనీల నెయ్యి అందుబాటులో ఉన్నా కాదని కొత్తగా కొనుగోలు చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఇకనైనా విమర్శలకు తావులేకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## కాలిన కమ్మీల్లో.. కోట్లు దండుకున్నారు

చిత్తూరు : కాలిపోయి.. తుప్పు పట్టిన తీగలు, కమ్మీల నుంచి కోట్లు దండుకున్న వైనం.. విద్యుత్తు శాఖలో కిందిస్థాయి అధికారుల తీరును చూస్తే ఇసుక నుంచే తైలం తీస్తారనే సామెత నిజమైందనడంలో సందేహం లేదు.. అయిదేళ్ల వైకాపా ప్రభుత్వంలో విద్యుత్తుశాఖ అవినీతిలో కూరుకుపోయింది.. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అవినీతి, అక్రమాలకు అడ్డూ లేకుండా పోయింది. తిరుపతి సర్కిల్ పరిధి చిత్తూరు జిల్లాలోని పలమనేరు, అన్నమయ్య జిల్లా పీలేరులోని నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో తుప్పుపట్టిన వైరు(స్క్రాప్) పక్కదారి పట్టించి రూ.3.5 కోట్లు స్వాహా చేశారు.. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు బయటకు పొక్కనీయకుండా దాచడం గమనార్హం.
ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ పరిధిలో నియంత్రికల మరమ్మతు కేంద్రాలు ఎనిమిది ఉన్నాయి. కాలిపోయిన నియంత్రికలను ఈ కేంద్రాలకు తరలిస్తే అక్కడ మరమ్మతులు చేసి మళ్లీ వాటిని అప్పగిస్తారు. దగ్ధమైన నియంత్రికల్లో కాలిపోయిన రాగి, అల్యూమినియం వైర్లు తొలగించి కొత్తవాటిని అమర్చి వినియోగదారులకు అందిస్తారు. ఒకవేళ నియంత్రిక పనికి రాదనుకుంటే నిబంధనల ప్రకారం దాన్ని విద్యుత్తు శాఖ గోదాముకు అప్పగించి అక్కడి నుంచి కొత్తదాన్ని అందజేస్తారు. ఈ సమయంలో కాలిపోయిన, తుప్పు పట్టిన రాగి, అల్యూమినియం వైర్లను సైతం గోదాములో అప్పగించాలి. ప్రైవేటు గోదాముల్లో ఇలా జరిగినా ఆయా వైర్లను ప్రభుత్వ గోదాముకే అప్పగించాలి. మరమ్మతు కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక విభాగం ఉంది. సర్కిల్ పరిధిలో ఈఈలు, డీఈఈలు ఉంటారు. నెలకు రెండుసార్లు ఈఈ, ఆరుసార్లు డీఈఈలు ఈ కేంద్రాలకెళ్లి పర్యవేక్షించాలి. రికార్డుల నిర్వహణ మొదలు మరమ్మతులు, సిబ్బంది పనితీరు



సైతం పరిశీలించాలి. కానీ తమ వాటా చేరింది కదా..? అక్కడేం జరిగితే తమకేమన్నట్లు ఉన్నతాధికారులు వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
పలమనేరులో రూ.2.5 కోట్లు
పలమనేరులోని కేంద్రంలో రూ.2.5 కోట్ల విలువైన తుప్పు వైరు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఇక్కడి అధికారి కాలిపోయిన వైర్లను గోదాముకు అప్పగించకుండా అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేశారు. ఇలా వచ్చిన సొమ్ము సుమారు రూ.2.50 కోట్లు స్వాహా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేంద్రంలో 150 నియంత్రికలకు లెక్కల్లేవు. 50 నియంత్రికలు అసలు ఎవరికిచ్చారో తెలియదు. ఆ వివరాలు లేవు. కేంద్రానికి తరలించినవి పూర్తిగా పనికిరాకపోతే పేపరు నోటీసు ద్వారా మరోటి అందజేయాలి. ఇదీ నిబంధన. అసలు ఎలాంటి నోటీసులివ్వకుండా అందజేశారు. రికార్డుల నిర్వహణే లేదు.
పీలేరులో రూ.కోటి అన్నమయ్య జిల్లా
పీలేరులోని కేంద్రంలోనూ రూ.కోటి దండుకున్నారు. అక్కడ పనిచేసే ఉప-ఇంజినీరు తుప్పు పట్టిన రాగి, అల్యూమినియం తీగలను చెన్నైలో విక్రయించి స్వాహా చేశారని ఆ శాఖ అధికారులే నిర్ధారించినట్లు సమాచారం. వెలుగులోకి రావడంతో తీగను చెన్నై నుంచి తెచ్చి అప్పగిస్తానని సదరు అధికారి చెప్పడం, ఇందుకు చెన్నైకి వెళ్లారని సమాచారం. రికవరీ చేస్తాంరాగి, అల్యూమినియం తీగలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు గుర్తించాం. రికవరీకి చర్యలు చేపట్టాం. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేది లేదు.మహేశ్వరరెడ్డి, ఈఈ, నియంత్రికల మరమ్మతు కేంద్రాల విభాగం

## మ్యుటేషన్ పేరుతో ముంచేశారు

కర్నూలు : చట్ట నిబంధనల ప్రకారం దస్తావేజులు, వారసత్వహక్కు పత్రాలు తదితరాలన్నీ జాగ్రత్తగా పరిశీలించి భూములను మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకున్నారు. తమకు నచ్చినవారికి మ్యుటేషన్ చేసి అందినకాడికి దండుకుంటున్నారు.హొళగుంద? హాలహర్వి మండలం ఎస్.విరుపాపురం గ్రామ సర్వే నంబరు 66/సి3లో గ్రామానికి చెందిన బసప్ప అనే వ్యక్తి 1.06 ఎకరాలను 1988లో కొనుగోలు చేశారు. ఆయనకు ఇద్దరు సోదరులు. ఉమ్మడి కుటుంబంలో ఆయన కుటుంబ పెద్ద కావడంతో బసప్ప పేరుతో భూమి కొనుగోలు చేసినప్పటికీ కుటుంబసభ్యులందరూ కలిసే వ్యవసాయం చేసుకునేవారు. ఆ ముగ్గురు సోదరులు చనిపోయిన తర్వాత వారి వారసుల్లో అత్యధికులు నేటికీ కలిసే వ్యవసాయం చేసుకుంటున్నారు. చట్టప్రకారం ఆ భూమిని పంచుకోకపోవడం రెవెన్యూ అధికారులకు కలిసి వచ్చింది. గతేడాది జూన్‌లో అప్పట్లో హాలహర్వి తహసీల్దారు మల్లికార్జునస్వామి 35 సెంట్లను కె.వీరభద్రకు, మరో 71 సెంట్లను బోళగోటగౌడు, కె.నాగప్ప అనే వారికి మ్యుటేషన్ చేయడంతో బసప్ప వారసులు హతాశులయ్యారు. వారిలో కె.వీరభద్ర ఒక్కరే బసప్ప కుటుంబసభ్యుడు కాగా, బోళగోటగౌడు, కె.నాగప్పకు వారి కుటుంబంతో ఏమాత్రం సంబంధం లేదు. వారికి భూమి విక్రయించిన దాఖలాలు లేవు. ఆ భూములను వారి పేరుతో మ్యుటేషన్ చేయించడంతో బసప్ప కుటుంబసభ్యుల వారసులు గతేడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆ వివాదాన్ని పరిష్కరిస్తానని మళ్లీ ఆ తహసీల్దారే నచ్చజెప్పి రూ.45 వేలకు బేరం చేసుకున్నారన్నది బాధితుల ఆరోపణ. ఈ మేరకు ఫోన్‌పే చేశానని బసప్ప కుటుంబసభ్యుల వారసుడైన విశ్వనాథ్ ఆరోపిస్తున్నారు. ఆ మొత్తం ఇచ్చినా పని పూర్తిచేయలేదని.. ఆ తర్వాత బదిలీపై వెళ్లిపోయారని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వ కాలంలో మొత్తం 10 సార్లు, ప్రస్తుత తెదేపా ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడుసార్లు కలెక్టరేట్‌కు వెళ్లి మొరపెట్టుకున్నామని విశ్వనాథ్ చెప్పారు.ఈ విషయమై కౌతాళం మండల తహసీల్దారు మల్లికార్జునస్వామి మాట్లాడుతూ తాను హాలహర్వి మండల తహసీల్దారుగా పనిచేసిన కాలంలో ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయలేదని చెప్పారు. ఫోన్‌పేలో నా ఫోన్ నంబరుకు డబ్బులు పంపినట్లు వారికి ఎలా రసీదులు వచ్చాయో తెలియదన్నారు. నేను నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నానని పేర్కొన్నారు.
ఆక్రమించుకుని..వెల్దుర్తి మండలం నార్లాపురం గ్రామానికి చెందిన కె.పుల్లయ్యకు గ్రామంలోని సర్వే నంబరు 231లో 4.23 ఎకరాలు ఉంది. ఆ మేరకు పన్ను కాగితాలు ఆయన వద్ద ఉన్నాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన భూమిపై కొందరి కన్ను పడింది. 4.23 ఎకరాల్లో 1.59 ఎకరాలకు ఆయనకు పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉంది. భూమి మాత్రం వారి ఆధీనంలో లేదు.

# ఆవిష్కరణలకు కేంద్రం.. అంకురాలకు ప్రోత్సాహం

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నెలకొల్పిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ఆవిష్కరణలకు ప్రాణం పోస్తోంది.కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ కేంద్రం అంకుర సంస్థలను ప్రోత్సహిస్తోంది. 2018లో నెలకొల్పిన ఈ కేంద్రంలో 2021 నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించారు. ఐవోటీ, ఏఐ ఆధారిత డొమైన్లపై పనిచేస్తున్న అంకుర సంస్థల అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఆయా సంస్థలకు మార్గనిర్దేశం చేయడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించేలా కృషి చేస్తున్నారు. విపణిలోకి వచ్చేందుకు సిద్ధమైన సంస్థలను పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు.ప్రమాదం జరగకుండా ఉండాలంటే..: ఇటీవల అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి చోట 'ప్రిడిక్టివ్ అనలిటిక్స్' అనే సాంకేతికత సాయంతో ప్రమాదాలను ముందుగానే పసిగట్టవచ్చు. ఆ సాంకేతికతను వినియోగిస్తే యంత్రంలోని ఒక భాగం పనిచేయక పోయినా, ఏదైనా సమస్య వచ్చినా యాజమాన్యానికి హెచ్చరికలు అందుతాయి. తద్వారా ప్రమాదాలను నివారించేందుకు అవకాశము ఒంటుంది. సీవోఈలోని అంకుర సంస్థల వద్ద ఆ తరహా సాంకేతికత అందుబాటులో ఉంది.

రాష్ట్ర ప్రభుత్వంలో 10 ప్రాజెక్టులు: సీవోఈలో ప్రాణం పోసుకున్న




అంకుర సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 10 ప్రాజెక్టులు చేపట్టారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, పాఠశాల విద్య, మార్క్‌ఫెడ్, ఏపీఎస్ఆర్టీసీలో వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపారు. వైద్యారోగ్య శాఖలో 2022లో నాలుగు ప్రాజెక్టులు చేపట్టగా ఒక్కో దానికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పాఠశాల విద్యలో ఒక ప్రాజెక్టుకు రూ.5 లక్షలు నిధులు వచ్చాయి. ఇక్కడి అంకురాలు విశాఖ పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డ్(హెచ్ఎస్ఎల్), గెయిల్ సహా పలు ప్రైవేటు సంస్థల్లో సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాయి. విశాఖ పోర్టుకు నాలుగు, హెచ్ఎస్ఎల్, గెయిల్‌తో ఒక్కో ప్రాజెక్టు చేపట్టాయి.

వివరాలు ఇలా..పేరు: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)

నమోదు చేసుకున్న అంకుర సంస్థలు: 57

వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు: 600కు పైగా

సమకూరిన నిధులు: రూ.131 కోట్లు

మూడేళ్లుగా ఆవిష్కరణలు

మాది విశాఖపట్నం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ చేశా. మూడేళ్లుగా సీవోఈలో ఆవిష్కరణలు చేస్తున్నా. మా సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల నిధులు సమకూరాయి. మా బృందంలో 20 మంది పనిచేస్తున్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ నుంచి ఇటీవల ప్రతిపాదనలు వచ్చాయి. ప్రస్తుతం ఓ ప్రైవేటు సంస్థతో కలసి పనిచేస్తున్నాం. ఎం.శ్రీనివాస్, స్ఫటిక టెక్నాలజీస్

అందుబాటులో అత్యాధునిక సాంకేతికత

అంకురాల వద్ద ఉత్పత్తికి సంబంధించిన ప్రొటోటైప్ (నమూనా) ఉంటే వాస్తవ రూపంలోకి తీసుకొచ్చేందుకు సహకరిస్తాం. పరిశ్రమల్లో నెలకొన్న అనేక సమస్యలకు అంకుర సంస్థల వద్ద పరిష్కారాలున్నాయి. పొరుగు దేశాల్లో లభించే అత్యాధునిక సాంకేతికత ఇక్కడ అందుబాటులో ఉంది. పరిశ్రమలు ముందుకొస్తే అనేక అంకుర సంస్థలకు సహకారం లభిస్తుంది.పూజా విద్యా శంకర్, హెడ్, సీవోఈ

# వైకాపా నిర్లక్ష్యం.. కూటమి ప్రాధాన్యం

కుప్పం : త్రిరాష్ట్ర కూడలిలో చెన్నై-బెంగళూరు ప్రధాన రైల్వే మార్గంలో కీలకంగా కుప్పం రైల్వే స్టేషన్ ఉంది. ఈ మార్గం నిత్యం పలు రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకను కలుపుతున్నా అభివృద్ధికి అమడదూరంలో ఉండటంతో.. ఈ ప్రధాన మార్గానికి.. మరో ప్రత్యామ్నాయ మార్గం నిర్మించేందుకు కేంద్రం తలచింది. కుప్పం- మారికుప్పం మధ్య రైల్వేలైను ప్రతిపాదించారు. కర్ణాటకలో పరిధిలో పనులు వేగంగా జరుగుతుండగా.. వైకాపా రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే వారికి పరిహారం అందించేందుకు అడుగులు పడ్డాయి.

అమృత్ భారత్‌లో అభివృద్ధి

కుప్పానికి తూర్పున తమిళనాడులో జోలారుపేట జంక్షన్.. పడమరలో కర్ణాటకలో బంగారుపేట జంక్షన్లు 30 కి.మీ. దూరంలోనే ఉన్నాయి. ఇరు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే రైళ్లన్నీ కుప్పం మీదుగా వెళ్లాల్సిందే. ఇంత కీలకంగా ఉన్నా.. అభివృద్ధి జరగలేదు. ఇటీవల కేంద్రం అమృత భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.

2011లో ప్రతిపాదనలు..

కుప్పం-మారికుప్పం మధ్య 23.7 కిలోమీటర్ల నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటు కోసం 2011 ప్రాంతంలో రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందు కోసం గుడుపల్లె మండలంలో 238.50 ఎకరాల భూమి, కుప్పం మండలంలో 9.15 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించారు. కర్ణాటకలో భూసేకరణ పూర్తై పనులు చురుకుగా సాగుతున్నాయి. కర్ణాటకలోని మారికుప్పం రైల్వేస్టేషన్ నుంచి కర్ణాటక సరిహద్దు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైకాపా పాలనలో ఇక్కడి రైతులకు పరిహారం ఇవ్వక భూసేకరణ నిలిచింది. సీఎం కాగానే చంద్రబాబు ఆ పనులు పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వందరోజుల్లోనే 95 మందికి పరిహారం ఇచ్చి రైల్వే అధికారులకు అప్పగించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. మార్గం ఇలా..కర్ణాటకలోని మారికుప్పం రైల్వే స్టేషన్ నుంచి అత్తినత్తం, బిసానత్తం, పొగురుపల్లె, కోటచెంబగిరి, కుప్పిగానిపల్లె, అగరం, కనమనపల్లె, గుండ్లసాగరం, నక్కనపల్లె, మల్దేపల్లె, కుప్పం రైల్వే స్టేషన్‌కు చేరనుంది. ఇప్పటికే కర్ణాటకలో వేగంగా జరుగుతున్న నూతన ట్రాక్ పనులు జరుగుతూ, రైల్వే అండర్ బ్రిడ్జిలు పూర్తి చేశారు.

నెలలోనే రూ.7 కోట్ల చెల్లించాలి

గుడుపల్లె, కుప్పం మండలాల్లో భూసేకరణ పనులు పూర్తి చేశాం. ట్రాక్ నిర్మాణంలో భాగంగా నష్టపోయే రైతులకు నెల వ్యవధిలో రూ.7 కోట్ల మేర పరిహారం చెల్లించాం. 95 శాతం భూ సేకరణ చేపట్టి రైల్వే అధికారులకు అప్పగించాం.శ్రీనివాసరాజు, ఆర్డీవో, కుప్పం

# పాల బకాయిలు రూ.70లక్షలు




రాయదుర్గం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాల బిల్లుల బకాయిలు సుమారు రూ.70లక్షల దాకా రావాల్సి ఉండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క రాయదుర్గంలోనే 210 మందికి రూ.17లక్షల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లా కేంద్రంలోని ఏపీ డెయిరీ మూతపడింది. ఫలితంగా ఉమ్మడి అనంత జిల్లాలోని 16 పాలశీతలీకరణ కేంద్రాలు మూతపడ్డాయి. ఇందులో వెలుగు ఆధ్వర్యంలో 3, ఏపీ డెయిరీ ఆధ్వర్యంలో 13 కేంద్రాలు పని చేసేవి. బకాయి బిల్లుల కోసం రైతులు ఏపీ డెయిరీ, వెలుగు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరవయ్యారు. గత వైకాపా ప్రభుత్వం అమూల్ పాల డెయిరీని ప్రారంభిస్తామని, బకాయి బిల్లులు చెల్లిస్తామని హామీలిచ్చి ఆ తర్వాత చేతులెత్తేసింది.

నిరుపయోగంగా యంత్రాలు

జిల్లాలోని 16 పాలశీతలీకరణ కేంద్రాల్లోని కాలర్, కాంప్రైజర్ యంత్రాలు, 2,500 లీటర్ల పాల ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. అవి తుప్పు పడుతున్నాయి. రాయదుర్గంలోని కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళ కొందరు మద్యం తాగి సీసాలను అక్కడే పడేసి వెళ్తున్నారు.

ప్రైవేటు డెయిరీల నిలువు దోపిడి

పాల శీతలీకరణ కేంద్రాలు మూతపడటంతో ప్రైవేటు డెయిరీల యజమానులు పాడి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అర లీటరు పాల ప్యాకెట్ ధర రూ.27 పలుకుతుండగా ప్రైవేటు డెయిరీల నిర్వాహకులు ఆవు పాలు లీటరు రూ.28 నుంచి రూ.36కు, గేదె పాలు రూ.40-60 వరకు నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలు డిమాండును బట్టి మారుతుంటాయి. రాయదుర్గం నియోజకవర్గంలో పాడిరైతుల నుంచి సేకరించిన పాలను బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లోని దొడ్ల, శ్రీనివాస డెయిరీలకు విక్రయిస్తున్నారు. బకాయి బిల్లుల విషయమై ఏపీ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరణ కోరగా రూ.70లక్షల బిల్లులకు సంబంధించి ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రస్తుతం పాలశీతలీకరణ కేంద్రాలు, పాడిరైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఏపీ డెయిరీ ప్రారంభం కాగానే బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాల శీతలీకరణ కేంద్రాలు ప్రారంభించాలి

– ఎర్రిస్వామి, గలగల, పాడిరైతు పాల బిల్లు రూ.12 వేలు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం బిల్లు చెల్లించక పోవటంతో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాం. ధరలు డిమాండును బట్టి మారుతుంటాయి. విధిలేని పరిస్థితుల్లో వారు చెల్లించిన బిల్లులు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం పాలశీతలీకరణ కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

# ఉచిత ఇసుక.. మరింత సులభంగా



అనంతపురం : 'ఉచిత ఇసుక విధానాన్ని' రాష్ట్ర ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. ఇకపై ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌పై అవగాహన లేనివాళ్లు గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది సహకారంతో బుక్ చేసుకోవచ్చు. వాగులు, వంకలు, నదుల నుంచి సమీప గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లలో ఉచితంగా తీసుకెళ్లొచ్చు. ఇక నుంచి 24 గంటలూ ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులో ఉంటుంది.

కిలోమీటరుకు రూ.13.50

ఇసుక వినియోగదారులు సొంతంగా సమకూర్చుకున్న లేదా గనులు, భూగర్భ శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనాలను నిల్వ కేంద్రాలకు వెళ్లి ఇసుక తీసుకెళ్లవచ్చు. ట్రాక్టర్, టిప్పర్లలో తీసుకెళ్లే వారికి కిలోమీటరుకు చొప్పున టన్నుకు రవాణా ఛార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాక్టర్‌లో నాలుగన్నర టన్నులు ఇసుకను తీసుకోవచ్చు రూ.13.5ల చొప్పున నాలుగన్నర టన్నులకు కిలోమీటరుకు రూ.60.75లు కాగా పది కిలోమీటర్లకు రూ.607.5లు ధర నిర్ణయించారు. ఈ ధర పది కిలోమీటర్ల వరకు వర్తిస్తుంది. 10 కిలోమీటర్ల పైన 40 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.12.8లు వసూలు చేస్తారు. 40 నుంచి 80 కిలోమీటర్ల వరకు రూ.6.8లు చెల్లించాలి.

ఆన్‌లైన్‌లో బుక్ ఇలా

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ కోసం 'మైన్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లోకి వెళ్తే ..ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే పోర్టల్ ఉంటుంది. తొలుత అందులోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాధారణ వినియోగదారు, బల్క్ వినియోగదారు, ట్రాన్స్‌పోర్టల్ రిజిస్ట్రేషన్ అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో ఆయా వినియోగదారులు ఆప్షను ఎన్నుకుని ఆధార్, చరవాణి నంబర్లు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది దాంతో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత నిర్మాణం చేయదలచుకున్న దాని వివరాలు, కచ్చితమైన చిరునామా నమోదు చేయాలి. తర్వాత ఇసుక డెలివరీ కావాల్సిన చిరునామా నమోదు చేస్తే, గూగుల్ శాటిలైట్ మ్యాప్‌లో ఆ ప్రాంతం కనిపిస్తుంది. ఫిర్యాదుల సెల్ ఇసుక పంపిణీలో ఎలాంటి సమస్యలు, సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా విన్నవించుకోవడానికి అనంతపురం జిల్లా కేంద్రంలోని గనులు, భూగర్భశాఖ డీడీ కార్యాలయంలో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబరు 1800 425 6039, ల్యాండ్ లైన్ నంబరు 08554 298380కు తెలియజేయవచ్చు. అలాగే వీటిని మానిటరింగ్ చేయడానికి నలుగురు అధికారులను నియమించారు.

# పీఏసీఎస్‌లపై పిడుగు

విశాఖపట్నం : గోరు చుట్టుపై రోకలిపోటు చందంగా తయారైంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి. రుణాలు సకాలంలో వసూలవ్వక, బకాయిలు పేరుకుపోయి వీటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. గత పాలకుల తీరుతో గ్రామాల్లో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో ఆదాయపు పన్ను శాఖ రూ.కోట్లలో పన్ను చెల్లించాలంటూ డిమాండు నోటీసులు జారీ చేయడంతో సంబంధిత అధికారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నుంచి రుణాలు తీసుకుని రైతులకు పంట రుణాలుగా అందిస్తూ లక్ష్యం మేరకు వార్షిక టర్నోవరు పెంచుకునేందుకు పీఏసీఎస్‌లు కృషి చేస్తూ వచ్చాయి. సహకార శాఖ అధికారుల సూచన మేరకు గతంలో పాన్ కార్డులు తీసుకున్నాయి. వార్షిక టర్నోవరు రూ.కోటి దాటిన సంఘాలు ఆదాయపు పన్ను చెల్లించాలని ఆ శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. వీటిని ఆయా సంఘాల పెద్దలు పట్టించుకోలేదు. తాజాగా డిమాండు నోటీసులు జారీ కావడంతో ఉపశమనం కల్పించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

31 సంఘాలకు నోటీసులు: ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 సహకార సంఘాలున్నాయి. 2018-19లో వీటికి పాన్ కార్డులు జారీ అయ్యాయి. ఆయా సంఘాల్లో జరిగే ఆర్థిక లావాదేవీలన్నీ రికార్డు అయ్యాయి. వార్షిక టర్నోవరు రూ.కోటి దాటిన 31 సహకార సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిలో 23 చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. రూ. 43.46 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఆదాయపు పన్ను శాఖ అధికారుల నుంచి నోటీసు రావడంతో సంఘాల సిబ్బంది లబోదిబోమంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు కోర్టుకెళ్లారు. ప్రభుత్వమే జోక్యం చేసుకోవాల'ని చోడవరం




మండలం లక్ష్మీపురం సంఘం పూర్వ అధ్యక్షుడు సేనాపతి సత్యారావు పేర్కొన్నారు.

వార్షిక టర్నోవరు పెరగడంతో..

జిల్లాలో 31 సహకార సంఘాలకు నోటీసులు జారీ అయ్యాయి. చెల్లించాల్సిన మొత్తం రూ.కోట్లలో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సంఘాల వార్షిక టర్నోవరుపై ఏటా నివేదిక రూపంలో అందజేయాలి. నివేదిక ఇచ్చిన సంఘాలన్నింటికీ ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ప్రస్తుతం కోర్టు స్టే ఇచ్చింది.

బొడ్డేడ శ్రీనివాసరావు, జనరల్ మేనేజరు, డీసీసీబీ

# వస్తే వంద.. రాకుంటే వెయ్యి

సత్యవేడు : ఉపాధిహామీ పథకం అమలులో అవినీతి కొత్త పుంతలు తొక్కుతోంది. కూలీల రెక్కల కష్టం రాబందుల పాలవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా కూలీలను దోచుకొనే సిబ్బందికి కొదవ ఉండటం లేదు. స్థానిక నేతలు, అధికారులు తిలా పాపం తలా పిడికెడులా పంచుకుంటూ కూలీల పొట్టకొట్టడం పరిపాటిగా మారింది.

నెలకు రూ.10 కోట్లపైనే

జిల్లా వ్యాప్తంగా పథకంలో పనిచేస్తున్న 2.7 లక్షల కూలీల్లో సగంమంది నుంచి రూ.వంద వసూలు చేసినా వారానికి రూ.1,35,00,000, నెలకు రూ.5 కోట్ల మేర కూలీల నగదుకు కోత పడుతోంది. పనికి హాజరుకాని వ్యక్తుల పేరిట మరో రూ.10 కోట్ల మేర సిబ్బంది జేబుల్లోకి వెళుతోంది. ఇలా సిబ్బంది అనతికాలంలోనే ఇళ్లు, పొలాలు కూడబెడుతున్నారు.

హాజరు నమోదు, వసూళ్లు ఇలా..

పనికి వెళ్లేందుకు సుముఖంగా ఉన్న కూలీల వివరాలతో వారంలో తొలిరోజు సోమవారం మస్టర్ వేస్తారు. వారాంతంలో పని వివరాలతో మొత్తం వేతనాన్ని ఖరారు చేసి సోమ, మంగళవారాల్లో కూలీల ఖాతాలకు నగదును జమచేయటం సాధారణంగా జరిగే పద్ధతి. ఇందులో క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవోలు తమకు అనుకూలమైన రీతిలో వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో



ప్రశ్నించేవారు లేకపోవడంతో అదే పంథా నేటికీ కొనసాగిస్తున్నారు. భయంతో బయటపడని కూలీలు సత్యవేడు నియోజకవర్గంలో వెలుగుచూసిన అవినీతి ఉదంతాలు జిల్లా వ్యాప్తంగా విస్తరించాయి. నగదును తూచ తప్పకుండా క్షేత్ర సహాయకులకు లంచంగా ఇస్తున్నా బహిరంగంగా చెప్పటానికి కూలీలు వెనకడుగు వేస్తున్నారు. భవిష్యత్తులో పనులు చూపరన్న భయంతో వారుంటున్నారు. విచారణ అధికారులు సైతం సిబ్బంది తప్పిదాలు కప్పిపుచ్చుతుండటంతో అవినీతి ఊడలు అంతకంతకూ పాతుకుపో యాయి.

వెలుగులోకి ఇలా..

నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురం క్షేత్ర సహాయకుడు మాధవయ్య తనకు వారానికి రూ.100 చొప్పున ఇవ్వాలని కూలీలను ఇటీవల బెదిరించడం వివాదాస్పదమైంది. తాను పైఅధికారులకు ఇవ్వాలంటూ వసూళ్లకు పాల్పడగా ఆగ్రహించిన కొందరు కూలీలు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి పథకం అమలులో లోగుట్టుగా సాగుతున్న అవినీతిని తేటతెల్లం చేశారు.

పెళ్లకూరు మండలం రావులపాడుకు చెందిన వ్యక్తి తిరుపతిలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా.. ఆయన ఖాతాలో ఇటీవల రూ.1,200 నగదు జమయింది. వెంటనే ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు అతడికి ఫోన్‌చేసి అతని పేరును మస్టర్‌లో నమోదు చేసినందున నగదు జమయిందని పేర్కొంటూ.. నగదులో సగం ఉంచుకుని మరో సగాన్ని తనకు బదిలీ చేయాల్సిందిగా హుకుం జారీచేశారు. ఈ విషయమై సదరు ఉద్యోగి స్థానిక ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా తక్షణ స్పందన కరవైంది.

నేను రూ.2 వేలు ఇచ్చా

పనికి వెళ్తున్నా వారానికి రూ.100 చొప్పున క్షేత్ర సహాయకునికి ఇవ్వాల్సిందే. లేకుంటే మరో వారం పనులు చూపరు. హాజరుకాని వ్యక్తుల నుంచి బిల్లులో రూ.1,000 లాక్కుంటారు. నేను ఇప్పటివరకు రూ.2వేలకు పైగా నగదును లంచంగా ఇచ్చా. చంద్రకళ, రాజగోపాలపురం, సత్యవేడు

# గ్రావెల్ మాఫియా.. కబంధ హస్తాల్లో అసైన్డ్ నేలలు

చిల్లకూరు : భూమిలేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ నేలలు గ్రావెల్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కిపోతున్నాయి. 50 అడుగుల మేర గ్రావెల్ తవ్వేస్తుండటంతో భారీ గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. తీరప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ పరిస్థితి చిల్లకూరు మండలంలోని తిక్కవరం, కలవకొండ, పొన్నవోలు, నెలబల్లి రెట్టపల్లి, తిమ్మనగారిపాలెం తదితర గ్రామాల్లో నెలకొంది. మండలంలోని పలు ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా లేఅవుట్లు ఏర్పాటవుతున్నాయి. దీనికి తోడు సాగరమాల రహదారి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. వీటికి ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్ తరలిస్తూ నింపుకొం టున్నారు.

ఎక్కడెక్కడంటే..తిక్కవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 860లో ఉ



న్న ప్రభుత్వ భూమిని చేడిమాల, తిక్కవరం గ్రామాలకు చెందిన పేదలకు ఒక్కొక్కరికి 71 సెంట్ల మేర గతంలో డీకేటీ పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో గ్రావెల్ నిక్షిప్తమై ఉంది. ఇదే అదనుగా కొందరిని లోబర్చు'కొని' తవ్వకాలకు తెరతీశారు. వాస్తవానికి అసైన్డ్ భూముల్లో మైనింగ్‌కు వీల్లేదు. దీంతో అక్రమార్కులు కొత్త ఎత్తుగడ వేశారు. లబ్ధిదారులే భూములను చదును చేసుకుంటున్నట్లు వినతిపత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఇంకేముంది క్షణాల్లో వారు పచ్చజెండా ఊపేశారు. వాహనాలు తిరిగేందుకు వీలుగా తిక్కవరం చెరువుకు నీరందించే గంగకాలువను సైతం పూడ్చి రోడ్డు నిర్మాణం చేపట్టారు. పొన్నవోలు సర్వే నంబరు 57లోని ప్రభుత్వ భూముల్లో నిత్యం గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములు చివరకు చెరువును తలపిస్తున్నాయి. ఎక్కడా అనుమతుల్లేవు

చిల్లకూరు మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఎక్కడా అనుమతుల్లేవు. అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దృష్టికి తీసుకెళ్తాం. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు. రంగకుమార్, ఏడీ, భూగర్భ గనులశాఖ, గూడూరు

# పచ్చిమోసం

పత్తికొండ : అష్టకష్టాలు దాటుకొని పంటను బతికించుకున్నారు.. వచ్చిన దిగుబడిని అమ్ముదామని మార్కెట్‌కెళ్తే వ్యాపారుల వేలం వలలో చిక్కి విలవిలలాడుతున్నారు. వ్యాపారులు కనికట్టుతో రైతు కష్టాన్ని కొల్లగొడుతున్నారు. వారు నిర్ణయించిందే ధర.. వారు వేసిందే తూకంలా ఉంది పత్తికొండ మార్కెట్‌లోని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో పలు గ్రామాలకు చెందిన పత్తికొండ కూరగాయల మార్కెట్‌కు తీసుకొస్తారు. అక్కడ వ్యాపారులంతా ఏకమై 'టన్నుల్లో' మోసాలకు పాల్పడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది.

బయట మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతుంటే.. రైతుల నుంచి వ్యాపారుల కొనుగోళ్లు అందుకు భిన్నంగా ఉన్నాయి. పత్తికొండ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగే వేలాలకు వంకాయ, బీరకాయ, మిరప, చౌళకాయల తదితర కూరగాయల సంచులు భారీగా తరలొచ్చాయి. నాణ్యతనుబట్టి 18 కిలోల సంచికి రూ.350 నుంచి రూ.400 మేర ధర నిర్ణయించి కొనుగోలు చేపట్టారు. ఈ లెక్కన కిలో కూరగాయలు రూ.15 నుంచి రూ.20 మేరకే ధర పలికాయి. మిరప, చౌళ, చిక్కుడు, వంకాయ, బెండ ఇలా ప్రతి కూరగాయ ధరలు తక్కువగానే పలికాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో రకం కూరగాయలు కిలో రూ.10కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పంట కోత, మార్కెట్‌కు తరలింపు ఖర్చులుపోనూ ఏమీ మిగలడం లేదు. మార్కెట్‌కు రోజూ 15 నుంచి 20 టన్నుల వరకు సరకు వస్తున్నట్లు మార్కెట్ కమిటీ వారు చెబుతున్నారు. ఆగస్టులో ఈ ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశముంది. మార్కెట్‌లో పచ్చిమిరప ధర రూ.40 పలుకుతోంది.

**పత్తికొండలో రూ.25 వేలు... హైదరాబాద్ రూ.45 వేలు**

పత్తికొండ మార్కెట్ కమిటీకి వస్తున్న మిరపను ఇక్కడి వ్యాపారులు టన్నుకు రూ.20 వేల నుంచి రూ.25 వేలలోపే కొంటున్నారు. ఇదే మిరప హైదరాబాద్ మార్కెట్‌లో టన్ను రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతోంది. " వ్యాపారులు సగం ధరకే కొంటూ మా



రెక్కల కష్టంతో జేబులు నింపుకొంటున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మార్కెట్ కమిటీలో కూరగాయల ధరల నిర్ణయంలో వ్యాపారులు సిండికేట్ అవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**10 శాతం కమీషన్ వసూలు**

కూరగాయల మండీలో సరకు అమ్మిన ప్రతి రైతు 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందే. రైతుకు ఇచ్చే బిల్లులో 10 శాతం కోత విధించి చెల్లిస్తున్నారు. ఇందులో మండీ నిర్వాహకులకు 5 శాతం, కొనుగోలు చేసిన వ్యాపారికి మరో 5 శాతం వెళ్తుంది. ఈ సొమ్ము కనీసం మార్కెట్ కమిటీకి వెళ్లడం లేదు. సరకు తరలించే క్రమంలో మార్కెట్‌లోకి వచ్చే వాహనాలకు యార్డువారు విధించే సుంకం మాత్రమే కమిటీకి ఆదాయంగా సమకూరుతోంది. వ్యాపారుల దోపిడీని అరికట్టేందుకు మార్కెట్ కమిటీవారు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

**సరకు ఒకటే ధరలే వేర్వేరు**

తుగ్గలి మండలం పగిడిరాయికి చెందిన సుంకన్న ఇటీవలే 20 సంచుల చౌళకాయ తీసుకెళ్లి పత్తికొండ మార్కెట్‌లో 10 సంచులు ఒకచోట, పక్కనే మరో పది విక్రయానికి ఉంచారు. ఒకచోట రూ.250, మరోచోట రూ.300 ధర పలకడంతో ఆయన అవాక్కయ్యారు.

తుగ్గలికి చెందిన రైతు శ్రీనివాసులు 40 సంచుల చౌళకాయ తీసుకువెళ్లి రెండు దుకాణాల్లో విక్రయానికి ఉంచగా.. 20 సంచులకు రూ.300 చొప్పున, మరోచోట రూ.400 చొప్పున ధర పలికింది. మార్కెట్‌లోని వ్యాపారుల మాయాజాలం చూసి ఆయన ముక్కున వేలేసుకున్నారు.

తక్కువ ధరకు కొంటున్నారు


పులికొండ, రైతు, కొత్తపల్లి (పత్తికొండ)

రెండెకరాల్లో రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టి వంకాయ సాగు చేశా. పంట చేతికందకముందు ఎంతగానో ఊరించిన ధరలు అమాంతం పడిపోయాయి. మార్కెట్‌కు 18 కిలోల తూకం ఉండే 50 సంచుల వంకాయలు తెచ్చా. ధర మాత్రం రూ.400 మించలేదు. నాణ్యతగా ఉన్నా.. తక్కువ ధర పలికింది. ఖర్చులన్నీపోనూ చేతికందే సొమ్ము అంతంతే. కోత కూలీలు, రవాణా, మార్కెట్‌లో కమీషన్ ఇలా అన్నీ పోతే మిగిలిందేమీ లేదు.

కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదుకార్నలీస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, పత్తికొండ పత్తికొండ మార్కెట్ కమిటీలో కూరగాయలు విక్రయించే రైతులు కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా కమీషన్ అడిగితే వారిపై చర్యలు తీసుకుంటాం. దళారులు మార్కెట్‌లో ఎలాంటి వసూళ్లు చేయరాదు. అలాంటివి మా దృష్టికి తెస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# రూ.2 కోట్ల ప్రభుత్వ స్థలం కబ్జా?

చంద్రగిరి : నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది. రాయలపురం పంచాయతీ సర్వే నంబరు 318లో డికేటీ, కాలువ పోరంబోకు భూమిలో పక్కా వాణిజ్య భవనం నిర్మించారు. కేవలం రెండు సెంట్ల పట్టా పొంది 18 సెంట్ల కాలువ పోరంబోకు స్థలాన్ని కబ్జా చేసినట్లు



ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇక్కడ సెంటు భూమి రూ.12 లక్షల విలువ చేస్తుందని, ఇంతటి విలువైన భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా సంబంధిత స్థలాన్ని సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# గేట్లు.. నిధుల్లేక పాట్లు



శ్రీకాళహస్తి : జలాశయాలు నిండుకుండల్లా ఉండాలంటే వాటికి అమర్చిన గేట్లు బాగుంటేనే సాధ్యం. లీకేజీలు, తాత్కాలిక మరమ్మతు పనులతో చేపట్టిన గేట్లతో.. వర్షాకాలం వస్తుందంటే అధికారులు, ఆయకట్టు రైతులు గుబులు చెందాల్సిన పరిస్థితి. ప్రత్యేకించి తిరుపతి జిల్లాలో ఈ తరహా సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక పనులతో సరిపెడుతున్నారు తప్ప.. శాశ్వత పనుల నిర్వహణపై నిధుల విడుదల ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏర్పేడు సమీపంలోని చెల్లూరు వద్ద ఏర్పాటైన సదాశివకోన ప్రాజెక్టు తూము గేట్లు ఇటీవల దుస్థితికి చేరాయి. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. వర్షాలు కురిస్తే ప్రశ్నార్థకమే.

మల్లెమడుగు జలాశయం గేట్లు 1959లో ఏర్పాటు చేసినవే. అయితే తరచూ చిన్నపాటి మరమ్మతులు ఎప్పటి కప్పుడు పూర్తి చేయడం కారణంగా ఇబ్బందులు తలెత్తడం లేదు. దీన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టే విధంగా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

దుస్థితికి చేరినా..

ఎక్కడుంది: సువర్ణముఖి నదిపై శ్రీకాళహస్తి సమీపంలో

ఎప్పుడు నిర్మించారు: నీలం సంజీవరెడ్డి హయాంలో

ప్రయోజనం: 37 చెరువుల ద్వారా 10,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది.

ప్రస్తుత పరిస్థితి: గేట్లు దుస్థితికి చేరాయి

పాలకులేం చేశారు: శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా ఇసుక బస్తాలు అడ్డుపెట్టారు. వైకాపా హయాంలో ఎన్నికలకు ముందు రూ.65 కోట్లు జైకా నిధులతో ఆనకట్ట ఆధునికీకరణకు శిలాఫలకం వేసి చేతులు దులుపుకొన్నారు.

**ఏడాదిన్నరగా సాగుతూ..**

ఏర్పేడు మండలంలోని కొండల్లోంచి వచ్చే ఊటజలాలు వాలగలమంద ఏరు ద్వారా సువర్ణముఖి నదిలో కలుస్తున్నాయి. తొట్టంబేడు మండలం చోడవరం సమీపంలో వాలగలమంద ఏరుకు అడ్డుకట్టగా యాభై ఏళ్ల క్రితం ఆనకట్ట నిర్మించారు. దీని ద్వారా ఏర్పేడు, తొట్టంబేడు, పెళ్లకూరు మండలాల్లోని 12 చెరువులకు సాగునీటి జలాలు అందుబాటులోకి వచ్చేలా దీన్ని నిర్మించారు. రూ.1.19 కోట్లతో నిర్వహణకు రెండు దఫాలు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించారు.

**2015లో ప్రమాదం**

కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయానికి 2015లో వరదల కారణంగా మూడు ప్రధాన గేట్లు కొట్టుకుపోయాయి. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. వైకాపా హయాంలో శాశ్వత చర్యలకు కనీస స్పందన లేక పోవడంతో ఈ మూడు గేట్లు నేటికీ ప్రమాదకరస్థితి లోనే ఉన్నాయి. 18 గేట్లలో నీరు లీకౌతుంది.

**తరచూ లీకేజీలు**అరణియార్ ప్రాజెక్టు మరమ్మతులకు ఏటా రూ.10 లక్షల మేర నిధులను గత పాలకులు మంజూరు చేసేవారు. వైకాపా హయాంలో ఒక్క రూపాయి విడుదల కాలేదు. దీంతో కుడి, మధ్య తూముల వద్ద నీరు లీకవుతోంది. 30 మంది సిబ్బంది స్థానంలో ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పర్యవేక్షిస్తున్నారు.

# ఉత్తమ ప్రస్థానం!!




విశాఖపట్నం: దేశంలో ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు మెరుగైన ర్యాంకులు సాధించాయి. గతేడాదితో పోలిస్తే ఆంధ్ర విశ్వవిద్యాలయం ర్యాంకు (ఓవరాల్) భారీగా మెరుగుపడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) కింద రూపొందించిన ఈ జాబితాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధన, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ తదితర 13 విభాగాల్లో విద్యా బోధన, సౌకర్యాల ఆధారంగా ర్యాంకులు ప్రకటించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో

ఓవరాల్ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 2019లో 29వ ర్యాంకు సాధించగా గత అయిదేళ్లలో పూర్తిగా దిగజారింది. గతేడాది (2023) 76వ స్థానానికి పరిమితమైంది. ఈ ఏడాది 35 స్థానాలు మెరుగుపరచుకుని 41వ ర్యాంకుకు ఎగబాకింది. విశ్వవిద్యాలయాల విభాగంలో గతేడాది ఏయూ 43వ స్థానం సాధించింది. ఈ ఏడాది 18 స్థానాలు మెరుగుపరచుకుని 25వ ర్యాంకు సాధించింది. రాష్ట్రంలో కేఎల్ ఇంజినీరింగ్ కళాశాల (22వ ర్యాంకు) తర్వాతి స్థానంలో నిలిచింది.

ఏడో స్థానంలో..

టాప్-50 రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల జాబితాలో ఏయూ 7వ ర్యాంకు సాధించింది. ఇంజినీరింగ్ విభాగంలో గతేడాది (94వ ర్యాంకు)తో పోలిస్తే 4 స్థానాలు మెరుగుపడి 90వ ర్యాంకుకు చేరుకుంది. ఫార్మసీ విభాగంలో ఏయూలోని ఫార్మసీ కళాశాల 34వ ర్యాంకు సాధించింది. గతేడాదితో పోలిస్తే 12 స్థానాలు దిగజారింది. న్యాయ విద్యలో కేంద్ర ప్రభుత్వం మొదటి 40 కళాశాలలు, విశ్వవిద్యాలయాల జాబితా విడుదల చేసింది. ఏయూలోని డా.బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా 16వ ర్యాంకు, గీతం విశ్వవిద్యాలయం 37, సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) 39వ ర్యాంకు సాధించాయి.

గీతం విశ్వవిద్యాలయం

ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో గీతం విశ్వవిద్యాలయం చోటు సంపాదించింది. ఫార్మసీ విభాగంలో 48వ ర్యాంకు, ఆర్కిటెక్చర్ విభాగంలో 39వ ర్యాంకు సాధించింది.

పెరిగిన ఐఐఎం ర్యాంకు..

మేనేజ్‌మెంట్ విభాగంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంవీ)కు 26వ ర్యాంకు లభించింది. గతేడాది 29వ ర్యాంకు సాధించగా ఈ సారి మూడు స్థానాలు పైకి ఎగబాకింది. 2022లో 33వ ర్యాంకు సాధించిన ఈ సంస్థ రెండేళ్లలో ఏడు స్థానాలు మెరుగుపరచుకుంది.

10లోపు ర్యాంకు సాధనకు కృషి

ఆచార్య జి.శశిభూషణరావు, ఏయూ ఇన్‌ఛార్జి వీసీ

మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దూరదృష్టితో కూడిన నాయకత్వానికి ఫలితం కనిపిస్తుంది. ఆయన మార్గదర్శకత్వం, నాయకత్వంలో వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తాం. వచ్చే ఏడాది ఓవరాల్ విభాగంలో జాతీయ స్థాయిలో 10లోపు ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తాం.

# మేహాద్రికి గేట్ల గండం!

వేపగుంట : విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన జల వనరు మేహాద్రిరిజర్వాయరు. అధికారుల నిర్లక్ష్యంతో దీని భద్రతపై ఎప్పటికప్పుడు భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. జలాశయ గేట్ల దుస్థితిపై దృష్టిసారించడం లేదు. చూద్దాం..చేద్దాం అనే రీతిలో ఉన్నారు. రెండు రోజుల క్రితం కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో...అంతటా భయాందోళన వ్యక్తం అవుతోంది. మున్ముందు భారీ వరదలు సంభవిస్తే మేహాద్రి గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సమాచారం. **1977లో నిర్మాణం:**నగర ప్రజల అవసరాల నిమిత్తం సుమారు 2,716 ఎకరాలు సేకరించి రిజర్వాయర్‌ను 1977లో నిర్మించారు.నాటి నుంచి ప్రజల దాహార్తిని తీర్చుతోంది. నగరంలోని కొన్ని పరిశ్రమలకు ఇక్కడినుంచే కొంత కాలం జలాలను అందించారు. ఇటీవల కాలంలో నీటినిల్వ తక్కువగా ఉండటంతో పరిశ్రమలకు తగ్గించారు. ప్రస్తుత పరిస్థితి: రిజర్వాయరు గరిష్ఠ నీటిమట్టం 61అడుగులు. ప్రస్తుతం 48.5అడుగులు మాత్రమే నీరుంది. 1వ నంబరు గేటు ఐదేళ్లుగా ఒక్కసారి కూడా పైకిలేవని పరిస్థితి ఏర్పడింది. 5వ నంబరు గేటు పరిస్థితి 15 ఏళ్లుగా అలాగే ఉంది. మరమ్మతుల నిమిత్తం దాదాపు రూ.2.5 కోట్లు మంజూరు చేయాలని ఈ జలాశయ నీటిని వినియోగించుకుంటున్న జీవీఎంసీని మూడేళ్ల క్రితం జలవనరుల శాఖ అధికారులు కోరారు. అయినప్పటికి రూపాయి కూడా ఇవ్వలేదు. భారీవర్షాలకు రిజర్వాయరు నీటమట్టం పెరిగి నీటిని కిందికి వదిలే సమయాల్లో లోతట్టు ప్రాంతాలైన యల్లపువానిపాలెం, భగత్‌సింగ్‌నగర్, విమానాశ్రయం, శీలానగర్ జలమయమవుతున్నాయి. భారీ వరదలు సంభవించి... ప్రస్తుతం పని చేయని గేట్లు ఏదైనా ప్రమాదానికి గురైతే ఊహించని నష్టం జరుగుతుందని కొందరు సిబ్బంది చెబుతున్నారు. నీరు తక్కువగా ఉన్న సమయంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అ'తీగ'తీలేదు!!

విశాఖపట్నం : విశాఖ నగరంలో భూగర్భ విద్యుత్తు కేబుల్ పనులు టెండరు దశ దాటి ఏడాదైనా ముందుకు సాగలేదు. మాజీ సీఎం జగన్ సన్నిహితునికి రూ.1,340 కోట్ల విలువైన భూగర్భ విద్యుత్తు పనులను వైకాపా ప్రభుత్వ హయాంలోనే కట్టబెట్టారు. అయితే..జగన్‌కు అత్యంత సన్నిహితుడైన ఓ నేత కంపెనీ ద్వారా పనులు చేయాలను కోగా...ఈ విషయంలో రెండు సంస్థల మధ్య తేడాలు రావడం, ఆ తర్వాత సాధారణ ఎన్నికల హడావుడి మొదలు కావడం, గుత్తేదారు ఇచ్చిన విదేశీ బ్యాంకు గ్యారంటీల విషయంలో అధికారులు వెనకడుగు వేయడంతో భూగర్భ విద్యుత్తు కేబుల్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.విపత్తుల సమయంలో విద్యుత్తు వ్యవస్థకు నష్టాలు, సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హుద్‌హుద్ తుపాను సమయంలో రోజుల తరబడి అంధకారం నెలకొంది. దీనికి పరిష్కారంగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రపంచ బ్యాంకు, ఏపీడీఆర్పీ నిధులతో విశాఖలోని జోన్-1 పరిధిలో భూగర్భ విద్యుత్తు పనులు చేపట్టారు. సుమారు రూ.760 కోట్లతో 2017లో మొదలు పెట్టిన ఈ పనులు 2020-21లో పూర్తిచేశారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రీవేంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద నగరంలో భూగర్భ విద్యుత్తు పనులకు భారీగా నిధులు మంజూరు చేసింది. ఆ టెండర్లు తమ అనుయాయ సంస్థకు దక్కేలా వైకాపా చేయగలిగినా పనులను కార్యరూపంలోకి తేలేకపోయింది. వైకాపా ఓటమి చెందడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ భూగర్భ విద్యుత్తు పనులు పట్టాలెక్కించాల్సిన బాధ్యత కొత్త సర్కారుపైనే ఉంది.

భూగర్భ విద్యుత్తు లైన్ వేయాల్సిన ప్రాంతాలు

జోన్-2లో కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఎస్‌టీఎల్, గాజువాక, పెదగంట్యాడ, మింది, వడ్లపూడి, కూర్మన్నపాలెం, మల్కాపురం, శ్రీహరిపురంజోన్-3లో మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, భీమిలి, చిట్టివలస, గోపాలపట్నం, వేపగుంట, సింహాచలం, పెందుర్తి

కవర్డ్ కండక్టర్లకు రూ.200 కోట్లు, రింగ్ మెయిన్ యూనిట్ల (ఆర్ఎంయూ)కు రూ.445 కోట్లు... మొత్తంగా భూగర్భ విద్యుత్తు పనులకు రూ.1,340 కోట్లు ఖర్చుచేయనున్నారు.

ఎంతో మేలు...తెదేపా హయాంలో చేపట్టిన భూగర్భ విద్యుత్తు పనులతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఇబ్బందులు తగ్గాయి. మిగతా ప్రాంతాల్లోను ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయగలిగితే విద్యుత్తు పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్తు స్తంభాలు, వేలాడే తీగల సమస్య కనిపించదు. కరెంటు తీగలకు తగలుతున్నాయనే కారణంతో చెట్లను తొలగించే సమస్య ఉండదు. నగరంలో పచ్చదనం పెరగడానికి అవకాశం ఉంటుంది.నోటీసులు ఇస్తున్నాం: మొదట విదేశీ బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినా అభ్యంతరం వ్యక్తం చేయగానే వాటి స్థానంలో జాతీయ బ్యాంకు పూచీకత్తులు సమర్పించారు. ఏడాదైనా పనులు ప్రారంభించ లేదు.. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని మరో నోటీసు జారీచేశాం. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలోను ఉంది. పనులు త్వరలోనే కార్యరూపంలోకి వస్తాయనే ఆశాభావంతో ఉన్నాం.

పృథ్వీతేజ్, సీఎండీ, ఈపీడీసీఎల్

# తప్పులెన్నో కప్పిపుచ్చి.. తమవంతెంతో ఎంచి..

అనకాపల్లి : వైకాపా హయాంలో లెక్కలేనన్ని భూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటిపై ఫిర్యాదులు స్వీకరించి.. బాధితులకు న్యాయం చేయాలనే కూటమి ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం బాధితులు నేరుగా ఫిర్యాదులు అందించడానికి వీలుగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు అన్ని గ్రామాల్లోనూ ఈ సదస్సులు చేపట్టబోతున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఏ అధికారులైతే భూ అక్రమాలకు వత్తాసు పలికారో.. ఇప్పుడు అదే అధికారుల ఆధ్వర్యంలో సదస్సుల పేరుతో విచారణలు జరిపించడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరి రెండు నెలలు గడిచినా ఏ శాఖలోనూ బదిలీలు చేపట్టలేదు. వైకాపా ప్రభుత్వంలో చక్రం తిప్పిన తహసీల్దార్లు, ఆర్డీవోలు ఇంకా అదే స్థానంలో కొనసాగుతున్నారు. గతంలో వారు చేసిన అక్రమాలు.. రెవెన్యూ సదస్సుల్లో సక్రమాలుగా ఎలా మార్చుతారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ విషయమై సీపీఎం లిబరేషన్ జిల్లా కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ రెవెన్యూ శాఖ కార్యదర్శి సిసోదియాకు లేఖ కూడా రాశారు.అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వైకాపా పాలకుల అండతో రికార్డులు తారుమారు చేసి పేదల భూములు పెద్దలకు అప్పగించేశారు. దశాబ్దాలపైగా సాగులో ఉన్నవారిని కాదని వైకాపా పెద్దలు చెప్పిన వారికే హక్కులు కట్టబెట్టారు. అసైన్డ్ భూములనూ లాక్కున్నారు. వివాదాస్పద భూములను 22(ఎ) నుంచి తప్పించి అప్పటి నేతల బినామీలకు ధారాదత్తం చేశారు. దేవాదాయ భూములను సైతం గుప్పిట్లో పెట్టుకున్నారు. వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అక్రమార్కులతో జట్టుకట్టి వాటాలు పంచుకున్నారు. ఇప్పుడు నిర్వహించబోయే రెవెన్యూ సదస్సుల్లో బాధితులు ఫిర్యాదులు అందించినా, తమ హయాంలోనే అక్రమాలు జరిగాయని ఏ అధికారైనా అంగీకరిస్తారా అన్నది ప్రశ్నార్థకమే.. తూతూమంత్రంగా సదస్సులు నిర్వహించి చేతులు దులిపేసుకుంటే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరదని సంబంధిత శాఖలోనే చర్చ జరుగుతోంది. ఇప్పుడున్న అధికారులను బదిలీ చేసిన తర్వాత సదస్సులు నిర్వహిస్తే కొంతవరకైనా ఉపయోగం ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

ఇవిగో కొన్ని భూ అక్రమాల వివరాలు..

చీడికాడ మండలం కోనాంలో సర్వే నంబర్ 289లో కోందు తెగకు చెందిన ఆదివాసీలు 30 ఏళ్లుగా సాగు పంటలు సాగుచేస్తున్నారు. ఆ విషయంలో తహసీల్దారు, నర్సీపట్నం ఆర్డీవో కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు పంపించారు. నాటి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అనుచరుడు గిరిజనుల సాగులో ఉన్న భూములను తప్పుడు రికార్డులతో కొనుగోలు చేయడంతో అధికారులు వారికే వత్తాసు పలికారు.

పరవాడ మండలం దేశపాత్రునిపాలెంవాసి ఒకరు తన కుటుంబ సభ్యుల పేరుతో రికార్డుల ట్యాంపరింగ్ చేసి 70 ఎకరాలు కొల్లగొట్టేశారు. దీనిపై తహసీల్దారుతో పాటు ఆర్డీవోకి ఎన్నో ఫిర్యాదులు అందాయి. కనీసం వాటి వంక అధికారులు చూసిందే లేదు. తర్వలో నిర్వహించబోయే రెవెన్యూ సదుస్సులు అదే ఆర్డీవోలు, తహసీల్దారుల పర్యవేక్షణలోనే జరగనున్నాయి. అప్పుడు స్పందించని అధికారులు ఇప్పుడు న్యాయం చేస్తారా అన్నది అనుమానమే. అనంతగిరి మండలంలోని నాన్‌షెడ్యూల్డ్ గ్రామాల్లో గిరిజనుల సాగులో ఉన్న భూములను సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు చేసేసుకున్నారు. దీనిపై తహసీల్దారు, కలెక్టరు కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసినా వారి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

వి.మాడుగుల మండలం కామకూటం గ్రామంలో పెద్దేరు నిర్వాసితులకు ఇచ్చిన ప్రభుత్వ భూములను ఇతర జిల్లాల వారు చట్టవిరుద్ధంగా 99 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. దీనిపై తహసీల్దారు, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.రోలుగుంట మండలం పెద్దపేటలో డీఫాం భూములను స్థానికేతరులకు ఇచ్చారు. సాగులో ఉన్న ఆదివాసీలున్నా వారిని రికార్డుల నుంచి ఏకపక్షంగా తొలగించేశారు. రీసర్వేలో స్థానికేతరులే సాగులో ఉన్నట్లు చూపించారు.

చురకలు



# 100 రోజుల పల్లె ప్రగతికి కార్యాచరణ

ఆత్మకూరు : గత ఐదేళ్లు అధికార గద్దెపై కూర్చొన్న వైకాపా పల్లె ప్రగతిని 'మురుగు'లో ముంచింది. కేంద్రం ఇచ్చిన నిధులనూ మళ్లించేసింది. పంచాయతీ ఖాతాలను ఖాళీ చేసి బ్లీచింగ్ కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా చేసేసింది. ఫలితంగా పల్లె సీమలను అపరిశుభ్రత ముంచెత్తుతోంది.. అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం పల్లెలపై ప్రత్యేక దృష్టి సారించింది..'వంద'రోజుల ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. ఎల్ఈడీ దీపాలు, మురుగు కాల్వ నిర్వహణ, చెత్త, వ్యర్థాల నిర్మూలన, మురుగు గుంతల పూడ్చివేత, రహదారుల వెంట గడ్డి, చెత్త కుప్పల తొలగింపు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

**వీటిపై ప్రత్యేక దృష్టి**

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గతంలో తెదేపా హయాంలో కేంద్రాలు ఏర్పాటు చేయగా వైకాపా నిర్వీర్యం చేసింది. వాటిని మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు వంద రోజుల ప్రణాళికలో చేర్చారు. అక్టోబరు 2 నాటికి సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తారు. పంచాయతీల్లో సాగునీటి పథకాలు, చెరువులు, పైప్‌లైన్లు, కుళాయిలు ఎక్కడెక్కడ ఎన్ని ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలిస్తారు. జియో ట్యాగింగ్ చేస్తారు. కుళాయి కనెక్షన్లపై పల్స్ సర్వే చేస్తున్నారు. నీటి




నాణ్యత, పరిశుభ్రత, భూగర్భ జలాలు, నీటి వనరులు పరిశీలించి లబ్ధిదారుల పేరిట యాప్‌లో నమోదు చేస్తారు.

బహిరంగ మలమూత్ర విసర్జనను నిర్మూలించేందుకు 2014-19 మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేశాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. తాజాగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊళ్ల పరిశుభ్రతకు పెద్దపీట వేశాయి. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక సర్వే చేయనున్నారు.

**ఖాతా ఖాళీ చేసిన జగన్**

గ్రామ స్వరాజ్యానికి మూలస్తంభంలాంటి పంచాయతీ వ్యవస్థను జగన్ పతనం చేశారు. పంచాయతీలకు సర్వాధికారాలు కల్పించిన 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి తూట్లు పొడిచారు. నిబంధనల ప్రకారం.. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో పది శాతాన్నే పరిపాలన అవసరాలకు వెచ్చించాలి. ఆ సొమ్ములోంచే విద్యుత్తు బకాయిలు చెల్లించాలి. గత సర్కారు సగటున 24 శాతం నుంచి 90 శాతం వరకు ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల నుంచి ఖాళీ చేసింది.

# మత్తు కట్టడికి కార్యదళం

కర్నూలు : వైకాపా హయాంలో వీధివీధికీ వ్యాపించిన గంజాయి, డ్రగ్స్ కట్టడికి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. దీని కోసం రాష్ట్ర స్థాయిలో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయనుంది. ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ తరహాలో గంజాయి, డ్రగ్స్ నిరోధానికి యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు కానుంది. నిరంతరం నిఘా ఉంచి గంజాయి సాగు, రవాణా, విక్రయం, వినియోగం.. ఇలా అన్ని దశల్లో కట్టడి చేసేలా టాస్క్‌ఫోర్స్ పనిచేయనుంది.

**కర్నూలులో రేంజ్ కార్యాలయం**

కర్నూలులో రేంజ్ స్థాయి యాంటి నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటుకానుంది. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరులకు కేంద్రంగా పని చేయనుంది. కేసుల నమోదు నుంచి దర్యాప్తు ఇక్కడి నుంచే కొనసాగనుంది.

ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 19 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 56 మంది కానిస్టేబుళ్లు, ఏడుగురు వాహన డ్రైవర్లు, 12 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 104 మందిని కేటాయించనున్నారు.

**జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ సెల్**

కర్నూలు జిల్లా కేంద్రంలో ఏర్పాటయ్యే నార్కొటిక్స్ కంట్రోల్ సెల్‌కు సీఐ, ఎస్సై, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు, డ్రైవర్, ఇద్దరు హోంగార్డులను కలిపి మొత్తం 18 మందిని కేటాయించనున్నారు.నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటయ్యే నార్కొటిక్స్



కంట్రోల్ సెల్‌కు ఒక ఎస్సై, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 8 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను కలిపి మొత్తం 13 మంది బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

**బానిసలే విక్రేతలుగా మారి**

గంజాయి బానిసలే గంజాయి విక్రేతలుగా మారుతున్నారు. 2023 సంవత్సరంలో 37 కేసులు నమోదు చేసి 190 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. వైకాపా నేతలతో సత్సంబంధాలు కలిగిన హిందూపురానికి చెందిన రోహిత్ కర్నూలును అడ్డాగా మార్చుకుని గంజాయి, డ్రగ్స్ వ్యాపారం చేశారు. కళాశాలల్లో యువతను 'మత్తు'లో దింపి వ్యాపారాన్ని విస్తరించారు. ఒకసారి పోలీసులు తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి దొరికింది. ఏడుగురు విక్రేతల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఉండటం గమనార్హం. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసి మత్తుకు బానిసలైన 24 మందిలో ఓ వైద్యుడు ఉన్నట్లు గుర్తించారు.

ఆదోని ప్రాంతం సంతేకుడ్లూరుకు చెందిన అన్నదమ్ములు రవి, చంద్ర ఇంట్లో బళ్లారి పోలీసులు తనిఖీ చేయగా 50 కిలోలకుపైగా గంజాయి లభించడం సంచలనంగా మారింది. ఇటీవల కర్నూలుకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ భద్రాచలంలో గంజాయి కొనుగోలు చేసి కర్నూలు తీసుకొచ్చి పలువురికి విక్రయిస్తుండగా గుట్టు రట్టైంది.గంజాయి బానిసలైన యువకులు హత్యలు, అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. డోన్, నంద్యాల పరిధిలో తరచూ ఘర్షణలకు దిగుతున్నారు.

# చుట్టూ నీరు.. ఆగని కన్నీరు!



తాడిమర్రి : ప్రభుత్వాలు మారినా తాడిమర్రి మండలంలోని కొన్ని గ్రామాల దుస్థితి మాత్రం మారడంలేదు. ఏళ్ల తరబడి నీటి కష్టాలు తీరడంలేదు. రామాపురం, చిల్లవారిపల్లి, చిల్లకొండాయపల్లి గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక రోజు, రెండ్రోజులు కాదు ఏకంగా 4 నెలలుగా ఆయా గ్రామాలకు నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారంటే సమస్యకు శాశ్వత పరిష్కారంపై చూపుతన్న నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతోంది. ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన సందర్భంగా తప్పకుండా తాగునీరందిస్తామని హామీ ఇచ్చిన నాయకులు అనంతరం ముఖం చాటేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కూలీ పనులను సైతం మానుకుని ట్యాంకరు నీటి కోసం ఎదురుచూస్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**చిత్రావతిలో నీళ్లున్నా.. తీరని దప్పిక**

మండల సరిహద్దులో చిత్రావతి జలాశయం ఉంది. ఈ జలాశయం మండలంలోని పలు గ్రామాల చుట్టూ విస్తరించింది. అయినా గ్రామాలకు తాగునీరందని దుస్థితి నెలకొంది. జలాశయంలో పది టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడు కూడా పరిసర గ్రామాల్లో దాహం కేకలే వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద కి.మీ. దూరంలో ఉన్న గ్రామాలకు చిత్రావతి జలాశయం నుంచి సత్యసాయి తాగునీటి సంస్థ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తోంది. దగ్గరలో ఉన్న గ్రామాలకు మాత్రం దాహార్తి తీర్చట్లేదు. చిల్లవారిపల్లి, చిల్లకొండాయపల్లి గ్రామాలు చిత్రావతి జలాశయానికి కేవలం పది కి.మీ. దూరంలోనే ఉన్నాయి. రామాపురంలో తాగునీటి సమస్యతో ఆ గ్రామం ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. 6, 7 నెలలుగా నాయకులు రోజూ 5 ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. గత మూడేళ్లుగా ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో ఆ గ్రామాల్లో తాగునీటి కష్టాలు - ప్రజలు పడుతున్న ఇబ్బందులను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

**సొంత ఖర్చుతో సరఫరా చేస్తున్నా..**


రామ్మోహన్‌నాయుడు, రామాపురం మాజీ సర్పంచి

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడినపప్పటి నుంచి సొంతంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నా. గ్రామ ప్రజలు పడుతున్న ఆగచాట్లు చూడలేక ఈ పని చేస్తున్నా. అధికారులు మాత్రం ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోండి నిధులు అందజేస్తామని చెబుతున్నారే తప్ప ఇంత వరకూ ఒక్క రూపాయీ ఇవ్వలేదు. సత్యసాయి తాగునీటి పైపు లైన్ మరమ్మతులకు గురైంది. దాన్ని బాగుచేయమని పలుమార్లు కోరినా స్పందించే వారే లేరు.

**నిధులు మంజూరుకాగానే పనులు**

కొన్ని గ్రామాల్లో సత్యసాయి తాగునీటి పైపులు మరమ్మతుల కారణంగా నీళ్లు సరఫరా కావడంలేదు. దీనికి కోసం నిధులు ప్రతిపాదించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు ప్రారంభిస్తాం. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంచాయతీ బోర్లల్లో నీటిమట్టం తగ్గిపోయాయి. ఎన్ని బోర్లు వేసిన నీళ్లు పడటం లేదు.లక్ష్మి, జేఈ, గ్రా.నీ.శా, తాడిమర్రి

# మన ప్రాజెక్టులు భద్రమేనా?



అనంతపురం : కరవు అంటే మొదట గుర్తుకు వచ్చేది ఉమ్మడి అనంతపురం జిల్లా. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదవుతున్న ప్రాంతంలో రెండోస్థానంలో ఉంది. ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో కురిసిన వర్షాలకు తుంగభద్ర, పెన్నా నదులు ఉప్పొంగితే తప్ప ఇక్కడి ప్రాజెక్టులు నిండటం కష్టం. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులోని ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాలి. గడిచిన ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణకు వైకాపా సర్కారు కనీస నిధులు ఇవ్వలేదు. గేట్లు విరిగిపోయినా.. కాలువల షట్టర్లు లీకవుతున్నా మరమ్మతు చేసేందుకు గత ప్రభుత్వానికి చేతులు రాలేదు. జిల్లాలో ఎంతో ముఖ్యమైన ఎంపీఆర్, పేరూరు జలాశయాలను లీకేజీ బెడద వెంటాడుతోంది. కొత్తగా ఏర్పడిన తెదేపా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల మరమ్మతుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సెప్టెంబరులో వర్షాలు కురిసి నిండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వీలైనంత వేగంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

**సీపేజీ ఆగేదెప్పుడో..**

ఉరవకొండ మండలంలోని పెన్నాహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)లో సీపేజీ సమస్య నెలకొంది. ఏటా గ్రౌటింగ్ చేస్తూనే ఉన్నా పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు. జలాశయం కట్ట బలహీనంగా ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వరదలు సంభవిస్తే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గేట్ల కింద లీకేజీతో నీరు వృథా అవుతోంది. శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి పథకాల ద్వారా రెండు జిల్లాల్లోని గ్రామాలకు తాగునీరు ఇస్తున్నారు. ఇందుకు రోజుకు 55 క్యూసెక్కుల నీరు అవసరం. లీకేజీల ద్వారా ఎక్కువ నీరు వృథా అవుతుంది.

**రూ.3.5 కోట్లు అవసరం**

గార్లదిన్నె మండలంలోని మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) దక్షిణ కాలువ షటర్లకు సంబంధించి రబ్బర్లు అరిగిపోవడంతో లీకవుతోంది. మూడింటిలో రెండు షట్టర్లు తాత్కాలికంగా మరమ్మతు చేశారు. మరో షట్టరు నుంచి లీకేజీ ఆగడం లేదు. గేట్లు అప్పుడప్పుడు మొరాయిస్తున్నాయి. మరమ్మతుల కోసం రెండేళ్ల కిందట అధికారులు రూ.3.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరమని తెలిపినా అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. దీంతో డ్యాంలోని నీరు ఖాళీ అయింది. డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీరు వెళ్లిపోయాయి. అధికారులే చిన్నచిన్న మరమ్మతులు చేయించి ప్రస్తుతానికి లీకేజీ అరికట్టారు. మళ్లీ వరద చేరితే లీకులు మొదలయ్యే ప్రమాదం ఉందని ఏఈ సురేంద్రరెడ్డి తెలిపారు. నిధుల విడుదలైన వెంటనే పనులు మొదలుపెట్టి లీకేజీలను శాశ్వతంగా అరికడతామన్నారు.

నిల్వ సామర్థ్యం : 5 టీఎంసీలు

ఆయకట్టు : 50వేల ఎకరాలు

వరదొస్తే ప్రమాదమే..ముదిగుబ్బ మండలంలోని యోగివేమన జలాశయానికి ఏటా నిర్వహణకు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. 2021, నవంబరు 19న నివర్ తుపాను కారణంగా ఎగువ ప్రాంతం కదిరి నుంచి మద్దిలేరు వాగు ఉద్ధృతంగా పారడంతో యోగివేమనలోకి వరద పెద్దఎత్తున చేరింది. నాలుగు గేట్ల ద్వారా దిగువకు వదిలారు. వరద మరింత పెరగడంతో 5, 6, 7, 8 గేట్లు ఎత్తడానికి ప్రయత్నించగా మొరాయించాయి. దీంతో గేట్ల పైనుంచి వరద నీరు పొంగి పొర్లింది. భవిష్యత్తులో వరదలు సంభవిస్తే ప్రాజెక్టు ప్రమాదంలో పడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గేట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని జేఈ కృష్ణకుమార్ వివరించారు.

నిల్వ సామర్థ్యం : 1 టీఎంసీ

ఆయకట్టు : 12,500ఎకరాలు

ప్రతిపాదనలు పంపాం

వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

జిల్లాలోని జలాశయాల మరమ్మతుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి రూ.2.90 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఇటీవల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలోనూ వీటిపై వివరాలు అడిగారు. త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే పనులు మొదలుపెట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# నిర్మించారు.. అలా వదిలేశారు

పి.గన్నవరం : గోదావరిడెల్టా ఆధునికీకరణలో భాగంగా పుష్కరకాలం క్రితం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో జలవనరులశాఖ సిబ్బంది కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. అప్పట్లో జలవనరులశాఖలో పనిచేసే లాకులు, వార్ఫలు, ఇతర సిబ్బంది నివాసాల కోసం ప్రభుత్వ పరంగా సుమారు 100 వరకు వివిధ ప్రదేశాల్లో నిర్మించిన భవనాలు నేటికీ ఖాళీగానే మిగిలాయి. ఒక్కో భవన నిర్మాణానికి అప్పట్లో రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు వరకు ఖర్చుచేశారు. ఈ లెక్కన అప్పట్లో భవన నిర్మాణాలకు సుమారు రూ.ఆరుకోట్లుపైనే వెచ్చించారు. నేడు ఆ విలువ రెట్టింపయ్యింది. లాకులవద్ద కూడా జలరవాణాకు సంబంధించి పడవల రాకపోకలు లేకపోవటంతో ఈ సిబ్బంది కూడా వాటికి చేరువలో ఉండని పరిస్థితి. సాగునీటి క్రమబద్ధీకరణ కోసం లాకుల వద్ద సిబ్బంది పనిచేస్తున్నారు. ఇలాంటివారిలో అతికొద్దిమంది మాత్రమే ఈ భవనాలు ఉపయోగిస్తున్నారు. 90శాతం భవనాలుపైబడి నిరుపయోగంగా ఉన్నాయి. పి.గన్నవరం, మొండెపులంక, కాకినాడ, సామర్లకోట, చింతపల్లి, గోపాలపురం, సఖినేటిపల్లి తదితర ప్రాంతాల్లో నెలకొన్నాయి.

**తక్షణం ఇలా చేస్తే..** నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలవద్ద మొలిచిన చెట్లు, తుప్పలు తొలగించి అక్కడ పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి. కొన్ని భవనాలకు ఇంకా కొద్దిపాటి పనులు ఉన్నాయి. అలాంటివాటికి పనులు పూర్తిచేయాలి. రంగులువేసి విద్యుత్తు సదుపాయాలు కల్పిస్తే అవి చూడముచ్చటగా తయారవుతాయి. తక్షణమే ఉన్నతస్థాయి అధికారులు వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి జలవనరులశాఖ అధికారుల అజమాయిషీలోనే వీటిని వేరే ప్రభుత్వ అవసరాలకు వినియోగించు కుంటే బాగుంటుంది.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం** గోదావరిడెల్టా ఆధునికీకరణలో భాగంగా నిర్మించిన జలవనరులశాఖ సిబ్బంది నివాస భవనాలు ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో చాలావరకు ఖాళీగానే ఉన్నాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు

# తుంగభద్ర తుప్పు.. మన దగ్గరా ఆ ముప్పు


రాజమహేంద్రవరం : నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే తుంగభద్ర డ్యాం తలుపు కొట్టుకుపోయిన పరిస్థితులు మన దగ్గరా ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. కాటన్ బ్యారేజీ, పంపా రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు అనేకసార్లు ప్రతిపాదనలు పంపినా.. నిపుణులు సూచనలు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణకు నిధులు కేటాయించక గేట్లు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయి.

**కాటన్ బ్యారేజీ** ఏటా రాష్ట్రానికి రూ.2 వేల కోట్ల పైబడి వ్యవసాయోత్పత్తులను అందిస్తున్న కాటన్ బ్యారేజీ నిర్వహణకు గత వైకాపా పాలకులు కనీస నిధులు విదల్చలేదు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో 52 గేట్లకు మరమ్మతులు చేశారు. డ్రిప్‌లో 110 గేట్ల బాటమ్ ప్లేట్లు మార్చాలని ప్రతిపాదించారు. తాజాగా 117 గేట్లు కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపంగా డ్రిప్ అధికారులు సైతం అంగీకరించినట్లు తెలిసింది.

**పంపా రిజర్వాయర్**

కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలోని పంపా రిజర్వాయర్ గేట్లు ప్రమాదకరంగా మారాయి.

2021లోనే ప్రతిపాదనలు...2021 జులైలో నిపుణుల బృందం అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై నివేదిక ఇచ్చింది. గత ఏడాది డిసెంబరులో మరోసారి బృందం నివేదిక ఇచ్చినా వైకాపా ప్రభుత్వం



దృష్టిసారించలేదు. గేట్లు అన్ని దాదాపు శిథిలావస్థకు చేరాయని, అయిదు గేట్లును మార్చాలని ప్రతిపాదించారు. ఈ వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా రూ.25 లక్షలతో పంపా గేట్లు మరమ్మత్తు చేయించినట్లు పర్యవేక్షక ఇంజినీరు శ్రీనివాసరావు చెప్పారు.

**ప్రస్తుతం ఇలా..**

ఒక్కో గేట్‌కు 4 బేరింగ్‌లుండగా గతంలో 320 మార్చాలని నిర్ణయించగా తాజా ప్రతిపాదనతో అన్నీ మార్చే అవకాశం ఉంది. - ఒక్కో గేట్‌కు సగటున 25 మీటర్ల మేర ఇనుప తాళ్లు (ఐరన్ రోప్) ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి ప్రస్తుతం కార్డియమ్ కాంపౌండ్(గ్రీజ్ వంటి పదార్థం) పెట్టే పరిస్థితీ లేదు. - బేరింగ్ వ్యవస్థ, రోలర్లు పునరుద్ధరించాల్సి ఉంది. రెండుసార్లు పంపినా..2021 జనవరిలో కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో డ్యామ్ సేఫ్టీ కమిటీ రెండ్రోజులు కాటన్ బ్యారేజ్‌పై లోటుపాట్లు గుర్తించి రూ.66 కోట్లతో కొన్ని ప్రతిపాదనలు చేసింది. ఈ ఏడాది జనవరిలో మరో దఫా కేంద్ర బృందం వచ్చి రూ.195 కోట్లతో పలు పనులు సూచించినా ఫలితం శూన్యం.

# సహకార సంఘాలు.. సాంకేతిక హంగులు

ముమ్మిడివరం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)లో నేటికీ కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ విధానం లేదు. సాంకేతికంగా ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నా.. పీఏసీఎస్‌లలో మాత్రం వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ క్రమంలో కొన్ని అక్రమాలు చోటు చేసుకుంటున్న ఘటనలు బయటపడుతున్నాయి. జాతీయ స్థాయిలో ఒకే విధమైన సహకార వ్యవస్థను అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలోనే నిర్ణయించింది. అన్ని పీఏసీఎస్‌లలో సాంకేతిక సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రతిపాదనలు రూపొందించింది. రాష్ట్రంలో మాత్రం ఆ స్థాయిలో కంప్యూటరీకరణ పనులు ముందుకు సాగకపోవడంతో ఇటీవల రాష్ట్ర వ్యవసాయ-సహకారశాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన



సమీక్షలో దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టారు.

పీఏసీఎస్‌లలో రైతులకు సంబంధించి రుణాలు, సున్నా వడ్డీ, కౌలు రైతులకు రుణాలు, బంగారం కుదువ పెట్టుకుని ఇచ్చే రుణాలు, ఫిక్సడ్ డిపాజిట్లు ఇలా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి అన్నిరకాల సేవలందిస్తున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు ఆర్ఎస్‌ఏల ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నోడల్ ఏజెన్సీలుగా పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయి. ఈ వివరాలన్నీ దస్త్రాల్లో పొందుపర్చడంమినహా కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ విధానంలో ఉంచే ప్రక్రియ ఇప్పటివరకు లేదు.

**అక్రమాలకు అడ్డుకట్ట..**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఆన్‌లైన్ విధానం లేకపోవడం, తూతమంత్రంగా ఆడిట్‌తో సంఘాల్లోని సొమ్ము దుర్వినియోగమవుతోంది. రైతులకు అందిస్తున్న స్వల్పకాలిక పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు వంటి చెల్లింపుల్లో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులు చెల్లించిన సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్న ఘటనలు నెలకొన్నాయి. పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తిచేసి ఆన్‌లైన్ విధానం తీసుకువస్తే రైతుల వివరాలు, వారు పొందుతున్న సేవలను సులభంగా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**ప్రక్రియ వేగవంతం**

సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేశాం. ప్రస్తుతం సభ్యుల వివరాలను సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. పంట రుణాలు, డిపాజిట్లు ఇలా ప్రతి ప్రక్రియను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తాం.సహకార వ్యవస్థను బలోపేతం చేయడం, పారదర్శకంగా రైతులకు సేవలు అందించాలనే లక్ష్యంతో జరుగుతున్న ఈ ప్రక్రియను అక్టోబరు 2వ తేదీ నాటికి పూర్తి చేస్తాం.ఎస్.మురళీకృష్ణ, సహకార శాఖ జిల్లా అధికారి

## లాంగ్ ఫ్రాక్ లో మెహ్రీన్ అందాలు.. చూస్తే ఫిదానే!

మెహ్రీన్ పిర్జాదా.. నేచురల్ స్టార్ నాని కృష్ణ గాడి వీర ప్రేమగాథ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సినిమాతో స్పెషల్ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది. ఆ తర్వాత ఫిల్లౌరి మూవీతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. శర్వానంద్ తో కలిసి చేసిన తన రెండో తెలుగు సినిమా మహానుభావుడు మంచి హిట్ అయింది. మాస్ మహారాజా రవితేజ రాజా ది గ్రేట్ లో లక్కీగా నటించి మెప్పించింది. తెలుగు, తమిళ్ లో అనేక సినిమాలు చేసింది. దాదాపు మెహ్రీన్ యాక్ట్ చేసిన సినిమాలు అన్నీ హిట్స్ అయ్యాయి. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి వరుసగా తెరకెక్కించిన %ఫ2, ఫ%3లో మంచి ఛాన్స్ కొట్టేసింది. మెగా హీరో వరుణ్ తేజ్ సరసన నటించి హనీ ఈజ్ ద బెస్ట్ అంటూ బాగానే మార్కులు సంపాదించుకుంది. క్రేజ్ కూడా దక్కించుకుంది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు ఎంగేజ్మెంట్ చేసుకుని అందరికీ ఒక్కసారిగా షాక్ ఇచ్చింది. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భజన్ లాల్ బిష్ణోయ్ మనవడు భవ్య బిష్ణోయ్ తో ఎంగేజ్మెంట్ చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత అఫీషియల్ గా ఆ



విషయాన్ని అనౌన్స్ చేసింది అమ్మడు. కానీ ఆ తర్వాత పెళ్లి క్యాన్సిల్ అయిందని చెప్పింది. ఎంగేజ్మెంట్ కాగానే పెళ్లి తర్వాత సినిమాల్లో నటించనని చెప్పిన ఆమె.. మళ్లీ సినిమాలకు సైన్ చేసేందుకు రెడీ అయింది. కానీ ఒకప్పుడు వరుస అవకాశాలు అందుకున్న ఆమెకు ఇప్పుడు లక్ కలిసి రావడం లేదు. అనుకున్న స్థాయిలో ఛాన్సులు అందుకోలేకపోతోంది. రీసెంట్ గా ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ ఫాలో అయ్యి.. సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇక నెట్టింట మెహ్రీన్ సందడి మామూలుగా ఉండదు. యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తుంటోంది. సినిమాలు లేకపోయినా.. సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటోంది అమ్మడు. వారిని అసలు డిస్సపాయింట్ చేయకుండా తన గ్లామర్ షోతో అలరిస్తుంటోంది. రకరకాల ఔట్ ఫిట్స్ లో పిక్స్ దిగుతూ బ్యూటీ షేర్ చేస్తుంటోంది. తన అందాల ఆరబోతతో మైమరపిస్తుంటోంది. తాజాగా కొత్త పిక్స్ ను పంచుకుంది మెహ్రీన్ పిర్జాదా. పింక్ కలర్ లాంగ్ ఫ్రాక్ వేసుకున్న అమ్మడు.. ఔటింగ్ కు వెళ్లిన ఫోటోలు షేర్ చేసింది. క్రేజీ హ్యాండ్ బ్యాగ్ పట్టుకుని కనిపించింది. హీట్ పుట్టించే పోజు ఇచ్చి కుర్రాళ్ళ మైండ్ బ్లాక్ చేసింది. అదే సమయంలో తన ఫ్రెండ్ ను కూడా పరిచయం చేస్తూ.. హ్యాపీ గర్ల్స్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం మెహ్రీన్ పిర్జాదా నయా పిక్చర్స్.. నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. మెహ్రీన్ సో బ్యూటిఫుల్, సో గ్లోరియస్ అంటూ నెటిజన్లు ఫుల్ గా కామెంట్లు పెడుతున్నారు.

## సీనియర్ హీరోయిన్ మనోవేదన

తెలుగు తో పాటు ఇతర సౌత్ భాషల్లో హీరోయిన్ గా మెప్పించిన సిమ్రాన్ ఈ మధ్య కాలంలో సినిమాలకు కాస్త దూరంగా ఉంటూ వస్తోంది. తాజాగా ఈమె గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తారా స్థాయికి చేరింది. ఆ విమర్శలపై సిమ్రాన్ స్పందించింది. తన గురించి ఇన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం పై ఆమె అసహనం వ్యక్తం చేసింది. ఇన్నాళ్లు నిశబ్దంగా ఉన్న తాను ఇకపై సైలెంట్ గా ఉండాలని భావించడం లేదని చెప్పుకొచ్చింది. సినిమాల్లో నటిస్తున్న విషయమై వస్తున్న వార్తలను ఆమె కొట్టి పారేసింది. ప్రస్తుతం నేను ఫ్యామిలీ తో లైఫ్ ని సంతోషంగా సాగిస్తున్నాను. అంతే తప్ప పెద్ద హీరోలతో సినిమాలు చేయాలని ఆశ పడటం లేదు. ముందు ముందు కూడా నేను నా వర్క్ ను కొనసాగించాలని భావిస్తున్నాను, కానీ కొందరు మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు మాత్రం ఇప్పటి వరకు కొత్త ప్రాజెక్ట్ లను కమిట్ అవ్వలేదు అంది. ఇటీవల



ఒక స్టార్ హీరోతో సిమ్రాన్ సినిమా అంటూ పుకార్లు షికార్లు చేయడంతో పాటు, ఆమె గురించి మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అందుకే సిమ్రాన్ సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. ఒకరితో ముడి పెడుతూ సోషల్ మీడియాలో గతంలో చాలా సార్లు వార్తలు వచ్చాయి, ఇన్నాళ్లు అన్ని వార్తలకు, పుకార్లకు సైలెంట్ గా ఉన్నాను. కానీ ఇప్పుడు మరింత శృతి మించుతున్నాయి. ఆ వార్తలను ఇకపై అయినా ఆపకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది అంటూ ఆమె హెచ్చరించింది. నాకంటూ ఆత్మ గౌరవం ఉంటుంది. దానికే నేను మొదటి ప్రాధాన్యత ఇస్తాను. నా పేరును ఎవరూ దుర్వినియోగం చేసేందుకు వీలు లేదు. నేను ఎప్పుడూ సరైన దాని కోసం నా మాట వినిపించాను. ఇండస్ట్రీ నుంచి నేను ఆ విషయంను నేర్చుకున్నాను. నా గురించి తప్పుడు వార్తలు రాస్తున్న వారు వెంటనే క్షమాపణలు చెప్పాలి. సౌత్ స్టార్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, సూర్య, అజిత్, విజయ్ లతో పాటు ఎంతో మంది స్టార్ హీరోలతో సినిమాలు నటించిన సిమ్రాన్ ఈ మధ్య కాలంలో సినిమాలకు దూరంగా ఉంటుంది. అయితే త్వరలో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని మాత్రం తెలుస్తోంది. సిమ్రాన్ కి సీనియర్ హీరోయిన్ గా మంచి ఫేమ్ ఉంది. ఆ ఫేమ్ ను కొందరు ఉపయోగించుకుని పుకార్లు పుట్టిస్తూ వస్తున్నారు. ఆ విషయమై సిమ్రాన్ చాలా సీరియస్ గా స్పందించింది. ఇప్పటికి అయినా సిమ్రాన్ గురించి వస్తున్న పుకార్లు, వార్తలు ఆగిపోతాయేమో చూడాలి.




# అప్పటినుంచి ఎన్టీఆర్ ఆలోచన మారిందట..!




ఎన్టీఆర్ దేవర మరో మూడు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా కోసం ఫ్యాన్స్ అంతా ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించగా సైఫ్ అలీ ఖాన్ విలన్ గా నటించారు. పాన్ ఇండియా రిలీజ్ అవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఎన్టీఆర్ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ తో కలిసి కరణ్ జోహార్ ఒక స్పెషల్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కరణ్ జోహార్ యాంకర్ గా వ్యవహరించిన ఈ స్పెషల్ చిట్ చాట్ లో అటు దేవర ఇటు అలియా భట్ జిగ్రా గురించి ఎక్స్ క్లూజివ్ గా మాట్లాడారు. ఎన్టీఆర్ ఒక గొప్ప యాక్టర్ కెమెరా ముందు తారక్ అదరగొట్టేస్తాడని అలియా భట్ చెప్పింది. %===% లో తమ సీన్ చేస్తున్న టైం లో చాలా సపోర్ట్ ఇచ్చారని అన్నది. అంతేకాదు ఆ సినిమా చేస్తున్న టైం లో మేము మంచి స్నేహితులుగా మారాం. బ్రహ్మాస్త్ర ఈవెంట్ చేశాక ఎన్టీఆర్ ఇంట్లోనే నైట్ డిన్నర్ చేశాం. ఆ టైం లోనే తాను ప్రెగ్నెన్సీ తో ఉన్నా అప్పుడే పుట్టే బిడ్డ పేరు గురించి కూడా చర్చించామని అన్నారు అలియా భట్. దేవర సినిమా చూసేందుకు తాను ఆసక్తిగా ఉన్నానని అన్నారు అలియా భట్. ఇక దేవర గురిచి ఎన్టీఆర్ మరోసారి సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని చివరి 30 నిమిషాలు సినిమా నెక్స్ట్ లెవెల్ అని అన్నారు. దీనితో పాటు అలియా భట్ నటిస్తున్న జిగ్రా గురించి కూడా ఆమె చెప్పుకొచ్చారు. కరణ్ జోహార్ నిర్మించిన జిగ్రా సినిమాను వాసం బాల డైరెక్ట్ చేశారు. ఫారిన్ లో పోలీసులు అరెస్ట్ చేసిన సోదరుడిని సోదరి ఎలా కాపాడింది అనే కథతో జిగ్రా వస్తుంది. తన వరకు ఈ స్టార్ డం, ఇమేజ్ అన్ని కాదు తాను చేయాల్సిన దాని గురించి ఆలోచిస్తానని అన్నారు తారక్. అభయ్ పుట్టినప్పుడు తండ్రిగా తన ఫీలింగ్ చెప్పలేనని. నేను ఏంటి అన్నది అప్పుడు అర్ధమైందని.. ఆ తర్వాత నుంచి సినిమాల సెలక్షన్ లో కూడా మార్పు వచ్చిందని అన్నారు తారక్. జిగ్రా ట్రైలర్ గురించి తారక్ మాట్లాడుతూ ట్రైలర్ చూసి సినిమా బాగుంటుందని అనుకున్నానని అన్నారు. ఎన్టీఆర్, అలియాల మధ్య కామన్ ఫ్యాక్టర్ గురించి కరణ్ జోహార్ చెబుతూ ఇద్దరికి స్టూడెంట్ అనే పదం తోనే పాపులర్ అయ్యారని అన్నారు. తారక్ స్టూడెంట్ నెంబర్ 1 తో సక్సెస్ కొట్టగా.. అలియా భట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ తో తెరంగేట్రం చేసిందని చెప్పారు. దేవర సినిమా చూసేందుకు తాను ఆసక్తిగా ఉన్నానని అలియా భట్ చెప్పగా జిగ్రా కూడా సక్సెస్ అందుకోవాలని తారక్ అన్నారు. దేవర సినిమా హిందీ లో కరణ్ జోహార్ రిలీజ్ చేస్తున్నారు. దేవర ఈ నెల 27న రిలీజ్ అవుతుండగా జిగ్రా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

# నితిన్ 'రాబిన్ హుడ్'.. కొత్త మ్యాటర్ ఏంటంటే?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్.. సరైన హిట్ కోసం కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. వరుసగా సినిమాలు చేస్తున్నా.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోతున్నారు. రీసెంట్ గా ఎక్స్ ట్రా ఆర్డినరీ మూవీతో వచ్చిన నితిన్.. ఊహించని డిజాస్టర్ అందుకున్నారు. దీంతో తన అప్ కమింగ్ మూవీలపైనే నమ్మకం పెట్టుకున్నారు. ప్రస్తుతం రెండు సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. ఆ ప్రాజెక్టుల షూటింగ్స్ లో కంటిన్యూగా పాల్గొంటున్నారు. అందులో ఒకటి తమ్ముడు మూవీ కాగా.. మరొకటి రాబిన్ హుడ్. గతంలో నితిన్ కు భీష్మతో మంచి హిట్ అందించిన డైరెక్టర్ వెంకీ కుడుములనే రాబిన్ హుడ్ మూవీని తెరకెక్కిస్తున్నారు. దీంతో మరోసారి మ్యాజిక్ రిపీట్ అవుతుందని సినీ ప్రియులతో పాటు నితిన్ ఫ్యాన్స్ ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. అయితే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఆ మూవీ 2024లోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 20న విడుదల అవ్వనుంది. %ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్న రాబిన్ హుడ్ మూవీలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. అయితే యాక్షన్ అండ్ హీస్ట్ కామెడీ జోనర్ లో రూపొందుతున్న ఆ సినిమా నుంచి ఆదివారం మేకర్స్ కొత్త అప్డేట్ ఇచ్చారు. ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్ లో ప్రస్తుతం మూవీ షూటింగ్ జరుగుతున్నట్లు వెల్లడించారు. హీరోహీరోయిన్ల పై పెర్ఫెక్ట్ డ్యూయెట్ సాంగ్ షూట్ చేస్తున్నట్లు తెలిపారు. జీవీ ప్రకాష్ కుమార్ బాణీలు కట్టిన డ్యూయెట్ సాంగ్ కు కృష్ణ కాంత్ లిరిక్స్ అందించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. మెల్ బోర్న్ చుట్టూ ఉన్న బ్యూటిఫుల్ లొకేషన్స్ లో చిత్రీకరిస్తున్నారు. నితిన్, శ్రీలీల మధ్య కెమిస్ట్రీ సాంగ్ కు హైలెట్ గా నిలవనున్నట్లు తెలుస్తోంది. అయితే డ్యూయెట్ సాంగ్ తో పాటు బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ సహా ప్రధాన తారగణంతో కూడిన కీలక సన్నివేశాలు కూడా మేకర్స్ ఆస్ట్రేలియాలో షూట్ చేయనున్నారు. ఇక మిగతా వివరాలకు వస్తే.. రాబిన్ హుడ్ మూవీలో నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ కీలకపాత్ర పోషిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా సాయి శ్రీరామ్ వ్యవహరిస్తున్నారు.

ఎడిటర్ గా కోటి, ఆర్ట్ డైరెక్టర్ గా రామ్ కుమార్ బాధ్యతలు వహిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా మేకర్స్ సినిమాను విడుదల చేయనున్నారు. మరి ఈ మూవీతో నితిన్ ఎలాంటి విజయం అందుకుంటారో వేచి చూడాలి.

## నెపో కిడ్స్ని రేసులో వెనక్కి నెట్టిన బోల్డ్ బ్యూటీ

బాలీవుడ్‌లో పాపులర్ కథానాయికలతో పోటీపడుతూ రేసులో నిలదొక్కుకోవాలంటే నేటితరం కథానాయికలు ఎలాంటి ప్రణాళికలతో ఉండాలి?.. దీనికి పక్కా సమాధానం జాన్వీకపూర్ ప్లానింగ్. సాటి నెపో కిడ్స్ అయిన సారా అలీఖాన్, అనన్య పాండే కంటే జాన్వీ తెలివిగా పావులు కదుపుతోంది. ఓవైపు బాలీవుడ్‌లో నటిస్తూనే, మరోవైపు సౌత్‌లో అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. నటన పరంగా, డ్యాన్సుల పరంగా జాన్వీ కపూర్ తనదైన ముద్ర వేస్తోంది. బహుశా శ్రీదేవి నటవారసురాలిగా ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ కూడా అదనంగా సహకరిస్తోంది. అయితే నటవారసులు కానివాళ్లు ఇలాంటి చోట నిలదొక్కుకునేదెలా? అంటే... ఇప్పుడు అందరి కళ్లకు కనిపిస్తున్న బ్యూటీ ట్రిప్తి దిమ్రీ. ఈ భామ ఔట్ సైడర్‌గా బాలీవుడ్‌లో ప్రవేశించినా కానీ వేగంగా ఎదిగేస్తోంది. ఇటీవల వరుసగా క్రేజీ సీక్వెల్ సినిమాల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉంది. ఓవైపు బోల్డ్ పాత్రల్లో నటిస్తూ కావాల్సిన విజయాలను ఖాతాలో వేసుకున్న ట్రిప్తి ఇటీవల యూత్‌ని ఆకర్షించే మరిన్ని చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. నేటితరంలో అత్యంత బిజీయెస్ట్ కథానాయికగా ట్రిప్తి



దూసుకెళుతోంది. అంతేకాదు ఇతర భామలతో పోలిస్తే పారితోషికాన్ని కూడా అమాంతం పెంచేసింది ఈ బ్యూటీ. ఇటీవల చాలామంది అగ్ర కథానాయికలు వరుసగా పెళ్లిళ్లతో సెటిలైపోవడం కూడా ఈతరం భామలకు కలిసొస్తోంది. ఇప్పుడు అలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ట్రిప్తీ మరింతగా బిజీ అయిపోతోంది. జాన్వీ, సారా, అనన్య, కియరా లాంటి నేటితరం కాంపిటీటర్స్ తో పోలిస్తే తన ఎంపికలు చాలా డిఫరెంట్ అని కూడా నిరూపిస్తోంది. ఆ ముగ్గురు భామలతో పోలిస్తే ట్రిప్తీ దిమ్రీ డిఫరెంట్ జానర్ లను టచ్ చేస్తోంది. రష్మిక మందన్న లాంటి సౌత్ బ్యూటీ పోటీబరిలో ఉన్నా కానీ, ట్రిప్తీ దిమ్రీకి అది అడ్డంకి కాదు అనడంలో సందేహం లేదు. ఇక ఇమేజ్ సమస్య లేకపోవడం కూడా తనకు పెద్ద ప్లస్ అవుతోంది. చాలామందితో పోలిస్తే సాంప్రదాయక పాత్రల్లో కాకుండా పూర్తిగా బోల్డ్ టచ్ ఉన్న పాత్రలను ట్రిప్తి ఎంపిక చేసుకోవడం ప్లస్ గా మారుతోంది. బుల్బుల్ – ఖలా వంటి తొలి చిత్రాలలో మంచి నటన కనబరిచిన ట్రిప్తి ఇంతలోనే యానిమల్ – బాడ్ న్యూజ్‌లో గ్లామరస్ పాత్రలతో రక్తి కట్టించింది. తదుపరి భూల్ భులయ్యా 3, ధడక్ 2 వంటి సీక్వెల్ చిత్రాలతో సత్తా చాటుతుందనడంలో సందేహం లేదు. త్వరలో విక్కీ విద్యా కా వో వాలా వీడియోలో కనిపించనుంది.

## ట్రెండీ టాక్: మగ ఆర్టిస్టులు అలా చేయొచ్చు కానీ..!

ఒక అందమైన అమ్మాయి.. అబ్బాయిని కవ్వించింది. అతడు ఆమె అందాల వలకు ఇట్టే చిక్కాడు. ఆమె వలపు బాణాలు కొంటె చూపులను తాళలేక ఆమెతో నిండా మునిగిపోయాడు. ఆ తర్వాత ఆ ఇద్దరూ బెడ్ రూమ్ లో చెలరేగిపోవడం.. ఘాటైన సన్నివేశాల్లో జీవించడం ఇవన్నీ.. వెండితెరపై వీక్షించేందుకు యువతరం ఎక్కువగా ఆసక్తిని కనబరుస్తుంది. సమస్య ఆ సన్నివేశానిది కాదు.. ఈ సన్నివేశంలో నటించిన ఆడ– మగ ఇద్దరిదీ. ఈ సన్నివేశంలో ప్లస్సు, మైనస్సు, ఎలక్ట్రాన్– ప్రోటాన్ నడుమ ఆకర్షణ అనేది చాలా సహజసిద్ధమైనది. వారిమధ్య ప్రేమ చిగురించడం అటుపై రోమాంచిత సన్నివేశంలోకి వెళ్లిపోవడం ప్రకృతి సిద్ధమైన చర్య. కానీ ఆ సన్నివేశంలో నటించిన అమ్మాయికే ఎందుకు చిక్కొచ్చి పడుతోంది. అలా ఎందుకు భరి తెగించింది? అతడితో అలా బెడ్ రూమ్ లో ఘాటైన సన్నివేశాల్లో జీవించింది అంటే తనకు వ్యక్తిగతంగా క్యారెక్టర్ ఉందా లేదా? అని ప్రశ్నిస్తుంది ఈ ప్రపంచం. నిజ జీవితంలోను ఇంచుమించు ఆ నటి అలానే ఉంటుంది! అనే అపోహ కూడా ప్రబలంగానే ఉంటుంది. ఇటీవల 'యానిమల్' చిత్రంలో రణబీర్ తో ఘాటైన సన్నివేశాల్లో జీవించిన ట్రిప్తి దిమ్రీకి ఎదురైన సమస్య ఇది. కేవలం ట్రిప్తీకి మాత్రమే



కాదు.. ఇలాంటి రెచ్చగొట్టే పాత్రల్లో కనిపించిన ప్రతి నటీమణికి ఎదురైన సమస్య ఇది. ఇలాంటి నటీమణులు ఎదుటి సమాజం ఏమని ప్రశ్నిస్తుందో భయపడాల్సిన పరిస్థితి. కొన్ని ప్రశ్నలకు తప్పించుకోవాల్సిన ధైన్యం. నటీమణి క్యారెక్టర్ ని దిగజార్చి మాట్లాడతారు. పబ్లిక్ లో దూషణలు ఎదుర్కోవాలి. ఇంట్లో వాళ్లు కూడా చివరికి దీనిపై సందేహిస్తారు. అలా చేయకూడదని వారిస్తారు. కానీ రంగుల ప్రపంచంలో అలా కుదురుతుందా? నటన అంటే ప్రతి వైవిధ్యమైన పాత్రను అందిపుచ్చుకోవడం నటించడం.. ట్రిప్తీ కూడా తాను అదే చేశానని అంగీకరించింది. నిజానికి యానిమల్ లోని ఎక్స్ అనే సన్నివేశంలో ట్రిప్తి దిమ్రీ మాత్రమే కాదు.. తనతో అర్ధనగ్నంగా జీవించిన రెచ్చిపోయి పెదవి ముద్దులు పెడుతూ, రోమాన్స్‌లో విరుచుకుపడుతూ నగ్నంగా కనిపించిన రణబీర్ క్యారెక్టర్ ని ఎందుకని దూషించరు? అతడు మగాడు కాబట్టి అలా చేయొచ్చనే సాంప్రదాయ భారతీయ ఔట్ డేటెడ్ తరం పురుషపుంగవుల అజ్ఞానం అని అనుకోవాలా? యానిమల్ – బ్యాడ్ న్యూజ్ వంటి చిత్రాల్లో ఘాటైన రోమాంచితమైన వివాదాస్పద పాత్రలను పోషించిన ట్రిప్తీ దిమ్రీని ఎవరైనా పెళ్లి చేసుకుంటారా? అంటూ ఒక నెటిజన్ ఎక్స్ ఖాతాలో ప్రశ్నించాడు. అతడి ఉద్దేశం ఆ యువతి నిజ జీవితంలోను చెడిన యువతి అనేదే కదా! కానీ ట్రిప్తీ దిమ్రీ తన పనిని సమర్థించుకోవడానికి ముందుకు వచ్చారు. సినిమా అంటే నిజ జీవితంలోని సంక్లిష్టతలను చూపించాలి. వీక్షకులకు వారు ఏమి చూడాలనుకుంటున్నారో .. ఏమి చూడకూడదో ఎంచుకునే హక్కు ఉంది. కానీ ఇలా ఒకరిని దూషించే హక్కు లేదు! మగాళ్లు అయితే ఒకలా, ఆడాళ్లు అయితే ఇంకోలా చూడటం సమాజానికి తగదు. వెండితెరపై రొమాన్స్ చేయడంలో ఆడా – మగా ఇద్దరిదీ సమాన పాత్ర. దానికి సమానత్వాన్ని ఆపాదించాలి. ఇకనైనా మేల్ పక్షపాతానికి బాయ్ బాయ్ చెప్పాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536